అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 31-8-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 191 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ఉపాధి నిధులు చాలట్లేదు

సర్కారు నిర్ణయాలతో గ్రామీణ పేదలపై ప్రతికూల ప్రభావం!



- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు సీపీఐ(ఎం) నేత బృందాకరత్ లేఖ

వివరాలు 3లో..

దేశంలోని ఈడీ, సీబీఐ, ఆదాయపన్ను వంటి సంస్థలు ఇప్పటికే మోడీ ప్రభుత్వ తాబేదారులుగా మారిపోయాయి. ఇప్పుడు ఆ జాబితాలో విదేశీ నిఘా సంస్థలు కూడా చేరాయి. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దొడ్డిదారిన సేకరించి, రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే దిశగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్ టెక్నాలజీ సంస్థల నుండి శక్తివంతమైన నిఘా పరికరాలను కొనుగోలు చేస్తోంది. పెగాసస్ స్పైవేర్ వివాదం సద్దుమణగక ముందే మోడీ ప్రభుత్వం మరోసారి బరితెగించింది.



వివరాలు 3లో..

ప్రజలపై నిఘా..

ఇజ్రాయిల్ సంస్థల నుండి పరికరాలు కొంటున్న మోడీ ప్రభుత్వం

మెగా డీఎస్సీ కాదు...దగా డీఎస్సీ



టీపీసీసీ చీఫ్ రేవంత్ ట్వీట్

వివరాలు 3లో..

ఉపాధ్యాయ బదిలీలకు హైకోర్టు పచ్చజెండా

(మొదటిపేజీ తరువాయి)

పాయింట్లను కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన హైకోర్టు.. జీవో 5పై స్టే ఇస్తూ మార్చి 14న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బదిలీలతోపాటు పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది.

మధ్యంతర ఉత్తర్వులు ఎత్తేయాలని కోరుతూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం వద్ద బుధవారం సుదీర్ఘ వాదనలు జరిగాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు చిక్కుడు ప్రభాకర్, పీవీ కృష్ణయ్య, ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ రామచంద్రరావు వాదించారు. నిబంధనల సవరణ చట్ట ప్రకారం జరగలేదని చిక్కుడు ప్రభాకర్ వాదించారు. నిబంధనల్లో మార్పులు జీవో ద్వారా చేయడానికి వీల్లేదని.. అసెంబ్లీ ఆమోదంతో గవర్నర్ చేయాలని న్యాయవాది కృష్ణయ్య వాదించారు. భార్యభర్తల కేటగిరీ అమలు చేయాల్సి వస్తే ప్రైవేట్ ఉద్యోగులకూ అమలు చేయాలన్నారు.

బదిలీలకు సంబంధించిన నిబంధనలు రూపొందించే అధికారం ప్రభుత్వానికి ఉందని.. ఈనెల 5న అసెంబ్లీలో జీవో నెంబర్ 5కు చట్టబద్ధత కల్పించిందని అదనపు అడ్వకేట్ జనరల్ రామచంద్రరావు వాదించారు. దీంతో ఉపాధ్యాయ బదిలీలపై ఉన్న స్టేను ఎత్తేసింది. అయితే ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ఇస్తున్న ప్రత్యేక పాయింట్లను తొలగించింది. ఉపాధ్యాయ దంపతులకు ఇస్తున్న స్పౌజ్ పాయింట్లను కొనసాగించింది.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

ఉపాధ్యాయుల బదిలీలపై స్టేను ఎత్తేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి. ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : టీఎస్ యూటీఎఫ్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌పై ఏడు నెలలుగా కొనసాగుతున్న స్టేను ఎత్తేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. గుర్తింపు సంఘాల రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ప్రత్యేక పాయింట్లను తాత్కాలికంగా తొలగిస్తూ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. ఎనిమిదేండ్లుగా పదోన్నతులు, ఐదేండ్లుగా బదిలీలు జరగకపోవడంతో వేలాది పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తీరని నష్టం కలుగుతున్నదని తెలిపారు. ఇప్పటికే తీవ్రమైన జాప్యం జరిగినందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే షెడ్యూల్‌ను ప్రకటించి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు.

బదిలీల ప్రక్రియను కొనసాగించాలి : పీఆర్టీయూటీఎస్

బదిలీలపై ఉనడున స్టేను హైకోర్టు తొలగించినందున వెంటనే ఆ ప్రక్రియను కొనసాగించాలని పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తెలిపారు. పదోన్నతుల ప్రక్రియ పూర్తయితేనే ఖాళీల సంఖ్య పూర్తిగా తెలుస్తుందని వివరించారు. ఉద్యోగ నోటిఫికేషన్ పదోన్నతుల తర్వాత ప్రకటించాలని కోరారు. దానివల్ల పోస్టుల సంఖ్య పెరిగి నిరుద్యోగులకు లాభం చేకూరుతుందని సూచించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ఇచ్చే పది ప్రత్యేక పాయింట్లను నిలిపేయడం పట్ల ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం పర్వతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యసంఘాల నాయకులకైనా పది పాయింట్లను కేటాయించాలని కోరారు. షెడ్యూల్‌ను ప్రకటించి బదిలీలు, పదోన్నతులు సజావుగా కొనసాగించాలని టీపీటీఎఫ్ అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి తెలిపారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని టీఆర్టీఎఫ్ అధ్యక్షులు కావలి అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కటకం రమేష్ డిమాండ్ చేశారు. వెంటనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను మొదలెట్టాలని పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌జీహెచ్‌ఎంఏ అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి తెలిపారు. హైకోర్టు తీర్పును అనుసరించి బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీఎస్‌పీటీఏ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ప్రధాన కార్యదర్శి పిట్ల రాజయ్య కోరారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని స్పౌజ్ ఫోరమ్ అధ్యక్షులు వివేక్ తెలిపారు.

కావేరీ జల వివాదం

- తమిళనాడుకు నీరు విడుదల చేసిన కర్ణాటక

మైసూర్ : కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సిడబ్ల్యూఎంఎ) ఆదేశాలకు అనుగుణంగా కర్ణాటక తన రిజర్వాయర్ల నుంచి తమిళనాడుకు నీటిని విడుదల చేయడం ప్రారంభించింది. మాండ్య జిల్లాలోని కృష్ణరాజ సాగర్ (కెఆర్‌ఎస్) రిజర్వాయర్ నుంచి, మైసూర్ జిల్లాలోని కబిని రిజర్వాయర్ నుంచి అవుట్ ఫ్లోను పెంచింది. మంగళవారం రాత్రి నుంచి అవుట్ ఫ్లోను పెంచినట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నాటికి వీటి నుంచి తమిళనాడుకు 6,398 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. సెప్టెంబరు 12 వరకూ అంటే 15 రోజుల పాటు నీటిని విడుదల చేయాలని కర్ణాటకను సిడబ్ల్యూఎంఎ మంగళవారం ఆదేశించింది. తమిళనాడుకు నీటిని విడుదల చేస్తే ఆందోళనలు నిర్వహిస్తామని రైతు సంఘాలు హెచ్చరించినా కర్ణాటక ప్రభుత్వానికి ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. కావేరీ జల వివాదం కేసు విచారణ ఈ వారంలో సుప్రీంకోర్టులో జరగనుంది. ఈ నేపథ్యంలోనూ నీటిని విడుదల చేసింది. వర్షాభావ పరిస్థితులు కారణంగా కావేరీ రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. కెఆర్‌ఎస్ రిజర్వాయర్ వద్ద బుధవారం నాటికి నీటిమట్టం 101.58 అడుగులుగా ఉంది. గత ఏడాది ఇదే రోజుకు 123.92 అడుగుల నీటి మట్టం ఉంది.

ఆశలన్నీ ఐఆర్‌పైనే!

(మొదటిపేజీ తరువాయి)

ఓటర్ల తుదిజాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుంది. ఆ తర్వాత ఎప్పుడైనా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశమున్నది. ఈలోపు ఐఆర్ ప్రకటిస్తారని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు. సీఎం కేసీఆర్ సైతం ఆర్థిక శాఖ అధికారులతో ఐఆర్‌పై సంప్రదించినట్టు తెలిసింది.

ఎన్నికల్లో ప్రయోజనమే కీలకం...

ఎంత శాతం ఇస్తే రాష్ట్ర ఖజానాపై ఎంత భారం పడుతుందన్న లెక్కలు ఆర్థిక శాఖ అధికారులు వేసినట్టు సమాచారం. 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం ఉద్యోగుల జీతభత్యాలకు రూ.38,627.52 కోట్లు కేటాయించింది. ప్రతినెలా జీతాలు, పెన్షన్లకు కలిపి రూ.4,500 కోట్లు ఖర్చవుతున్నది. అయితే ఒక శాతం ఐఆర్ ఇస్తే నెలకు రూ.30 కోట్లు ప్రభుత్వంపై అదనంగా భారం పడనుంది. ఈ లెక్కన నెలకు ఐదు శాతానికి రూ.150 కోట్లు, పది శాతానికి రూ.300 కోట్లు, 15 శాతానికి రూ.450 కోట్లు ఖర్చవుతాయి. అయితే సెప్టెంబర్ నుంచి అమలు చేయాలా? లేక అక్టోబర్ నుంచి అమలు చేయాలా? అన్న దానిపై సమాలోచనలు జరుగుతున్నాయి. ఏదైనా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రయోజనం కలిగేలా సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని నిపుణులు చెప్తున్నారు. అంటే ఎన్నికలకు ముందే ప్రకటించిన ఐఆర్‌తో కలిపి ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొత్త వేతనాలు తీసుకోవాలి. అప్పుడే బీఆర్‌ఎస్ అనుకున్నట్టుగా ఎన్నికల్లో లాభం కలుగుతుంది. ఈ నేపథ్యంలో వచ్చేనెలలోనే ఐఆర్ ప్రకటించి అక్టోబర్‌లో పెరిగిన వేతనాలు పొందుతారంటూ సీఎం ప్రకటించే అవకాశమున్నది. అంతకుముందు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కేసీఆర్ సమావేశమవుతారని తెలుస్తున్నది. ఆ తర్వాతే ఐఆర్‌పై నిర్ణయం తీసుకుంటారని సమాచారం. ఇంకోవైపు పీఆర్సీ కమిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం కసరత్తును ప్రారంభించినట్టు తెలిసింది. అందుకోసం సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం.

పీఎఫ్ఆర్డీఏను రద్దు చేయాలంటున్న ఉద్యోగులు

'పాత పెన్షన్ పునరుద్ధరణ పట్ల సానుకూల దృక్పథంతో ప్రభుత్వం ఉంది. ఆలోచించి నిర్ణయం తీసుకుంటుంది.'అంటూ అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీనిపై సీపీఎస్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశాయి. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు రాజస్థాన్ ఛత్తీస్‌ఘడ్ జార్ఖండ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేస్తున్నాయి. అయితే సీపీఎస్‌ను రద్దు చేయాలంటూ ఉద్యోగుల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ఆర్థిక శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం పట్ల ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) చట్టాన్ని రద్దు చేయాల్సిందేనని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా 84 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓపీఎస్ పరిధిలోకి వస్తారు. తెలంగాణలో 1.72 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రయోజనం కలుగుతుంది. అందువల్ల కేంద్రం నిర్ణయం తీసుకోకుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి దక్షిణాదిలో తొలిరాష్ట్రంగా నిలవాలని వారు కోరుతున్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తే రాష్ట్ర ప్రభుత్వానికి అదనంగా భారం పడదు. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగులకు చెందిన రూ.16,500 కోట్లు ఎన్‌పీఎస్ ట్రస్టులో ఉన్నాయి. సీపీఎస్‌ను రద్దు చేస్తే ఆ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వమే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవడానికి వీలవుతుందని విద్యావేత్తలు చెప్తున్నారు.

యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో 1న చలో హైదరాబాద్

సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు ఉద్యమబాట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమ కార్యాచరణను ప్రకటించాయి. అందులో భాగంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో దశలవారీ పోరాట కార్యక్రమాన్ని నిర్వహించింది. మండల, జిల్లా స్థాయిలో నిరసనలు చేపట్టింది. వచ్చేనెల ఒకటిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. 'పీఆర్సీ కమిటీని వేయాలనీ, జులై ఒకటి నుంచి ఐఆర్ మంజూరు చేయాలనీ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నియామకాలు చేపట్టాలనీ, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనీ, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఆ వ్యవస్థను రద్దు చేయాలనీ, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలనీ, సీఎం కేసీఆర్ హామీ మేరకు 5,571 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలనీ, ఎస్‌ఈపీని రద్దు చేయాలనీ, ఐటీ మినహాయింపు పరిమితిని పెంచాలనీ, రూ.398 స్పెషల్ టీచర్ల సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలనీ, 2004, సెప్టెంబర్ ఒకటికి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు ఓపీఎస్ ఇవ్వాలనీ, ట్రెజరీల్లో ఆమోదం పొంది ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులంటినీ సత్వరమే చెల్లించాలనీ, పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి'అంటూ యూఎస్‌పీసీ డిమాండ్ చేస్తున్నది. వచ్చేనెల ఒకటిన పెన్షన్ విద్రోహదినం పాటిస్తున్నట్టు ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ప్రకటించింది. పాఠశాల స్థాయిలో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలనీ, భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేయాలని కోరింది.

సింగపూర్‌కు బియ్యం ఎగుమతులు

- అనుమతించిన కేంద్రం

న్యూఢిల్లీ : బియ్యం ఎగుమతులపై నిషేధం విధించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం తాజాగా సింగపూర్‌కు మినహాయింపు ఇచ్చింది. రెండు దేశాల మధ్య 'అత్యంత సన్నిహితమైన వ్యూహాత్మక భాగస్వామ్యం' ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. ధరల పెరుగుదలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం జూలైలో బాసుమతి యేతర బియ్యం ఎగుమతులపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. నిషేధం నుండి మినహాయింపు ఇవ్వాలంటూ సింగపూర్ ప్రభుత్వం అప్పటి నుండీ భారత్‌తో చర్చలు జరుపుతూనే ఉంది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం సింగపూర్‌కు బియ్యం ఎగుమతులను అనుమతిస్తూ అధికారికంగా ప్రకటన చేసింది.

'భారత్, సింగపూర్ మధ్య అత్యంత సన్నిహితమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. పరస్పర ప్రయోజనాలు ఉన్నాయి. ఆర్థిక సంబంధాలు కొనసాగుతున్నాయి.

రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలు కూడా బలంగా ఉన్నాయి' అని విదేశాంగ ప్రతినిధి అరిందమ్ బగ్చీ మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక సంబంధాల కారణంగా సింగపూర్ ఆహార భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకొని బియ్యం ఎగుమతులను అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన వివరించారు.

ప్రపంచంలోని 40కి పైగా దేశాలు తమ బియ్యం దిగుమతులలో 50%కి పైగా భారత్ నుండే పొందుతున్నాయి. కొన్ని ఆఫ్రికా, దక్షిణాసియా దేశాలైతే తమ బియ్యం అవసరాలలో 80% భారత్ నుండే సేకరిస్తున్నాయి. సింగపూర్ దిగుమతి చేసుకుంటున్న బాసుమతి యేతర బియ్యంలో 17% మన దేశం నుండి పొందుతున్నదే.

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

గురువారం 31-8-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 191 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

నేడు, రేపు 'ఇండియా' కూటమి భేటీ



వివరాలు 9లో..



దేశంలోని ఈడీ, సీబీఐ, ఆదాయపన్ను వంటి సంస్థలు ఇప్పటికే మోడీ ప్రభుత్వ తాబేదారులుగా మారిపోయాయి. ఇప్పుడు ఆ జాబితాలో విదేశీ నిఘా సంస్థలు కూడా చేరాయి. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దొడ్డిదారిన సేకరించి, రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే దిశగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్ టెక్నాలజీ సంస్థల నుండి శక్తివంతమైన నిఘా పరికరాలను కొనుగోలు చేస్తోంది. పెగాసస్ స్పైవేర్ వివాదం సద్దుమణగక ముందే మోడీ ప్రభుత్వం మరోసారి బరితెగించింది.

ప్రజలపై నిఘా..

ఇజ్రాయిల్ సంస్థల నుండి పరికరాలు కొంటున్న మోడీ ప్రభుత్వం

- టెలికం కంపెనీల ద్వారా సమాచార సేకరణ
- సహకరిస్తున్న భద్రతా సంస్థలు

న్యూఢిల్లీ : లండన్ నుండి పనిచేస్తున్న 'ది ఫైనాన్షియల్ టైమ్స్' పత్రిక ప్రచురించిన సంచలన కథనం ప్రకారం... నిఘా వ్యవస్థకు సంబంధించిన హార్డ్‌వేర్‌ను విదేశీ సంస్థలు సముద్ర గర్భంలోని కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లకు అనుసంధానం చేస్తారు. దీనిని దేశీయ టెలికం సంస్థలు ఉపయోగించుకొని భద్రతా సంస్థలకు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని, ఇతర వివరాలను అందజేస్తాయి. ఇదంతా పైకి చూడడానికి చట్టబద్ధంగానే జరుగుతోంది. ఈ హార్డ్‌వేర్ కోసం కృత్రిమ మేధ, డాటా ఎనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలను నిఘా సంస్థలు ఉపయోగించుకుంటున్నాయి. భారత్‌కు, ప్రపంచంలోని ఇతర దేశాలకు మధ్య సమాచార మార్పిడి కోసమే సముద్ర గర్భంలోని కేబుల్స్‌ను ఉపయోగించుకుంటున్నామని చెబుతున్నప్పటికీ శక్తివంతమైన నిఘా పరికరాలను విక్రయించే ప్రైవేటు కంపెనీలకు మార్గం సుగమం చేయడమే దీని ప్రధాన ఉద్దేశంగా కన్పిస్తోంది. మన ...9లో

కఠిన నిబంధనలేవి?

ఇతర ప్రజాస్వామిక దేశాలలో ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉంటాయి. సముద్ర గర్భంలోని కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు, డాటా సెంటర్లలో నిఘా పరికరాలను అమర్చే టెలికం కంపెనీలు కొన్ని షరతులకు లోబడి ప్రభుత్వ అనుమతులు పొందాల్సి ఉంటుంది. అయితే మన దేశంలో ఇలాంటివేమీ లేవు. అమెరికా, బ్రిటన్ దేశాలలోని సంస్థలు ఇలాంటి దొడ్డిదారి ఏర్పాట్ల ద్వారా పెద్ద ఎత్తున నిఘాకు పాల్పడుతున్నాయని, ప్రభుత్వ ఒత్తిడితో టెలికం కంపెనీలు అధికారికంగానే వినియోగదారుల సమాచారాన్ని సేకరిస్తున్నాయని స్నోడెన్ టేపులు బయటపెట్టడంతో దుమారం చేలరేగింది. చివరికి 'నిఘా' కోసం ప్రభుత్వాల నుండి అభ్యర్థలను వచ్చిన సందర్భంలో అందుకు కోర్టు అనుమతి తీసుకోవాలని ఆ కంపెనీలు నిర్ణయించాయి

ఉపాధి నిధులు చాలట్లేదు

సర్కారు నిర్ణయాలతో గ్రామీణ పేదలపై ప్రతికూల ప్రభావం!

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు సీపీఐ(ఎం) నేత బృందాకరత్ లేఖ



న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పలు విధాన నిర్ణయాలతో తలెత్తుతున్న ప్రతికూల ప్రభావాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ కేంద్రం దృష్టికి తీసుకెళ్ళారు. ఈ మేరకు ఆమె, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. కార్మికుల హక్కులకు సంబంధించిన క్లాజులు, చట్టాన్ని ఖరారు చేయడంలో క్రియాశీలంగా పాల్గొన్న వ్యక్తిగా, డిమాండ్ ఆధారిత పనుల విషయంలో కార్మికుల హక్కులు రాజీ పడుతుండడంపై తాను తీవ్రంగా ఆందోళన చెందుతున్నానని బృందాకరత్ పేర్కొన్నారు. ఈ పథకం కింద జరిగే నిధుల కేటాయింపులు ఏమాత్రమూ సరిపోవడం లేదని తెలిపారు.

మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో డేటా ప్రకారం కేటాయించిన వాటిలో 91శాతం నిధులు ఇప్పటికే ఖర్చు చేశారు. ప్రస్తుత సగటు పనిదినాలు కేవలం 35.4 రోజులుగా వున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. పని ప్రదేశాల్లో హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం, ఆధార్ కార్డు ప్రాతిపదికగా చెల్లింపులు వంటి తప్పనిసరి నిబంధనలు, చట్టంలో ...9లో



మెగా డీఎస్సీ కాదు...దగా డీఎస్సీ



టీపీసీసీ చీఫ్ రేవంత్ ట్వీట్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

మెగా డీఎస్సీ ప్రకటించాలంటూ అభ్యర్థులు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తోందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఈమేరకు బుధవారం ట్వీట్ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ మెగా డీఎస్సీ కాదనీ, అది ఎన్నికల కోసం కేసీఆర్ ప్రకటించిన దగా డీఎస్సీ అని రేవంత్ ఎద్దేవా చేశారు. విద్యాశాఖ గణాంకాల ప్రకారం 21వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సీఎం ప్రకటన ప్రకారం 13వేల పోస్టుల ఖాళీగా ఉంటే, నోటిఫికేషన్లు మాత్రం ఐదువేలకు విడుదల చేసిందని విమర్శించారు.

చేతి గుర్తు మా చిహ్నం... చేసి చూపించడమే మా నైజం

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రధాన హామీల్లో ఒకటైన గృహలక్ష్మి పథకాన్ని బుధవారం మైసూరులో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రారంభించారని రేవంత్ మరో ట్వీట్ చేశారు. 'చేతి గుర్తు మా చిహ్నం...చేసి చూపించడమే మా నైజం' అని పునరుద్ఘాటించారు. 'కారు' కూతలు రావు'...జూటా' మాటలు లేవు' అంటూ బీఆర్ఎస్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కర్నాటక ప్రజలకు ఇచ్చిన ఐదు హామీల్లో నాలుగింటిని నెరవేర్చి కాంగ్రెస్ పార్టీ చరిత్ర సృష్టించిందని తెలిపారు. 'వస్తున్నాం తెలంగాణ లోనూ, అమలు చేస్తాం ఇచ్చిన హామీలను' అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ...9లో

ఉపాధ్యాయ బదిలీలకు హైకోర్టు పచ్చజెండా

టీచర్ల దంపతులకు అదనపు పాయింట్లు

- సంఘాల నేతలకు పాయింట్లు నిలిపివేత



హైదరాబాద్ : రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. ఉపాధ్యాయుల దంపతులకు అదనపు పాయింట్లు కేటాయించడానికి తెలంగాణ ప్రభుత్వానికి అనుమతి ఇస్తున్నట్టు స్పష్టంచేసింది. భార్యాభర్తలు కలిసి ఉండాలన్నది ఆ నిబంధన ఉద్దేశమంటూ ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే ఉపాధ్యాయ సంఘాల అధ్య, కార్యదర్శులకు బదిలీల్లో ప్రాధాన్యమివ్వడం సమర్థనీయం కాదని పేర్కొంది. ఉపాధ్యాయ సంఘాల నేతలకు అదనపు పాయింట్లు ఇవ్వకుండా బదిలీలు చేయాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ బదిలీలన్నీ తుది తీర్పునకు లోబడి ఉండాలని స్పష్టం చేసింది. బదిలీల జీవోపై గతంలో ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను సవరించింది. దీంతో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు మార్గం సుగమమైంది.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం జనవరిలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో యూనియన్ నేతలకు, టీచర్ దంపతులకు ప్రాధాన్య మిస్తూ వారి సర్వీసులకు అదనంగా పది పాయింట్లను కేటాయించారు. ఫిబ్రవరిలో వెబ్ కౌన్సెలింగ్‌లో బదిలీల కోసం 73,803 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. అయితే భార్యభర్తలు, యూనియన్ల నేతలకు అదనపు ...2లో

పాతబస్తీలో దారుణం

యువతిపై నకిలీ బాబా లైంగికదాడి



నవతెలంగాణ – ధూల్ పేట్

హైదరాబాద్ పాతబస్తీలోని బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. మంత్రాల పేరుతో 21 ఏండ్ల యువతిపై ఓ నకిలీ బాబా లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీ నగర్ ప్రాంతానికి చెందిన బాధిత యువతికి 3 నెలల కిందట పెండ్లయింది. కాగా, ఆమెకు ఆరోగ్యం బాగాలేదని గత నెల బండ్లగూడ ప్రాంతానికి చెందిన ...9లో

ఆశలన్నీ ఐఆర్‌పైనే!

పీఆర్సీ కమిటీ కోసం ఎదురుచూపు

- అసెంబ్లీలో, స్వాతంత్ర్య దినోత్సవంలో కేసీఆర్ హామీ
- సీపీఎస్‌ను రద్దు చేయాలంటూ ఉద్యోగుల డిమాండ్
- త్వరలో సంఘాలతో సీఎం భేటీ?
- ఉద్యమబాటలో ఉపాధ్యాయులు




నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించాలని కోరుతున్నారు. ఈ ఏడాది జూన్ 30తో మొదటి పీఆర్సీ గడువు ముగిసింది. జులై ఒకటి నుంచి కొత్త వేతనాలు అమలు కావాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిటీని ఇంత వరకు నియమించలేదు. అయితే పీఆర్సీ కమిటీ వేస్తామనీ, ఐఆర్ ప్రకటిస్తామని ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆశలన్నీ ఐఆర్‌పైనే ఉన్నాయి. అక్టోబర్ నాలుగున రాష్ట్రంలోని ...2లో

స్మైల్ ప్లీజ్ !

విక్రమ్ ల్యాండర్‌ని ఫొటో తీసిన ప్రజ్ఞాన్ రోవర్

- విడుదల చేసిన ఇస్రో



బెంగళూరు : విక్రమ్ ల్యాండర్ ఫొటోను ప్రజ్ఞాన్ రోవర్ క్లిక్ మనిపించింది. రోవర్‌లోని నావిగేషన్ కెమెరాలు బుధవారం ఉదయం ఈ చిత్రాన్ని తీశాయని ఇస్రో తెలిపింది. చంద్రయాన్–3లోని నావిగేషన్ కెమెరాలను లేబరేటర్ ఫర్ ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్స్ (ఎల్ఇఒఎస్) అభివృద్ధిపరిచిందని ఇస్రో వెల్లడించింది. చంద్రుని ఉపరితలంపై దిగిన కాసేపటికి బయటకు వచ్చిన ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడిపై తిరుగుతోంది. ఫొటోలు తీస్తూ, తనకు అప్పగించిన ప్రయోగాలను నిర్వహిస్తోంది. చాస్ట్ (చంద్రుని ఉపరితలంపై థెర్మోఫిజికల్ ప్రయోగం), ఐఎల్ఎస్ఎ (ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ లూనార్ సెస్మిక్ యాక్టివిటీ)లను మోహరించడం ల్యాండర్ చిత్రంలో కనిపిస్తోంది. ల్యాండర్‌లోని నాలుగు పేలోడ్‌లలో ఈ రెండు ఉన్నాయి. చాస్ట్ పేలోడ్‌తో దక్షిణ ధృవం వద్ద చంద్రుని ఉపరితలంపై గల మట్టి ఉష్ణోగ్రతలను లెక్కిస్తారు. ల్యాండ్ అయిన ప్రదేశంలో నేల కంపించిన తీవ్రతను గణించడం ఐఎల్ఎస్ఎ లక్ష్యంగా వుంది. ఈ ప్రాంతంలో సల్ఫర్ వుందని రోవర్‌లోని ఎల్ఐబిఎస్ పరికరం మంగళవారం ధ్రువీకరించింది. ఆర్బిటర్లలోని పరికరాల వల్ల గతంలో ఇది సాధ్యం కాలేదని ఇస్రో పేర్కొంది.

మెదక్‌లో సీటు దక్కేదెవరికి..?

అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ నేతల పోటాపోటీ



- కీలక నాయకులకు తొలి జాబితాలో చోటు
- పటాన్‌చెరు, మెదక్, నర్సాపూర్‌లో బీఆర్ఎస్, బీజేపీ లీడర్లపై ఫోకస్
- వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న గాంధీభవన్

నవతెలంగాణ–మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కొట్లాట ఒక ప్రహసనంలా మారింది. అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయినప్పటికీ తొలి జాబితాలో ఎవరికి అవకాశం దక్కుతుందో అనేది మాత్రం ఇప్పట్లో తేలేటట్టు లేదు. కీలక నాయకులకు మాత్రమే మొదటి జాబితాలో ఛాన్స్ రానుందంటున్నారు. నాలుగైదు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, బీజేపీ అసమ్మతి నేతలపై ఫోకస్ పెట్టినందున అక్కడ ఇంత కాలం పనిచేసిన ఆశావహులకు నిరాశ తప్పేలా లేదు. మరికొన్ని నియోజకవర్గాల్లో ముగ్గురు నలుగురు చొప్పున టికెట్లు ఆశిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ 9 మంది అభ్యర్థుల్ని ప్రకటించింది. కాంగ్రెస్ సైతం తొలి జాబితాను ప్రకటించేందుకు సిద్ధం చేసిందని చెబుతున్నారు. సెప్టెంబర్ రెండో వారం వరకు అభ్యర్థుల్ని పూర్తి స్థాయిలో ప్రకటించే అవకాశముంది. కాంగ్రెస్‌లో ప్రభుత్వం, పార్టీ పరంగా అనేక కీలక పదవుల్లో కొనసాగిన నాయకులున్నారు. పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే టికెట్ రేసులో ఉన్న ఒకరిద్దరు నాయకులు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ సొంత జిల్లా కావడంతో వచ్చే ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచేందుకు కాంగ్రెస్ పెద్దలు ఇతర నాయకులపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్, బీజేపీలోని అసమ్మతి నాయకుల్ని చేర్చుకుని టికెట్టు ఇచ్చేందుకు పరిశీలిస్తుండటంతో ఆ స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన ఆలస్యమయ్యే అవకాశముంది.



జగ్గారెడ్డి

దామోదర రాజనర్సింహ

చంద్రశేఖర్

తొలి జాబితాలో చోటెవ్వరికో..?

ఇటీవల గాంధీ భవన్‌లో టీపీసీసీ ఎన్నికల పరిశీలనా కమిటీ సమావేశం జరిగింది. వచ్చిన దరఖాస్తుదారుల్లో ఎవరికి ప్రజల్లో ఆదరణ ఉంది. ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులేంటనే విషయాలపై సూచన ప్రాయంగా ఆ సమావేశంలో చర్చించి నట్టు వార్తలు వచ్చాయి. 40 మందితో తొలి జాబితాను ప్రకటించే అవకాశమున్నందున అందులో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎవరికి చోటు లభిస్తుందనే అంశంపై ఆసక్తి నెలకొంది. జిల్లాలో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన తిరిగి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతూ దరఖాస్తు కూడా ...9లో

సంపాదకీయం

'విద్వేష' బీజాలు

'పాపం పుణ్యం ప్రపంచమార్గం/ కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ/ ఏమీ ఎరుగని పూవుల్లారా, అయిదారేడుల పాపల్లారా!" అని మహాకవి శ్రీశ్రీ ప్రస్తావించిన అమాయక చూపుల పసివాళ్లే వాళ్లంతా! ఉపాధ్యాయులు ఏది చెబితే అది మనసుకు ఎక్కించుకునే స్వచ్ఛమైన తెల్ల కాగితాల్లాంటి మనసులు వాళ్లవి. అలాంటి చిన్నారులకు మంచి విద్యాబుద్ధులు నేర్పి, రేపటికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దటం పాఠశాలల ప్రాథమిక విధి. కానీ, బీజేపీ ఏలుబడిలో

ఏ వేదిక మీదైనా, ఏ రూపంలోనైనా బాలల్లో కుల మతోన్మాదాలను, వివక్షా విషబీజాలను నాటే వ్యక్తులను, సంస్థలను ప్రజలు మూకుమ్మడిగా వ్యతిరేకించాలి. మానవ సమాజం ఉన్నతంగా, ఉత్తమంగా పరిఢవిల్లాలంటే- స్వేచ్ఛ, సమానత్వం, సామరస్యం, సుహృద్భావం వెల్లివిరియాలి. నేహా పబ్లిక్ స్కూల్లో జరిగిన సంఘటన ఈ దేశ సహృదయులను ఎంతగా కలచివేసిందో- ఆ తరువాతి రోజు రైతు సంఘం నాయకులు, కొందరు గ్రామస్తులూ కలిసి, ఆ బాలురను కలగలిపి ఒకరినొకరు ఆలింగనం చేసుకునేలా సామరస్యం సమకూర్చిన దృశ్యం అంతగా ఆనందపరిచింది. ఇది కదా, మన దేశ సమైక్య సామరస్య సౌభ్రాతృత్వ సంస్కృతి అనిపించింది !

ఉన్న ఉత్తరప్రదేశ్‌లో తరచూ విద్యావనాలు విషవలయాలుగా వార్తలకెక్కుతున్నాయి. పిల్లల మధ్య సమానత్వం, సౌభ్రాతత్వం వెల్లివిరిసేలా పాటలూ, పాఠాలూ వల్లె వేయించాల్సిన ఉపాధ్యాయుల్లో కొందరు వక్రరీతిన వివక్షా బీజాలు నాటుతున్నారు. చెట్టపట్టాలు పట్టుకొని సమైక్య గీతాలు పాడుకోవాల్సిన పిల్లల మధ్య కుల, మత ఉన్మాదాలను జొప్పిస్తున్నారు. యూపీలోని ముజఫర్‌నగర్‌లో ఖుబ్బాపూర్ నేహా పబ్లిక్ పాఠశాలలో తాజాగా ఇలాంటి లజ్జాకరమైన సంఘటన చోటు చేసుకోవడం దేశాన్ని నివ్వెరపరిచింది. ఎక్కాలు సరిగ్గా అప్పగించలేదని రెండో తరగతిలో ఓ ముస్లిం బాలుడిని తోటి హిందూ బాలురతో రెచ్చగొట్టి మరీ కొట్టించిన ఉపాధ్యాయిని త్రిప్తాత్యాగి దుష్కృత్యం క్షమించరానిది. పదే పదే కొట్టించటం ఒక్కటే కాదు. ఆ సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. ముస్లిం పిల్లలు బాగా చదవరని, వారి తల్లులు అసలు పట్టించుకోరని ఇష్టా రీతిన ఆమె వ్యాఖ్యానించటం- పిల్లల హృదయాల్లో మత వివక్షను నాటడమే అవుతుంది.



ఇది ఈ ఒక్క పాఠశాలకే, ఈ ఒక్క ఉపాధ్యాయినికే పరిమితమైన సంఘ టనగా చూడలేము. యూపీ విద్యా సంస్థల్లో అనేక సందర్భాల్లో, అనేక రూపాల్లో ఇలాంటి వివక్షాపూరిత ఆచరణలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఎన్ఆర్సీ ఆందోళనల సమయంలో ఓ స్కూల్లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో- నాటిక ప్రదర్శించిన చిన్నారి మీద, ఆమె తల్లి మీద కూడా రాష్ట్ర ప్రభుత్వం కేసు బనాయించింది. ఆ తల్లిని జైల్లోకి నెట్టింది. చాలా పాఠశాలల్లో ఛత్రపతి శివాజీ ఏకపాత్ర, నాటికల పేరిట ముస్లిం వ్యతిరేక భావాలు బలంగా ప్రచారం పొందుతున్నాయి. పాఠ్య పుస్తకాల్లో ముస్లిం పాలకుల, స్వాతంత్ర్య సమరయోధుల పాఠాలు తొలగించబడ్డాయి.

వివిధ ఆందోళనల సందర్భంలో గట్టిగా గొంతు వినిపించిన ముస్లిం విద్యార్థుల, నాయకుల ఇండ్లు బుల్డోజర్లతో కూల్చివేయబడుతున్నాయి. యోగి ప్రభుత్వం నెలకొల్పిన ఇలాంటి వాతావరణమే పసివాళ్లు సంచరించే, పౌరులుగా వికసించే విద్యావనాల్లోనూ ప్రవేశించి, విద్వేషం చిమ్ముతోంది.

పాఠశాలలో వివక్షను, విద్వేషాన్ని వెదజల్లిన ఉదంతంపై అంతగా స్పందించని యోగి ప్రభుత్వం - ఆ సంఘటనను సోషల్ మీడియాలో ప్రచారం చేశాడన్న నెపంతో ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబేర్‌పై మరోసారి కేసు నమోదు చేసింది. బాలుడి గుర్తింపును వెల్లడి చేశారని ఆ బాలుడి కుటుంబంతో ఎలాంటి సంబంధమూ లేని విష్ణుదత్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు బాలల సంరక్షణ చట్టం కింద కేసు బనాయించింది. వాస్తవానికి ఆల్ట్ న్యూస్‌లోకి రాకముందే ఆ వీడియో విస్తారంగా వైరల్ అయింది. కానీ, తన వెబ్‌సైట్ ద్వారా వాస్తవాలను ప్రపంచానికి చాటుతున్న జర్నలిస్టుపై కక్ష సాధింపు కోసం ఈ సందర్భాన్ని కూడా యోగి ప్రభుత్వం వాడుకోజూస్తోంది. జుబేర్‌పై కొన్నేండ్లుగా అనేక ఎఫ్ఐఆర్లు నమోదు చేసి, ఒక్కొక్క కేసులో వరసగా అరెస్టు చేస్తూ, భయపెట్టడమే ధ్యేయంగా యూపీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

ఈ దురుద్దేశ ప్రయత్నాన్ని గతంలో సుప్రీం కోర్టు ఎత్తిచూపినా బీజేపీ పాలకులు తమ ద్వేషబుద్ధిని వదులుకోవడం లేదు. ఇటీవల మణిపూర్ అవమానవీయ సంఘటనల నేపథ్యంలోనూ అక్కడి బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం ఇలాగే వ్యవహరించింది. నిందితులను పట్టుకొని శిక్షించటం కన్నా ఆ సంఘటనల గురించి దేశానికి తెలిసేలా వీడియో తీసిన వారిమీదనే తొట్టతొలిగా విరుచుకుపడింది. హత్య చేయడం కన్నా ఆ హత్యను చూసి, 'అయ్యోపాపం' అనటమే మహాపరాధం అన్నట్టుగా కమలనాథుల ధర్మం అఘోరిస్తోంది.

ఏ వేదిక మీదైనా, ఏ రూపంలోనైనా బాలల్లో కుల మతోన్మాదాలను, వివక్షా విషబీజాలను నాటే వ్యక్తులను, సంస్థలను ప్రజలు మూకుమ్మడిగా వ్యతిరేకించాలి. మానవ సమాజం ఉన్నతంగా, ఉత్తమంగా పరిఢవిల్లాలంటే- స్వేచ్ఛ, సమానత్వం, సామరస్యం, సుహృద్భావం వెల్లివిరియాలి. నేహా పబ్లిక్ స్కూల్లో జరిగిన సంఘటన ఈ దేశ సహృదయులను ఎంతగా కలచివేసిందో- ఆ తరువాతి రోజు రైతు సంఘం నాయకులు, కొందరు గ్రామస్తులూ కలిసి, ఆ బాలురను కలగలిపి ఒకరినొకరు ఆలింగనం చేసుకునేలా సామరస్యం సమకూర్చిన దృశ్యం అంతగా ఆనందపరిచింది. ఇది కదా, మన దేశ సమైక్య సామరస్య సౌభ్రాతృత్వ సంస్కృతి అనిపించింది !

అచ్చేదిన్ అంటే ఇదేనా మోడీజీ!



తీగల సాగర్
9490098055

దేశంలో రోజురోజుకీ నిత్యావసర సరుకుల ధరలు హద్దూ అదుపు లేకుండా పెరుగు తున్నాయి. బియ్యానికి రెక్కలొచ్చాయి. పప్పులు కొండెక్కాయి. కూరగాయలు, నూనెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఉపాధి చట్టానికి కేటాయింపులు కుదించడంతో కూలీల బతుకులు ఆగమౌతున్నాయి. మహిళల జీవితాలు ఛిద్రమౌతున్నాయి. కుల, మత ఘర్షణలు తాండవిస్తున్నాయి. ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగాల్లేక నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. దేశంలో కోట్లాది మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. పాలకులు వీరిపై పన్నుల భారం పెంచి మరింత దారిద్ర్యంలోకి నెడుతున్నారు. నిత్యావసరాల ధరలు 2014లో ఉన్న ధరలను పరిశీలిస్తే నేడు 50శాతం నుండి 200శాతం వరకు సరుకులు పెరిగాయి. కూరగాయల ధరలు ఈ నెలలోనే 37శాతం వరకు పెరిగాయి. పప్పులు 45శాతం పెరిగాయి. బియ్యం ధర కేజీ రూ.60లకు చేరింది. నిన్నటివరకు గ్యాస్ ధరలు రూ.1200 ఉంది. అయితే వచ్చే ఐదు రాష్ట్రాల ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మోడీ నిన్న సిలిండర్‌పై రూ.200 తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. వాస్తవానికి మోడీ అధికారంలోకి రాకముందు రూ.500 ఉన్న సిలిండర్ ఏకంగా రూ.1200కు పెరిగిన విషయం గమనంలో ఉంచుకోవాలి. పాల ధరలు కూడా అందనంత దూరంగా ఎగబాకుతున్నాయి. ఇదే అదునుగా వ్యాపారస్తులు కృత్రిమ కొరతను సృష్టించి ధరలు మరింత పెంచేశారు. ధరలు అదుపు చేయాల్సిన ప్రభుత్వం వారికి కొమ్ము కాస్తున్నది. దీనికి గోరుచుట్టుపై రోకటిపోటులా మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ భారం తోడైంది. నిత్యావసర సరుకులపై 12-18శాతం పన్నులు వేయడంతో ధరల పెరుగుదల అనివార్యమైంది. పేద, మధ్య తరగతి ప్రజలు విద్య, వైద్యం కోసం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. అప్పులు చేస్తూ వడ్డీ కోరల్లో చిక్కుకుంటున్న దైన్యస్థితి నెలకొంది. కొంత మంది అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు.

సామాన్యులకు భారాలు...సంపన్నులకు రాయితీలు

అదే సందర్భంలో ప్రజల కొనుగోలుశక్తి దెబ్బతినే విధంగా ఉపాధి, ఆదాయం తగ్గింది. కరోనా తరువాత నేటికీ తిరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడలేదు. పట్టణాలలో వ్యాపారాలు, హోటళ్ళలో పనిచేసేవారు నిరుద్యోగులుగా మారారు. గ్రామీణ ప్రాంతంలో నేడు కొద్దో గొప్పో ఉపాధి దొరకుతుందంటే అది వామపక్షాల కృషితో వచ్చిన ఉపాధి హామీ చట్టం వల్లనే. దీన్ని కూడా ఎత్తివేయాలని కుట్రలు పన్నుతోంది నేటి బీజేపీ ప్రభుత్వం. కనీస జీవనాధారంగా ఉన్న ఈ చట్టానికి కేటాయింపులు తగ్గించారు. 2021-22లో రూ.98,468 కోట్లు, 2022-23లో రూ.89,400 కోట్లు, 2023-24లో రూ.60వేల కోట్లకు తగ్గించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఒక్క ఆధారం తగ్గడంతో 40శాతం ప్రజలు పౌష్టికాహారలోపంతో ఇబ్బందులు పడుతున్నారు. 57శాతం మహిళలు, 67శాతం పిల్లలు రక్తహీ నతతో బాధపడు తున్నారని మానవవనరుల అభి వృద్ధి సూచిక పేర్కొన్నది. పేదరికంలో ప్రపంచంలోని 121 దేశాలలో మన దేశం 107వ ర్యాంకులో ఉంది. 2016 నుండి మనదేశ ర్యాంకు పడిపోతూనే వున్నది. ఇప్పటికే 19శాతం గ్రామాల్లో మరుగు దొడ్ల సౌకర్యం లేదు. ఓ వైపు కనీసం ఉండటానికి గూడు కూడా లేని పేదలపై భారాలు వేస్తూ, ప్రజావ్యతిరేక విధా నాలను అమలు చేస్తూ మరోవైపు కార్పొరేట్లకు, పెట్టు బడిదారులకు లక్షల కోట్ల రూపాయలను రాయితీలిస్తున్నది.

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలెక్కడ?

మన దేశంలో యువత 65శాతం వరకు వున్నారు. వీరికి ఉపాధి, ఉద్యోగం కరువై నిరుద్యోగులుగా తిరుగు తున్నారు. డిగ్రీలు, పిజీలు చదివిన వారు కూడా కూలి పనులకు వెళు తున్నారు. 2014 ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని మోడీ హామినిచ్చారు. కానీ ఆచరణలో వున్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయి.ఈ కాలంలో దాదాపు ఒక కోటి 50లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్షలాదిగా ఖాళీలున్నాయి. వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం సిద్ధపడటం లేదు. దళిత, గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులు నింపడం లేదు. సైన్యంలో రిక్రూట్‌మెంట్ కొరకు యువత ఎదురు చూస్తున్న తరుణంలో అగ్నిపథ్ పేరుతో కాంట్రాక్ట్ ఉద్యోగాలను నింపాలని చూసింది. దీన్ని యువత పెద్దఎత్తున వ్యతిరేకించి, ఆందోళనలు చేసింది. అయినా మోడీ ప్రభు త్వం అమలు చేసింది. నేడు దేశంలో నిరుద్యోగం 10శాతం వరకు వున్నదని లెక్కలు చెపుతున్నాయి. ప్రయివేటు కంపెనీ లలో నిర్దాక్షిణ్యంగా ఉద్యోగులను తొలగిస్తున్నారు. దీంతో పాటు మోడీ సర్కార్ లేబర్‌కోడ్‌లు తెచ్చి కార్పొరేట్‌లకు రక్షణ కల్పిస్తున్నది. యువతే దేశానికి దిక్సూచి అని ప్రగల్భాలు పలుకుతున్న మోడీ ప్రభుత్వం యువతను నిర్వీర్యం చేస్తున్నది. వారి అసంతృప్తి మతోన్మాదంవైపు మళ్లించి చెలగాట మాడుతున్నది. దీనికితోడు దళిత, గిరిజన, మైనారిటీలకు కేటాయి ంచిన ఉప ప్రణాళిక నిధులను, సబ్సిడీలను 50శాతం వరకు తగ్గించింది. ఆ వర్గాలను సంతృప్తిపరడానికి రకరకాల పథకాలున్నాయని ఊకదంపుడు ఉపన్యాసాలతో మభ్యపెడుతున్నది ప్రభుత్వం. ఉపాధితోపాటు, ఆవాసాలు లేకుండా చేయడానికి చట్టాలను మారుస్తున్నది. వారి స్వాధీనంలో ఉన్న భూములను కార్పొరేట్ల హస్తగతం చేయడానికి ప్రయ త్నాలు చేస్తున్నది. ఈ కాలంలో అటవీహక్కుల చట్టానికి సవరణలు తెచ్చింది. భూసేకరణ చట్టానికి మార్పులు తెచ్చారు. నిర్వాసితులకు పరిహారం



నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టపరిచి, బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టి, పేదలపై వేసిన పన్నుల భారాన్ని పూర్తిగా తగ్గించి కార్పోరేట్ సంస్థలపై ఆదాయపు పన్నును 50శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. ఉపాధిహామీ పనులకు కేటాయింపులను మూడు రెట్లు పెంచి, విద్య, వైద్య సౌకర్యాలు ఉచితంగా అందించేందుకు, పేదలందరికీ ఆవాసాలు కల్పించేందుకు, కేంద్ర ప్రభుత్వ ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ డిమాండ్ల సాధనకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సెప్టెంబర్1-7 వరకు దేశవ్యాపితంగా జరిగే నిరసన ఉద్యమంలో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావడం ద్వారా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచేందుకు సిద్ధమవ్వాలి.

ఇవ్వకుండా తరిమేస్తోంది. విద్యా, వైద్యానికి దూరం చేస్తున్నది.

మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల పక్షమే..

ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తూ కార్పోరేట్లకు లాభాలు కట్టబెడుతున్నారు. పన్నుల భారాన్ని పేదలపై పెద్దఎత్తున పెంచారు. పరోక్ష పన్నులు అనగా జీఎస్టీ, నిత్యావసర సరుకులపై సెస్సులు వేస్తున్నారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వానికి 2022-23లో రూ.19.35 లక్షల కోట్ల ఆదాయం రాగా, 2023-24కు రూ.23.30 లక్షల కోట్లకు పెరిగింది. పరోక్ష పన్నులు 39శాతం నుండి 42.74శాతానికి పెంచారు. ధనికులపై వేసే ప్రత్యక్ష పన్నులు మాత్రం ఇతర దేశాలలో 35శాతం ఉండగా మన దేశంలో 25-28శాతం మాత్రమే విధిస్తున్నారు. ఇది ప్రత్యక్షంగా కార్పోరేట్లకు లాభాలు కట్టబెట్టడమే. అంతేకాక ఉపాధి కల్పించే ప్రభుత్వరంగ సంస్థలను తక్కువ ధరలకు కార్పోరేట్లకు అమ్మేసి రూ.లక్షల కోట్లు ఖజానాలో వేసుకుంటున్నారు. రిజర్వుబ్యాంకు మిగులు నిధులను పేదలకు ఉపయోగపడే పథకాలకు బదులుగా కార్పోరేట్లకు ఈ కాలంలోనే రూ.4.69 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించారు.

బ్యాంకులలో లక్షల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని ఎగవేసిన సంస్థలకు ప్రభుత్వం సహకరించడంతో వారు దేశం విడిచి వెళ్ళారు. బ్యాంకులు దివాళా తీశారు. ఇదిలా వుంటే దేశంలో 22శాతం సంపద ఒక్క శాతం కోటీశ్వరుల చేతుల్లో వున్నది. మరోవైపు 40శాతం సంపద కేవలం 20శాతం మంది వద్ద వున్నది. ఇదిలా వుంటే కేంద్ర ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ ప్రజలను అప్పుల్లోకి దించుతోంది. గత 67 ఏండ్లలో దేశం మొత్తం అప్పు 55.87లక్షల కోట్లు ఉండగా గత తొమ్మి దేండ్లలో మోడీ ప్రభుత్వం రూ.100 లక్షల కోట్లు ఎఫ్ఆర్‌బిఎం పరిధికి మించి అప్పు చేసింది. జీడీపీలో 40శాతానికి మించి అప్పు చేయకూడదనే నిబంధన వున్నా, నేడు 57శాతానికి చేరింది. ఈ అప్పుల వల్ల ప్రతి భారతీయుని తలపై ఒక లక్షా 10 వేల రూపాయల అప్పు కత్తిలా వేలాడుతున్నది.

తెలంగాణకు శుష్క వాగ్దానాలే..

రాష్ట్ర విభజన అనంతరం కేంద్రం తెలంగాణకు అనేక వాగ్దానాలు చేసింది.కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, నిజామాబాద్‌లో పసుపుబోర్డు, రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీ, రాష్ట్రంలో మూడు ఎయిర్ పోర్టులు, చేనేతపై జీఎస్టీ తొలగింపు వంటివి వున్నాయి. వాటి ఊసే లేదు.రాష్ట్ర విభజన సమస్యలు పెండింగులోనే వున్నాయి. నీటి వాటా కేటాయింపు నానుతూనే వున్నది. కేంద్రం తెలం గాణపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. ఇప్పటికే రాష్ట్రాల హక్కులను హరిస్తున్నది. అనేక సమస్యలతో పేదలు, సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రజల డిమాండ్ల పరిష్కారానికి పూనుకోవాల్సిన అవసరం ఉంది. నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టపరిచి, బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టి, పేదలపై వేసిన పన్నుల భారాన్ని పూర్తిగా తగ్గించి కార్పోరేట్ సంస్థలపై ఆదాయపు పన్నును 50శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. ఉపాధిహామీ పనులకు కేటాయింపులను మూడు రెట్లు పెంచి, విద్య, వైద్య సౌకర్యాలు ఉచితంగా అందిం చేందుకు, పేదలందరికీ ఆవాసాలు కల్పించేందుకు, కేంద్ర ప్రభుత్వ ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు చేప ట్టాల్సిన అవసరం ఉంది. ఈ డిమాండ్ల సాధనకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సెప్టెంబర్1-7 వరకు దేశవ్యాపితంగా జరిగే నిరసన ఉద్యమంలో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావడం ద్వారా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచేందుకు సిద్ధమవ్వాలి.

మన దేశంలో యువత 65శాతం వరకు వున్నారు. వీరికి ఉపాధి, ఉద్యోగం కరువై నిరుద్యోగులుగా తిరుగుతున్నారు. డిగ్రీలు, పిజీలు చదివిన వారు కూడా కూలి పనులకు వెళుతున్నారు. 2014 ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని మోడీ హామినిచ్చారు. కానీ ఆచరణలో వున్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయి.ఈ కాలంలో దాదాపు ఒక కోటి 50లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు.



పురుషాధిక్యత, హిందూత్వ విద్వేష ప్రచారం, మహిళను ఒక సరుకుగా పరిగణించే నయ ఉదారవాద వినిమయతత్వం నేటి భారతీయ స్త్రీపై ముప్పేట దాడిని చేస్తున్నాయి. ఈ మూడు వైపుల దాడినీ మొత్తం సమాజం యావత్తూ ఐక్యంగా ప్రతిఘటిస్తే తప్ప మగువకు రక్షణ ఉండదు.

రక్ష (?)-బంధనం

దేశంలో మళ్ళీ రాఖీ పండుగ జరుపుకోబోతున్నారు. అత్యధికులు ఈ రాఖీ పండుగ అనేది అన్నాచెల్లెళ్ళ బంధానికి, లేదా అక్క తమ్ముళ్ళ బంధానికి ఒక ప్రతీకగా పరిగణిస్తున్నారు. అందులో అభ్యంతరం పెట్టవలసినదేమీ లేదు. అయితే "భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సోదరీసోదరులు...." అంటూ సాగే మన స్కూలు విద్యార్థుల ప్రతిజ్ఞ (ఇది ప్రతి రోజూ స్కూళ్ళలో జరుపుతారు) కులాలకు, మతాలకు అతీతంగా ఉన్న ప్రతిజ్ఞ. అయితే చాలా అరుదుగా మాత్రమే భిన్న మతాలకు చెందిన వారితో కలిసి రాఖీ పండుగ జరుపుతారు. ఇటీవల మణిపూర్‌లో జరిగిన అత్యంత విషాదకరమైన సంఘటనలు, ఇంకా కొనసాగుతున్న దాడులు ఒక ప్రత్యేకతను కలిగివున్నాయి. ఈ దాడులను మణిపూర్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం జమిలిగా దగ్గరుండి ప్రోత్సహించిన దాడులు. రాష్ట్ర పోలీసులు, కేంద్ర రిజర్వు ఆర్మీ దగ్గరుండి దాడులను పర్యవేక్షించాయి. కాని సుప్రీం కోర్టు గట్టిగా మందలించిన తర్వాత మాత్రమే మోడీ నామమాత్రంగా తన విచారాన్ని వ్యక్తం చేశారు. ఐతే, ఇప్పటికీ మణిపూర్ వెళ్ళడానికి ఆయనగారికి తీరుబాటు దొరకలేదు. పార్లమెంట్‌లో ఆ దుర్ఘటనలను ప్రస్తావించడానికి ఆయనకు నోరు రాలేదు.

ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా ఇంకా బీజేపీ శ్రేణులు, ఆరెస్సెస్ గణాలు, బజరంగ్‌దళ్ బంధాలు, గోరక్షకులు, ఇంకా ఇంకా చాలా దళాలు రాఖీ పండుగను మాత్రం పెద్ద ఎత్తున జరుపుకోవడం ఖాయం. ముస్లిం పురుషుల "దుర్మార్గాల" నుంచి హిందూ స్త్రీలను కాపాడుకోవడం కోసమే ఈ పండుగ వచ్చిందని ఒక ప్రచారం కూడా చేస్తూంటారు. 2002లో గుజరాత్‌లో 3000 మంది ముస్లింలు నరమేధానికి బలైపోయిన సంగతి అందరికీ తెలుసు. అలా బలైనవారిలో అత్యధికులు మహిళలే. వారిని బలి తీసుకున్నది, అత్యాచారాలకు పాల్పడినది ఎవరు? హిందూత్వ దుండగులు కాదా? హిందూ మహిళలకు అవసరమైన రక్షణ తక్కిన మతాల మహిళలకు అక్కరలేదా? గత దశాబ్ద కాలంలో, ముఖ్యంగా మోడీ, యోగిల డబుల్ ఇంజన్ సర్కారు హయాంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మహిళలపై సాగిం చిన అత్యాచారాలు లెక్కలేనన్ని ఉన్నాయి. అత్యాచారాలకు బలైనవారిలో అత్యధికులు హిందూ మహిళలే (ముఖ్యంగా దళిత, బి.సి., గిరిజన తరగతులకు చెందినవారు). మరి ఈ మహిళలందరూ గతంలో తమ సోదరులకు రాఖీలు కట్టివుంటారు. అయినా వారికి రక్షణ ఎందుకు కరువైంది?

వెనకటికి ఒక అమాయకురాలైన మహిళ (పెద్ద కులానికి చెందిన మహిళ) తన ఇంటి పెరట్లో కొబ్బరి చెట్టుకు కాసిన బొండాలను ఎవరో దొంగలు ఎత్తుకుపోతున్నారని గమనించింది. తాను ధరించే మడిబట్టను ఎవరూ తాకరాదు గనుక అటువంటి ఒక మడిబట్టనే ఆ కొబ్బరి చెట్టుకు గనుక కడితే మడిబట్టను తాకకూడదు గనుక దొంగ వెనక్కిపోతాడని, తన చెట్టు కాపు భద్రంగా ఉంటుందని అనుకుందామె. ఆ విధంగానే ఒక మడిబట్టను కొబ్బరి చెట్టుకు కట్టింది. ఆ రాత్రి దొంగ రానే వచ్చాడు. కొబ్బరి బొండాలను జాగ్రత్తగా చప్పుడు చేయకుండా దింపాడు. ఆ మడిబట్టలోనే వాటినన్నింటినీ మూటగట్టాడు. చల్లగా జారుకున్నాడు. రాఖీ కట్టినంత మాత్రాన ఈ అగ్రవర్ణ, పురుషాధిక్య సమాజంలో, ముఖ్యంగా మనువాదాన్ని ప్రచారం చేసుకునే హిందూత్వ శక్తుల పాలనలో మహిళలకు రక్షణ దొరుకుతుందని నమ్మితే, మనదీ కొబ్బరి చెట్టుకు మడిబట్ట కట్టిన అమాయకురాలి గతే అవుతుంది. స్త్రీ చిన్నతనంలో తండ్రి రక్షణలో, వయస్సులో ఉన్నప్పుడు భర్త రక్షణలో, వృద్ధాప్యంలో కొడుకు రక్షణలో ఉండాలని మనువాదం చెప్పింది. స్త్రీకి స్వాతంత్ర్యం ఉండకూడదని నొక్కి చెప్పింది. ఎక్కడా స్త్రీలు తమను తాము కాపాడుకునేవిధంగా బల వంతులుగా తయారుకావాలని చెప్పలేదు. ఆరెస్సెస్ శాఖలు హిందూ స్త్రీలకు ఇతర మతాల వారి నుండి ప్రమాదం ఉందని పదే పదే చెప్తూనే వుంటాయి. కాని ఎక్కడా, ఎప్పుడూ ఆ స్త్రీలు తమ ఆత్మరక్షణ కోసం బలంగా ప్రతిఘటించే శక్తియుక్తులు సంపాదించుకోవాలని చెప్పవు. అటువంటి శిక్షణనూ ఇవ్వవు.

పురుషాధిక్యత, హిందూత్వ విద్వేష ప్రచారం, మహిళను ఒక సరుకుగా పరిగణించే నయ ఉదారవాద వినిమయతత్వం నేటి భారతీయ స్త్రీపై ముప్పేట దాడిని చేస్తున్నాయి. ఈ మూడు వైపుల దాడినీ మొత్తం సమాజం యావత్తూ ఐక్యంగా ప్రతిఘటిస్తే తప్ప మగువకు రక్షణ ఉండదు. అటువంటి ఐక్యతకు, ప్రజలు తమ విముక్తి కోసం సాగించే పోరాటాలకు విడదీయలేని బంధం ఉంది. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటపు అనుభవాలు ఆ విషయాన్ని మనకు స్పష్టం చేస్తాయి. వెట్టి నుండి విముక్తి సాధించడానికి చేసిన పోరాటమే తెలంగాణ రైతు మహిళలను భూస్వాముల అత్యాచారాల నుండి విముక్తి చేసింది. ఆ పోరాటంలో మహిళలు ఎంత వీరోచితంగా పోరాడారో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం అనుభవాలు మనకు తెలియజెప్తాయి. మహారాష్ట్ర ఆదివాసీల తిరుగుబాటు (గోదావరి లోయ ఆదివాసుల పోరాటం) వీర వనిత గోదావరి పెరులేకర్ నాయకత్వంలో నడిచింది. ఈ తరహా ఉద్యమాలు స్త్రీలలో ఆత్మస్థైర్యాన్ని నింపాయి. మరొకవైపు పురుషులలో మహిళల పట్ల గౌరవాభిమానాలను, మర్యాదను పెంచాయి. అటువంటి ఉద్యమాలను ఐక్యంగా నిర్వహించడానికి సంకేతంగా ఏదైనా పండుగ జరుపుకుంటే అర్థం చేసుకోవచ్చు. రాఖీ పండుగ నాడు కూడా అభ్యుదయ శక్తులు...కులాలతో, మతాలతో నిమిత్తం లేకుండా అందరూ దోపిడీ నుండి, పురుషాధిక్యత నుండి విముక్తికి ప్రతిన పూనుతూ రాఖీ కార్యక్రమం నిర్వహించవచ్చు. గతంలో యువ జన, మహిళా సంఘాలు సంయుక్తంగా ఈ తరహా కార్యక్రమాలు దేశ సమైక్యతకు ప్రమాదం వాటిల్లిన సందర్భాలలో నిర్వహించాయి. హిందూత్వ శక్తులు పురుషాధిక్యతను, విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు ఈ పండుగను వాడుకుంటాయి. దానికి భిన్నంగా మహిళా విముక్తి లక్ష్యంగా, లౌకిక సమైక్యతతో, పోరాట స్ఫూర్తితో అభ్యుదయ ఉద్యమాలు ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవాలి.

- ఎం.వి.ఎస్. శర్మ

ఫ్రెండ్లీ గవర్నమెంటే కదా! ఓపీఎస్‌పై కాలయాపనేలా?

ఒకవైపు ప్రజాసేవ పేరుతో ఐదేండ్లు పాలకులైన వారికి పెన్షన్లు, మరోవైపు 30 సంవత్సరాల పైబడి ఉద్యోగ సేవలందించిన వారికి నో పెన్షన్ ఇదేనా మీరు చెప్పే ఫ్రెండ్లీ ప్రభుత్వమంటే? రేపో మాపో పీఆర్సీ, ఐ ఆర్ ప్రకటన అనే లీకులు ఇస్తూ కాలం వెళ్ళదీస్తుంది నిజం కాదా! రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్(సమస్య)లను పరిష్కరించాలి. పీఆర్సీ కమిటీ వేయాలి. 1 జులై2023 నుంచి ఐఆర్ అమలు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేయడంలో ద్వంద్వ నీతిని వీడి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి.



మేకిరి దామోదర్
9573666650

ప్రభుత్వాలకు ప్రజలకు అనుసంధానంగా ఉంటూ, ప్రభుత్వ పథకాల(విధానాల)ను ప్రజలకు చేరవేస్తుండే వారే ప్రభుత్వ ఉద్యోగులు. ప్రజలకు ప్రభుత్వాలకు వారధిలా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రభుత్వాల పనితీరుకు అద్దం పట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, ఉపాధ్యాయుల పరిస్థితి నేడు దయనీయంగా ఉంది. రాబోయే నాలుగు నెలల్లో మన రాష్ట్ర ప్రభుత్వ గడువు, పదినెలల్లో కేంద్ర ప్రభుత్వ గడువు తీరిపోయి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తమ అపరిష్కృత సమస్యల సాధనకు ఇదే చివరి(తగిన) సమయమని ఉద్యోగులు భావిస్తున్నారు. ఈ తరుణంలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనబాట పడుతున్నాయి. ఆ మేరకు ఉమ్మడి ఐక్య ఉద్యమ కార్యక్రమాన్ని తీసుకొని దశల వారీగా ముందుకు వెళుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా, ఉపాధ్యాయ, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ యుఎస్‌పిసి (ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ) పోరాట కార్యక్రమాలు చేస్తున్నది. మొదటి దశలో జూలై 18,19 తేదీల్లో మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు తీసింది. అలాగే రెండవ దశలో ఆగస్టు12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు చేసింది. మూడో దశలో 1 సెప్టెంబర్ పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా చలో హైదరాబాద్ (ఇందిరాపార్కు వద్ద మహాధర్నా)ను యుఎస్‌పిసి నిర్వహించ తలపెట్టింది. దీనికంటే ముందే గతంలో అనేక ఉద్యమాలు, పోరాటాల మూలంగా సాధించుకున్న హక్కులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను పరిగణనలోకి తీసుకొని నేడు అన్ని సంఘాలు ఐక్యఉద్యమాలకు సంఘటితంగా సమస్యల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వివిధ సంఘాల ఐక్యవేదిక నాయకుల వద్దకు యుఎస్‌పిసి చొరవ తీసుకొని వెళ్ళి కలిసింది.

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉమ్మడి జేఏసీ ఏర్పాటు కోసం కలిసి రావాలని కోరడం జరిగింది. కాని నేటికీ వారు నిర్ణయం తెలపలేదని తెలుస్తోంది. సగటు ఉద్యోగ, ఉపాధ్యాయులు మాత్రం పెరిగి పోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ప్రభుత్వాల పన్నులు, సెస్సుల బాదుడుకు తోడుగా పెండింగ్లో ఉన్న ఏ ఒక్క సమస్య కూడా నేటికీ పరిష్కారం కాకపోగా, ఒకటో తారీఖునే వచ్చే వేతనాలు నెల చివరి వరకు రాక పోవడంతో అది ఒక డిమాండ్‌గా చేయాల్సిన దుర్భర పరిస్థితులు దాపురించాయని ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు పడేలా ఉమ్మడి రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న హక్కు గత కొన్నాళ్లుగా ఏనాడు, ఏ నెలలో పొందిన దాఖలాలు లేవు. ఉద్యోగులకు వేతనాలే ప్రధాన ఆదాయ వనరు గనుక ఆ పూచీకత్తుతో ఇంటికో, వాహనానికో, వ్యక్తిగత రుణమో, పిల్లల చదువుల కోసమో చేసిన అప్పుల ఈఎంఐలు చెల్లించకపోవడంతో బ్యాంకులో సిబిల్ స్కోర్ పడిపోతుంది. బయట అప్పు అడగలేక ఆత్మన్యూనతతో ఉద్యోగ, ఉపాధ్యాయులు కాలం వెళ్ళ దీస్తుంది నిజంకాదా!. తెలంగాణ ధనిక రాష్ట్రమని, మిగులు బడ్జెట్, ఫ్రెండ్లీ గవర్నమెంట్ అంటూ ప్రచార గొప్పలే కాని వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. ఇది వాస్తవం కాదా! ట్రెజరీల్లో ఆమోదం పొందిన వివిధ రకాల బిల్లులు నెలల తరబడి పెండింగులో ఉన్నాయి. అంతేకాదు ఉద్యోగుల జీవితకాలం పొదుపు చేసుకున్న జిపిఎఫ్, టీఎస్జిఎల్ఐ క్లైములు, పెన్షనర్ బెనిఫిట్స్, పీఆర్సీ బకాయిలు తదితర బిల్లులు రావడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొదటి పీఆర్సీ గడువు 30 జూన్ 2023 తో ముగిసినా.. పూర్తిస్థాయిలో ఆ ఒప్పందాలు అమలు జరగలేదు. గత పీఆర్సీ లోనే 22 నెలల ఆర్థిక ప్రయోజనాలు నష్టపోయిన తీరు, మిగిలిన బకాయిలు రాని అను భవంతోనైనా వెంటనే 1జులై 2023 నుండి మధ్యంతర భృతి సాధించుకోవడంతో పాటు, పీఆర్సీ కమిటీ వేసేలా ఒత్తిడి తేవాల్సి ఉంది. అధికారంలో ఎవరు ఉన్నా వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఉద్యోగుల హక్కులకు భంగం కలిగిస్తున్న తీరు ఈమధ్య ఎక్కువవుతుందని సగటు ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదన చెందుతూ, ఉద్యోగ సంఘాల నాయకులపై గుర్రుగా ఉన్నారు.

గత కాలంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకుల నిస్వార్థ సేవ, పోరాటాలు, త్యాగాల వల్ల సాధించుకున్న హక్కులు ఒక్కొక్కటిగా సంఘాల నాయకుల ఉదాసీన వైఖరి మూలంగా కోల్పోవాల్సి వస్తుందంటూ ఆవేదన చెందుతున్నారు. సంఘ నాయకులుగా, ఎమ్మెల్సీలుగా బాధ్యతల్లో ఉన్నవారు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమ స్యలను ప్రభుత్వ దష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాల్సిన వాళ్లు? వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్యోగ, ఉపాధ్యా యుల ఆత్మగౌరవాన్ని, పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను పణంగా పెట్టడం చూస్తుంటే బాధగా ఉందని పెన్షనర్లు, అనుభవజ్ఞులు నిర్ఘాంత పోవుచున్నారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పాలన (ఎన్టీఆర్ ముఖ్యమంత్రి) కాలములో ఉద్యోగ, ఉపాధ్యాయుల వ్యతిరేక విధానాలకు పాల్పడినప్పుడు ఉమ్మడి ఉద్యమం చేసి స్ట్రైక్‌ను (సమ్మెకు పిలుపునిచ్చి) ప్రకటించి న్యాయమైన హక్కలను సాధించుకుని సమస్యలను పరిష్కరించుకున్నారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ (ముఖ్య మంత్రి రాజశేఖర్ రెడ్డి) కాలంలో వారు అదేవిధంగా వ్యవహరిస్తే అదే తీరుగా ఉమ్మడి ఐక్య కార్యాచరణతో హక్కులను సాధించుకున్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర గణనీయమైనదని, మరువలేనిదని నాడు పలికిన ఉద్యమ నాయకులే నేడు పాలకులైన వేళ కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను చూస్తుంటిమి కదా!అని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఒక్కతాటి పైకి వచ్చి ఉమ్మడి కార్యాచరణతో సాగాల్సిన



సమయంలో మీనమేషాలు లెక్కిస్తూ, ఉదాసీనంగా ఉన్నారు. ఇది ప్రభుత్వాల మేలు కోసమా! ఉద్యోగుల బాగు కోసమా!! ఈ ద్వంద్వ విధానాలు ఎంత మాత్రం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేయవు గాక చేయవు.

ఒకవైపు ప్రజాసేవ పేరుతో ఐదేండ్లు పాలకులైన వారికి పెన్షన్లు, మరోవైపు 30 సంవత్సరాల పైబడి ఉద్యోగ సేవలందించిన వారికి నో పెన్షన్ ఇదేనా మీరు చెప్పే ఫ్రెండ్లీ ప్రభుత్వమంటే? రేపో మాపో పీఆర్సీ, ఐ ఆర్ ప్రకటన అనే లీకులు ఇస్తూ కాలం వెళ్ళదీస్తుంది నిజం కాదా! రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్(సమస్య)లను పరిష్కరించాలి. పీఆర్సీ కమిటీ వేయాలి. 1 జులై2023 నుంచి ఐఆర్ అమలు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేయడంలో ద్వంద్వ నీతిని వీడి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి. గత ఒప్పందంలోని పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి. బదిలీలు, పదో న్నతులు, హెల్త్‌కార్డులు.. ఇలా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమ స్యలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్న వేళ.. ఇన్నాళ్ళ ఉద్యో గుల, ఉపాధ్యాయుల బాధ్యతాయుతమైన సేవల మూలంగా ప్రభుత్వానికి పేరు ప్రతిష్టలు,అవార్డులు వచ్చాయని మాటలు చెప్పడమే కాకుండా ఎన్నికలు సమీపిస్తున్న వేళ (నోటిఫికేషన్) రాకముందే అన్ని సమస్యలు పరిష్కరించేలా వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలి. అవి కార్యరూపం దాల్చాలి. ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రజల నుండి వేరు చేసేలా దేశంలోనే ఎక్కువగా జీతాలు ఇస్తున్నామనే ప్రచారం ప్రభుత్వాలకు ఏమాత్రం మంచిది కాదు. ఇప్పటికైనా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఎమ్మెల్సీలు మిమ్మల్ని మోస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలి. ఇది కనీస బాధ్యతని మరువరాదు. పాలకులు బేషజాలకు పోకుండా వెంటనే ఉద్యోగ,ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి ధర్నాలు, ర్యాలీలకు వెళ్లకుండా చర్చల ద్వారా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన కనీస బాధ్యతను గుర్తెరగాలి.

ఇన్నాళ్ళ ఉద్యోగుల, ఉపాధ్యాయుల బాధ్యతాయుతమైన సేవల మూలంగా ప్రభుత్వానికి పేరు ప్రతిష్టలు,అవార్డులు వచ్చాయని మాటలు చెప్పడమే కాకుండా ఎన్నికలు సమీపిస్తున్న వేళ (నోటిఫికేషన్) రాకముందే అన్ని సమస్యలు పరిష్కరించేలా వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలి. అవి కార్యరూపం దాల్చాలి. ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రజల నుండి వేరు చేసేలా దేశంలోనే ఎక్కువగా జీతాలు ఇస్తున్నామనే ప్రచారం ప్రభుత్వాలకు ఏమాత్రం మంచిది కాదు.

(సెప్టెంబర్ 1 పెంఛన్ విద్రోహ దినం)



ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మునగాల

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సోమపంగు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని రేపాలపీహెచ్‌సీ సెంటర్‌లో పనిచేస్తున్న 22 మంది ఆశా వర్కర్లు బుధవారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో 32 ఏండ్లుగా మైదాన ప్రాంతంలో 18 ఏండ్ల నుండి పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జంగంపల్లి సాయికుమార్, భాగ్యలక్ష్మి, సుధారాణి, నాగమణి, రమణ, అరుణ, భారతి, మేరమ్మ,నాగమణి, షఫీ, ఉష, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరం

నవతెలంగాణ- ఆలేరురూరల్

మండలంలోని కొల్లూరు గ్రామంలో యాక్షన్ ఎయిడు మరియు మాక్సు విజన్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు గ్రామ సర్పంచ్ కోటగిరి జయమ్మ బుధవారం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, ఉప సర్పంచ్ మహేందర్ ,పంచాయతీ కార్యదర్శి మల్లేష్ ,కారోబార్ రమేష్ సంస్థ వాలంటర్ శోభారాణి, వెన్నెల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో.. టికెట్ల లొల్లి

అత్యధికంగా పోటీపడుతున్న ఆశావహులు

- ఉమ్మడి జిల్లాలో 130 దరఖాస్తులు
- అత్యధికంగా తుంగతుర్తి, అత్యల్పంగా సాగర్
- తెరపైకి ఒకే కుటుంబంలో రెండు టికెట్ల వ్యవహారం
- ముగ్గురు పేర్లతో జాబితా, మూడో వారంలో అభ్యర్థుల ఖరారు
- పొత్తు కుదిరితే మిర్యాలగూడ, మునుగోడు వాపక్షాలకు



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఈసారి అధికారం చేపట్టాలని అధిష్టానం తీవ్ర చేస్తుంది. కర్ణాటక ఫార్ములాను తెలంగాణలో ఉపయోగించి అధికారం చేపట్టాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తుంది. అందులో భాగంగా ఆయా నియోజకవర్గాలలో టికెట్ కోసం ఆశపడే ఆశవాహుల నుండి దరఖాస్తుల స్వీకరించింది. ఆగస్టు 25 వరకు గడువు పెట్టి దరఖాస్తులు స్వీకరించగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుండి ఆశావాహులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా విషయానికొస్తే కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసేందుకు పెద్ద ఎత్తున ఆశవాహులు పోటీ పడుతున్నారు. వచ్చిన దరఖాస్తులను నియోజకవర్గాల వారిగా వేరుచేసి అందులో సర్వేల ఆధారంగా ముగ్గురు పేర్లను ఎంపిక చేయనున్నారు. అతి పేర్లను సెప్టెంబర్ 2న జరిగే సమావేశంలో ఆమోదం తెలిపి ఏఐసీసీ కు పంపనున్నారు. అధిష్టానం ఆమోదం మేరకు అభ్యర్థులను ప్రకటించనున్నారు.

నవతెలంగాణ-మిర్యాలగూడ

కాంగ్రెస్‌లో పార్టీలో పోటీ చేసేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల నుండి దరఖాస్తులు పెద్ద ఎత్తున వచ్చాయి. మొత్తంగా 130 దరఖాస్తులు వచ్చినట్లు మంగళవారం హైదరాబాదులోని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గం నుండి 23 దరఖాస్తులు రాగా అత్యల్పంగా సాగర్ నియోజకవర్గం నుండి రెండు మాత్రమే వచ్చాయి. తుంగతుర్తిలో ప్రధానంగా గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అద్దంకి దయాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రీతం, జేఏసీ నాయకుడు పిడమర్తి రవి, సీనియర్ నేతలు జ్ఞాన సుందర్, వడ్డేపల్లి రవి, గుడిపాటి నరసయ్యతో పాటు మరికొందరు ఉన్నారు. కేవలం రెండు దరఖాస్తు వచ్చిన నాగార్జునసాగర్‌లో సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి తనయులు కొందరు రఘువీరారెడ్డి, కుందూరు జయవీర్ ఉన్నారు. రఘువీరారెడ్డి మిర్యాలగూడ నుంచి కూడా దరఖాస్తు చేసుకున్నారు. వామపక్షాలతో పొత్తు ఏర్పడితే రఘువీరారెడ్డి సాగర్ నుంచి పోటీలో లేక పోతే నల్గొండ పార్లమెంట్ నుంచి పోటీ చేయించాలని జానా రెడ్డి చూస్తునట్లు సమాచారం. ఇక పోతే సాగర్‌లో ఎలాంటి పోటీ ఉండదు. దాదాపు అభ్యర్థి ఖరారు అయినట్లు సమాచారం. మిర్యాలగూడలో 20 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ప్రధానంగా కుందూరు రఘువీరారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మా రెడ్డి, పీసీసీ కార్యదర్శి అలుగుబెల్లి అమరెందర్ రెడ్డి, సీనియర్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, పగిడి రామలింగ యాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మాధవి, ఎన్ఆర్ఐ తేజ గౌడ్ తో పాటు మరికొందరు ఉన్నారు. పొత్తులో భాగంగా మిర్యాలగూడ వామపక్షాలకు వెళితే అందరూ కూడా సహకరిస్తామని అధిష్టానం ముందు హామీ ఇచ్చినట్టు తెలిసింది. పొత్తు కుదరకపోతే కాంగ్రెస్ నుంచి ఎవరు బరిలో ఉన్నా మిగిలిన వారు రెబల్‌గా నిలిచే అవకాశం కనిపిస్తుంది. సూర్యాపేట నుంచి మాజీ మంత్రి దామోదర్ రెడ్డి ,పటేల్ రమేష్ రెడ్డి, తండు శ్రీనివాస్ యాదవ్‌తో పాటు మరో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. నల్గొండ నుండి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,దుబ్బాక నర్సింహారెడ్డి, చెరుకు సుధాకర్‌తో పాటు నలుగురు ఉన్నారు. హుజూర్‌నగర్ నుండి ఎంపీ ఉత్తంకుమార్ రెడ్డితో పాటు మరో 6 గురు దరఖాస్తు చేసుకున్నారు. కోదాడ నుండి మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నపురెడ్డి అప్పిరెడ్డి, సాముల జైపాల్ రెడ్డి, మరో ముగ్గురు ఉన్నారు. భువనగిరి నుండి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, పొత్నక్ ప్రమోద్, కసిరెడ్డి నరసింహారెడ్డి, పంజాల రామాంజనేయులు ఉన్నారు. దేవరకొండ నుండి మాజీ ఎమ్మెల్యే బాలు నాయక్ బిల్యా నాయక్‌తో పాటు మరో ఎనిమిది మంది ఉన్నారు. మునుగోడు నుండి చలమల్ల కృష్ణారెడ్డి పాల్వాయి స్రవంతి, పున్న కైలాస్, బైకని లింగం యాదవ్ ఉన్నారు. పొత్తులో భాగంగా ఈ స్థానం సీపీఐకి వెళ్లే అవకాశం ఉన్నది. నకిరేకల్ నుంచి 18 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య టీపీసీసీ కార్యదర్శి కొండేటి మల్లయ్య, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యతో పాటు మరికొందరు ఉన్నారు. ఆలేరులో 17 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ఆ జిల్లా అధ్యక్షుడు అందం సంజీవరెడ్డి, బీర్ల ఐలయ్య ,బండ్రు శోభా రాణి ,కల్లూరి రామ చంద్రా రెడ్డి ఉన్నారు.

ఐదు నియోజకవర్గంలో స్పష్టత

ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఐదు నియోజకవర్గాలలో స్పష్టత వచ్చినట్లు సమాచారం. ముందుగా ఎలాంటి పోటీ లేని నాగార్జునసాగర్ నియోజకవర్గం నుండి దాదాపు అభ్యర్థి ఖరారు అయినట్లు సమాచారం. అక్కడ సీనియర్ నాయకుడు జానారెడ్డి తనయుడు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు ఇద్దరిలో చిన్న కుమారుడికి అవకాశం వస్తుంది. పొత్తులో భాగంగా మిర్యాలగూడ వామపక్షాలకు వెళితే పెద్ద కుమారుడు రఘువీరారెడ్డి సాగర్ అడిగే అవకాశం ఉంటుంది. పార్లమెంటుకు అవకాశం ఇస్తే సాగర్ నుండి జయవీర్ రెడ్డి దాదాపు ఖరారు అవుతుంది. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని నల్గొండ, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, నియోజకవర్గంలో అభ్యర్థుల విషయంలో అధిష్టానంకు ఒక స్పష్టత వచ్చినట్లు సమాచారం. ఈ నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు మొదటి జాబితాలో ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నారు. మిగిలిన నియోజకవర్గాలలో సర్వేల ఆధారంగా ముగ్గురి పేర్లను ఎంపిక చేసి ఏఐసీసీ కు పంపనున్నారు. అందులో ఒక పేరును ఎంపిక చేసి అభ్యర్థిగా ఖరారు చేయనున్నారు.

తెరపైకి కుటుంబంలో రెండు టికెట్లు వ్యవహారం

వచ్చిన దరఖాస్తులను వడపోసేందుకు మంగళవారం కాంగ్రెస్ గాంధీభవన్లో సమావేశం నిర్వహించగా అందులో ఒకే కుటుంబంలో రెండు టికెట్ల వ్యవహారం చర్చకు వచ్చింది. రెండు టికెట్ల వ్యవహారంపై ఢిల్లీ అధిష్టానానికి చెప్పాలని ఉత్తంకుమార్ రెడ్డి రేవంత్ రెడ్డిని సూచించగా తనను డిక్టేయ్ చేయొద్దని చెప్పారు. మహేష్ గౌడ్ ఉత్తంకుమార్ రెడ్డి ల మధ్య కొంత మాటలు యుద్ధం జరిగినట్లు తెలిసింది. ఈ విషయంపై సమావేశంలో ఉత్తమ్ దంపతులు గతంలోనే పోటీ చేశారని అందులో కొత్తేమి లేదన్నారు. జానారెడ్డి తన కుమారుల కోసం దరఖాస్తు చేయించారని చెప్పారు. ఒకే కుటుంబంలో రెండు టికెట్లు వ్యవహారం అధిష్టానం చూసుకుంటుందని పీసీసీ కార్యవర్గం స్పష్టం చేసింది.

పొత్తు కుదిరితే మిర్యాలగూడ, మునుగోడు వామపక్షాలకు

ఇండియా కూటమిలో భాగస్వామ్యం ఉన్న వామపక్షాలతో పొత్తు కుదుర్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తుంది. అందులో భాగంగానే కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికే సీపీఐతో అనధికారికంగా చర్చలు జరిపింది. అందులో సీపీఐ ప్రధానంగా నాలుగు స్థానాలు కోరగా రెండు స్థానాలు ఇచ్చేందుకు కాంగ్రెస్ సూత్రపాయంగా అంగీకరించినట్లు సమాచారం అందులో ఉమ్మడి నల్గొండ జిల్లాలో మునుగోడు నియోజకవర్గం ఉన్నట్లు ప్రచారం నడుస్తుంది. అలా జరిగితే సీపీఐకు ఆ స్థానం మొదలుపెట్టే అవకాశం ఉంది. రేపో, మాపో సీపీఐ(ఎం)తో కాంగ్రెస్ చర్చలు జరపనుంది. చర్చలు సఫలమయితే జిల్లాలో మిర్యాలగూడ స్థానం సీపీఐ(ఎం) కేటాయించే అవకాశం ఉంది. మిగిలిన 10 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుంది.

ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గ వారీగా వచ్చిన దరఖాస్తులు	
తుంగతుర్తి	23
మిర్యాలగూడ	20
నకిరేకల్	18
ఆలేరు	17
భువనగిరి	11
దేవరకొండ	10
హుజూర్నగర్.	07
నల్గొండ	07
సూర్యాపేట.	06
కోదాడ	05
మునుగోడు	04
నాగార్జునసాగర్	02

కాళేశ్వరం ప్రాజెక్టు, యాదగిరిగుట్ట డెవెలప్‌మెంట్ భూసేకరణ పై కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ- భువనగిరిరూరల్



యాదాద్రి భువనగిరి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు, ట్రిబుల్ ఆర్, టీఎస్ఐఐసీ, యాదగిరిగుట్ట డెవలప్‌మెంట్ భూసేకరణపై జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మినీ మీటింగ్ హాల్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా చివరి సంక్షేమ సమావేశంలో ఇచ్చిన ఆదేశాలు అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో మునిగిపోతున్న తిమ్మాపురం, లప్ప నాయక్ తండ, చోక్లా నాయక్ తండాలకు సంబంధించిన భూ సేకరణ త్వరగా పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూమి నష్టపరిహారం త్వరలో చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. రివ్యూ మీటింగ్ లో కాళేశ్వరం ప్రాజెక్టు 14, ప్యాకేజీ 15, ప్యాకేజీ పదారి యొక్క కెనాల్స్ భూసేకరణ వేగవంతం చేయాలని ఎస్‌డీసీ శేఖర్ రెడ్డిని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రాజెక్ట్ ఎస్సీ శ్రీనివాస్, ఆర్డీవో అమరేందర్, ఈఈ కుర్షీద్, ఎస్ డి సి శేఖర్ రెడ్డి, నాగలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గౌరవప్రదంగానే రాజకీయాల నుండి తప్పుకుంటా

- కేసీఆర్ మూడవసారి సీఎం కావడం ఖాయం
- టికెట్ ఎవరికీ ఇచ్చినా గెలిపించాల్సిందే
- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

గౌరవ ప్రదమైన బాధ్యతల్లో ఉన్నాను. గౌరవ ప్రధంగానే రాజకీయాల నుండి తప్పుకుంటాను.. మూడవ సారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం.. బీఆర్ ఎస్ పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించాల్సిందే. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు అందరిని కలుపుకొని వెళుతూ సమన్వయం చేసుకొంటూ ముందుకు వెళ్ళాలని శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో మీడియా చిట్ చాట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ పార్టీల్లో అయిన చిన్న చిన్న భేదాభిప్రాయాలు సహజంగా ఉంటాయి. అవన్నీ వీడి అందరం కలిసి కేసీఆర్‌ని మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలి అంటే అభ్యర్థులను గెలిపించాలి. అందర్నీ కలుపుకు పోయే బాధ్యత పోటీ చేసే అభ్యర్థుల మీద ఉంది. నేనెవరి పనుల్లో జోక్యం చేసుకొను. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్స్ అన్నీ ఆచరణ యోగ్యత కానివి. ప్రజలు వారి హామీలు నమ్మవద్దు. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ ఆరోపణలు, కేసులు లేవని తెలిపారు. రాజకీయాల్లో ఓపిక, సహనంతో ఉంటే కచ్చితంగా ఫలితం వస్తుంది. అప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా, తమ అభిమానంతో ప్రజలు ఓట్లు వేస్తారు. తమ మధ్య ఉండే సమస్యలను కొంత మంది నేతలు కులాలకు ఆపాదిస్తున్నారని పేర్కొన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత

- అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రవీంద్రకుమార్ శంకుస్థాపన

నవతెలంగాణ-దేవరకొండ



మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక హంగులతో సమూల మార్పులకు, విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తున్నారని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు - మన బడి కార్యక్రమం రూ.2.06కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం ప్రగతి బాటలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ అల్లంపల్లి నర్సింహ, వైస్ ఛైర్మెన్ రహత్ హత్, ఆర్డీవో శ్రీరాములు, కౌన్సిలర్లు ముడవత్ జయప్రకాష్ నారాయణ, మహమ్మద్ రైస్, తస్నీన్ సుల్తానా, ఏఈ లష్కర్, బొడ్డుపల్లి కృష్ణ, చాట్ల రాములు, బాబా, ఆఫ్రోజ్, పొట్ల మధు, జమీర్, ప్రధానోపాధ్యాయులు నాళ్ళ గోవర్ధన్, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు అందరికి సమానంగా అందించాలి

- గద్దర్, జహీర్ అలీఖాన్ సంస్మరణ సభలో నాయకులు

నవతెలంగాణ-మిర్యాలగూడ



రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కులు అందరికి సమానంగా కల్పించబడాలని ప్రొఫెసర్ ఖాసీం, ప్రొఫెషర్ అన్వర్ పాషా, తత్వవేత్త జేబీ రాజు, గాదె ఇన్నయ్య, పాశం యాదగిరి, వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద గద్దర్, జహీర్ అలీ ఖాన్ స్ఫూర్తి సభ నిర్వహణ కమిటి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం ప్రజలను ఆట పాటల ద్వారా చైతన్య చేశారన్నారు.విమలక్క పాట పలువురిని ఆకట్టుకుంది. కులవ్యవస్థ పోవాలని, అసమానతలు తొలగలని పోరాడిన యోదులు గద్దర్, జహీర్ అలీ ఖాన్ అని పేర్కోన్నారు.ఈ కార్యక్రమంలో అంబటి నాగయ్య, డాక్టర్ మువ్వ రామారావు, కస్తూరి ప్రభాకర్, మాలోత్ దశరథ్ నాయక్, తల్లపల్లి రవి, మల్లేష్, డాక్టర్ రాజు, డేగ విటి, హమీద్, డీఎం పాల్, మారం శ్రీనివాస్, జ్వాలా వేంకటేశ్వర్లు, చేగొండి మురళీయాదవ్ పాల్గొనగా ప్రజా నాట్యమండలి రాష్ట కార్యదర్శి నర్సింహా ఆట పాటలు పలువురిని ఆకట్టున్నాయి.

మంత్రి జగదీష్‌రెడ్డిపై గరంగరం

- ఏకమవుతున్న యాదవ సంఘం నేతలు
- కక్షసాధింపు చర్యలు ఆపాలంటూ హెచ్చరిక
- వట్టెపై అక్రమ కేసులు సరికాదంటున్న బీసీ నేతలు
- ఇన్నాళ్లూ భూకబ్జాలు కనబడలేదా..?
- ఎన్నికల ముంగిట యాదవుల తలనొప్పి

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల వేళ మంత్రి జగదీష్‌రెడ్డికి తలనొప్పులు తప్పడం లేదు. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎదురుతిరిగిన నేతలను అణచివేసుకుంటూ వస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మరో కొత్త చిక్కు మంత్రి జగదీష్‌రెడ్డిని వేధిస్తోందనే చెప్పాలి. ఇన్నాళ్లు మంత్రి ప్రధాన అనుచరుడిగా ఉంటూ వచ్చిన డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌పై ఒకేరోజు 71 కేసులు నమోదు చేయించి.. కక్షసాధింపు చర్యలకు మంత్రి ఆజ్యం పోశారనే విమర్శలు లేకపోలేదు. దీనికి బలం చేకూరుస్తున్నట్టుగా ఇన్నాళ్లు తనకు అనుకూలంగా ఉంటే రాని వ్యతిరేకత.. మంత్రిని విమర్శించిన రెండు రోజులకే వట్టె జానయ్యయాదవ్‌పై అక్రమాలు పుట్టగొడుగుల్లా తెరపైకి ఎందుకోస్తున్నాయో తెలియని విషయం కాదు.

బీఆర్ఎస్‌కు తప్పని యాదవ ఎఫెక్ట్..

ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగానూ యాదవ ఓట్లు అధికంగానే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో 20 వేల నుంచి 30వేల వరకు ఓట్లు లేకపోలేదు. ఇదిలావుంటే.. డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ అక్రమాల సంగతి పక్కన పెడితే.. ఇటు యాదవ సంఘంలోనూ.. అటు సూర్యాపేట నియోజకవర్గంలోనూ మంచి పట్టు ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యాదవ ఓటర్లను ప్రభావితం చేసే అనుచరగణం జానయ్య యాదవ్ సంపాదించుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వట్టె జానయ్యయాదవ్‌పై మంత్రి జగదీష్‌రెడ్డి కావాలనే కుట్ర చేస్తున్నారనేది బహిరంగ రహస్యమని రాజకీయ వర్గాల్లో ఎక్కడా చూసినా ఇదే చర్చ కన్పిస్తోంది. దీంతో ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు యాదవ సామాజిక వర్గం నుంచి పెద్దఎత్తున తిరస్కరణ ఎదురయ్యేలా ఉంది.


ఏకమవుతున్న బహుజన వర్గాలు..

నిజానికి సూర్యాపేట నియోజకవర్గంలో వట్టె జానయ్యయాదవ్ మంచి బలమైన నేతని చెప్పొచ్చు. మొదటి నుంచే జానయ్యయాదవ్‌పై కొన్ని భూకబ్జా ఆరోపణలు విన్పించాయి. రియల్ ఎస్టేట్ వ్యాపార కోణంలో చూస్తే.. మంత్రికి సన్నిహితులపై ఇంతకంటే ఎక్కువ భూకబ్జా ఆరోపణలు ఉన్నాయనే ప్రచారం లేకపోలేదు. మంత్రికి అత్యంత సన్నిహితుడుగా చెప్పుకునే రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఓ నేత విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన పిల్లలమర్రి గ్రామానికి వెళ్తే స్టేజీకి సమీపంలో పెద్ద రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ నుంచి ఇరిగేషన్ కాల్వ(సాగునీటి కాల్వ) ఉండగా, దాన్ని దారి మళ్లించి.. సిమెంటు కాంక్రీట్ వేసి చిన్నగా చేశారు. పేరుకు కాల్వను బలంగా చేశామని చెప్పినప్పటికీ.. పెద్ద వరద వస్తే.. మాత్రం వెంచర్‌లోకే నీరు వెళుతుంది. పంట పొలాలకు వెళ్లడం కష్టతరమవుతుంది. మరీ దీనిపై మంత్రి జగదీష్‌రెడ్డి మౌనం వహించడం గమనార్హం. ఈ క్రమంలోనే బహుజన వర్గాలు ఏకమై మంత్రి తీరును తప్పుపడుతుండడం కొసమెరుపు.



బీఆర్ఎస్ అధిష్టానానికి చేరినట్టేనా..

సూర్యాపేట నియోజకవర్గంలో మంత్రి జగదీష్‌రెడ్డి కక్షపూరితంగా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌పై చేస్తోన్న అక్రమ కేసుల పర్వం వ్యవహారం చిలికిచిలికి గాలివానలా మారుతుందా..? అంటే అవుననే సమాధానమే విన్పిస్తోంది. ఈ మొత్తం వ్యవహారం బీఆర్ఎస్ అధిష్టానం దృష్టికి వెళ్లినట్టు తెలుస్తోంది. దీనికితోడు వట్టె జానయ్యయాదవ్‌పై కక్షతో ఆయన అనుచరులను కేసుల్లో ఇరికించి ఎక్కడికి తీసుకెళ్లారో తెలియడం లేదంటూ వారి తల్లిదండ్రులు సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేసిన వీడియోలు వైరల్‌గా మారాయి.ఇవి సైతం అధిష్టానం దృష్టికి వెళ్లాయని తెలుస్తోంది. అయితే బీఆర్ఎస్ అధిష్టానం బీసీ కోణంలో నష్టపోతామని భావిస్తుందా..? లేక మంత్రి జగదీష్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తుందా..? అన్న సంగతి వేచిచూడాల్సిందే.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమ్మనబోలు హోమియోపతి వైద్యులు డాక్టర్ ముబీన పేర్కొన్నారు. మండల పరిధిలోని అమ్మనబోలు గ్రామంలో బుధవారం హోమియోపతి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలు సీజనల్ వ్యాధులైన కండ్ల కలక, చర్మ వ్యాధులు, డెంగ్యూ, వ్యాధుల పట్ల గురికాకుండా ఉండేందుకు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వివరించారు. ప్రతి పాఠశాలలో సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ వ్యాధులు రాకుండా హోమియోపతి మందులు ఇస్తున్నామని పేర్కొన్నారు.

శ్రీ కృష్ణవేణిలో రాఖీ వేడుకలు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో గల శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాలలో బుధవారం ఆ పాఠశాల విద్యార్థులతో అన్నాచెల్లెళ్లకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అన్నాచెల్లెళ్ల రాఖీ పండుగ విశిష్టతను ఆ పాఠశాల కరస్పాండెంట్ మట్ట చెన్నయ్యగౌడ్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ మట్ట సబిత, నరేందర్‌రెడ్డి, కోటేశ్వరి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ వేతనాలు ఉండేలా చూడాలి

- దండంపల్లి సత్తయ్య

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



పారిశ్రామిక కార్మికులుగా ఉన్న ఆర్టీసి కార్మికుల వేతనాలు ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ ఉండేలా చూడటం, అమలులో ఉన్న అలవెన్సులను పూర్తిగా కొనసాగించాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ నల్లగొండ డిపో గౌరవాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన ఆర్టీసీ విలీనం- ఆంధ్రప్రదేశ్ అనుభవాలు అనే బుక్ లెట్‌ను నల్లగొండ డిపోలో ఆవిష్కరించిన అనంతరం ఆర్‌ఎం శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ఆర్టీసి కార్మికులు పారిశ్రామిక కార్మికులని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పని పరిస్థితులకు, ఆర్టీసి కార్మికుల పని పరిస్థితులకు పూర్తి తేడా ఉంటుందన్నారు. ఆర్టీసి కార్మికులకు 2017, 2021 సంవత్సరాలలో రావలసిన వేతన ఒప్పందాలను అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక వివాదాల చట్టం- సెక్షన్ 12 (3) క్రింద ఒప్పందం చేసుకొన్నా విలీనం అనంతరం కూడా ఆ అలవెన్సులు, సౌకర్యాలను కొనసాగిస్తూనే, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న మెరుగైన సౌకర్యాలు, అలవెన్సులు ఆర్టీసీ కార్మికులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నల్లగొండ రీజియన్ అధ్యక్షులు కందుల నరసింహ, చంద్రమౌళి, డిపో కార్యదర్శి బోడ స్వామి, రీజియన్ సహాయ కార్యదర్శి శ్యాంసుందర్, రాములు, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి'

రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెంచిన వేతనాలను చెల్లించుటకు బడ్జెట్ వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లును తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నల్లగొండ దేవరకొండ రోడ్డులో గల బాలుర ఉన్నత పాఠశాలలో కార్మికులతో కలసి సమస్యలకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2022 మార్చి 15న గౌరవ ముఖ్యమంత్రి అసెంబ్లీలో మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు ప్రస్తుతం పొందుతున్న వేతనంపై అదనంగా రూపాయలు 2000 పెంచుతున్నట్లు ప్రకటించారు. యూనియన్ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా జీవో ఎంఎస్ నెంబర్ 8 ని విడుదల చేసింది కానీ కార్మికులకు పెరిగిన జీతం ఇంతవరకు ఇవ్వలేదని, పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వలేదని కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే బిల్లులు విడుదల చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వంటకు సరిపడా గ్యాస్ను సబ్సిడీపై ఇవ్వాలని, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని అంగన్వాడీ కేంద్రాల మాదిరిగా గుడ్లు సరఫరా చేయాలని ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, తదితర డిమాండ్లను పెరిగిన వేతనం సాధన కోసం ఇతర సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 4వ తేదీన అన్ని మండల కేంద్రాలలో, సెప్టెంబర్ 13వ తేదీ చలో కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు కోయగూర పద్మ, అలివేలు, సైదమ్మ వెంకటమ్మ, రామణా, తదితరులు పాల్గొన్నారు.

వెలవెల బోయిన పెద్ద వాగు..!

- కనుమరుగైన జలాలు
- ఎక్కడ చూసినా బండరాళ్లు గుట్టలే
- వంద ఏండ్లుగా ఎప్పుడు కనిపించని

గద్దలగుట్ట దర్శనం

నవతెలంగాణ-పెద్దవూర



నల్లగొండ జిల్లాలోని 11 మండలాలు 220 గ్రామాల్లో 40వేల మంది రైతుల పశువులకు తాగునీరు , సాగునీటిని అందిస్తున్న ఈ వాగు నేడు వర్షాలు లేక, వరదలు రాక వెలవెల పోయింది. ఎక్కడ చూసినా బండ రాళ్లు, రాళ్లగుట్టలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని కనెగల్, నల్లగొండ, గుర్రంపోడ్, పీఏపల్లి, పెద్దవూర, అనుముల, తిరుమలగిరి సాగర్, నిడమానూరు, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాలలోని చిన్న చిన్న వాగులు అన్ని ఈ పెద్దవాగులో కలవాల్సిందే. రెండు వందల గ్రామాలు 40,000 మంది రైతులు ఉన్నారు. ఎకరం నుంచి 10ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు 25,000 మంది రైతులు ఉన్నారు. ఈ వాగు కింద స్వర్గదామంగా ఉండేది. కానీ ఈరోజు అందులో చుక్క నీళ్ల లేవు.. కనీసం పశువులకు తాగునీల్లు కూడ లభించని దుస్థితి ఏర్పడింది. తిరుమల సాగరం, సాగర్ నేతాపురం గ్రామంలో దుర్గా ఆలయం ఈ వాగు పక్కనే వుంది. ఈ వాగు అవతల గద్దలగుట్ట అనే ఒక పెద్ద రాళ్ళ గుట్ట ఉంది. ఇది ఇంతవరకు ఎప్పుడు అక్కడి ప్రజలకు కనిపించేది కాదు. ఎప్పుడు చూసినా నీళ్లతో మునిగి రకరకాల పక్షులతో, గుంపులు, గుంపులుగా గద్దలు కనిపించేవి. కానీ ఇప్పుడు అవి కూడా కనిపించక నిర్మానుష్యంగా ఉంది. గత 20 ఏండ్ల క్రితం 2003లో ఒక్కసారి మాత్రం ఇదే పరిస్థితి నెలకొంది. కానీ ఆగస్టులో వచ్చిన వర్షాలు మాత్రం మళ్ళీ నిండిపోయి జలకల సంతరించుకుంది. కానీ నేడు ఎన్నడూ లేని విధంగా ఈసారి వర్షాలు పడకపోవటంతో వాగు ప్రాంతం అంతా నీళ్ల లేక బండ రాళ్ల, రాళ్ళ గుట్టలు కనుచూపు మేరలో కనిపిస్తున్నాయి. ఆగస్టులో కూడా వర్షం జాడేలేదు. దీంతో రైతులు మనోవేదన చెందుతు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

వాగులో నీళ్లు లేక పొలాలు ఎండుతున్నాయి..

అలుగుల సైదిరెడ్డి(నేతాపురం)



వర్షాలు పడి వాగులో నీళ్లు వస్తాయని 9 ఎకరాలు వరి సాగు చేశాను. ఆగస్టు అయిపోయింది. ఇంత వరకు వర్షాలు కురవక వాగు ఎండిపోయి బండరాళ్లు కనిపిస్తున్నాయి. అప్పటికి డ్రమ్ము సీడ్స్ పద్ధతిలో వరి సాగుచేసిన ఫలితం లేదు. పొలం అంత ఎండిపోయింది. ఎకరానికి 20 వేలు ఖర్చు వచ్చింది. 2 లక్షల అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

ఈసారి తిండికి గింజలు కూడా కష్టం గానేవుంది

కత్తి కక్కిరెడ్డి (కక్కయ్య గూడెం)



మూడేకరాలు వరి సాగు చేశాను. వాగులో చుక్కనీళ్ల కూడా లేవు. వాగులో నీళ్ల లేక బోర్లు కూడా పోయడం లేదు. కనీసం తిండికి గింజలకు కూడా ఈసారి ఇబందిగా ఉంది. ఆగస్టు అయిపోయిన వర్షాలు లేక వాగు ఎండిపోయింది. కనీసం పశువులు, మేకలు, గొర్లకు కూడా తాగేందుకు నీళ్ల వాగులో లేవు.

ఓటర్ నమోదుపై ప్రత్యేక క్యాంపెయిన్

- అక్టోబర్ 4న తుది ఓటర్ జాబితా
- కలెక్టర్ కర్ణన్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాలలో సెప్టెంబర్ 2, 3 తేదీలలో ఓటర్ జాబితాలో ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులపై ఎన్నికల సంఘం ఆదేశాల ననుసరించి ప్రత్యేక క్యాంపైన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్‌లో ఓటర్ నమోదు కార్యక్రమాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 2, 3 తేదిలలో ప్రత్యేక క్యాంపెయిన్ సందర్భంగా బీఎల్‌ఓలు పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉంటారని, ఓటర్ జాబితాలో నమోదు కాని 1అక్టోబర్ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ఓటర్లను నిర్ధీత ఫారంల ద్వారా ఓటర్‌గా నమోదు చేయనున్నట్లు, స్పెషల్ క్యాంపైన్ గురించి విస్తృత ప్రచారం గావించాలని తెలిపారు. బిఎల్ ఓలు,బూత్ లెవెల్ ఏజెంట్‌లు పాల్గొనాలని ఆయన కోరారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా కేంద్రాలలో బీఎల్‌వోలకు సహ కరించాలని కోరారు. ప్రతి బుధవారం నియోజకవర్గం స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో ఆర్‌ఓ కార్యాలయం వద్ద ఈవియం ప్రదర్శన కేంద్రం ఏర్పాటు చేసినట్లు, ప్రతీ నియోజకగ్గస్థాయిలో ఒక మొబైల్ వాహనం ద్వారా ఈవీఎం, వీవీ ఫ్యాట్ యంత్రంల ద్వారా ఓటు వేయడంపై అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు.

రెండవ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2023 కార్యక్రమంలో భాగంగా 2023 అక్టోబర్ ఒకటవ తేదీ అర్హత తేదీగా ఈ నెల 21 న ముసాయిదా ఓటర్ జాబితా ప్రకటించినట్లు తెలిపారు. ఈ నెల 21 నుండి సెప్టెంబర్ 19 వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, 2023 సెప్టెంబర్ 28 వ తేదీలోగా విచారణ చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం అనుమతి తో 2023 అక్టోబర్ అక్టోబర్ 4 న తుది ఓటర్ జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 13,84,525 మంది ఓటర్‌లు ఉండగా పురుషులు 6,90,072, మహిళలు 6,94,335, ట్రాన్స్ జెండర్‌లు18 మంది ఉన్నారని తెలిపారు. సర్వీస్ ఓటర్‌లు 543 మంది కాగా పురుషులు520 మంది, మహిళలు 23 మంది ఉన్నట్లు తెలిపారు. ఆగస్ట్ 26, 27 తేదీలలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఫారం 6, 7, 8 ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులపై 5,823 దరఖాస్తులు అందాయని తెలిపారు. జిల్లా లోని అన్ని పోలింగ్ బూత్ లలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ.నర్సిరెడ్డి (సిపిఐ (ఎం)), బక్క పిచ్చయ్య (బీఆర్‌ఎస్), పోతేపాక లింగస్వామి (బీజేపీ), శంకర్‌నాయక్, (కాంగ్రెస్) యాదగిరి, (బీఎస్పీ), కుతు బుద్దిన్(ఏఐఎంఐఎం), మల్లికార్జున్ (టీడీపీ), కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణ మూర్తి, ఎన్నికల డీటీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

నవతెలంగాణ-నాంపల్లి



పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లి మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మండల పంచాయతీ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులకు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మద్దతు తెలిపి మాట్లాడారు. జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి పల్లేటి హరికృష్ణ, కార్యవర్గ సభ్యులు అబ్బనబోయిన వెంకటయ్య, స్వామి, యాదగిరి, రవి, మరియమ్మ, ఎల్లయ్య, గణేష్, వెంకటయ్య, లక్ష్మయ్య, సబిత, సులోచన, పార్వతమ్మ, ఈరమ్మ, బిక్కు తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ పట్టణంలో రూ. 15 లక్షలతో నిర్మించనున్న బ్రాహ్మణ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయాల్లో ధూప, దీప నైవేద్య పథకం కింద అర్చకులకు ఇస్తున్న రూ. 6 వేలను రూ. 10వేలకు పెంచి సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మెన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మాద నగేష్‌గౌడ్, ప్రగడపు నవీన్‌రావు, సైదిరెడ్డి, అధ్యక్షులు పగిడిమర్రివెంకటేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శి మధు శర్మ, ప్రతినిధులు దుర్గి మురళీధర్ శర్మ, ఎన్ కృష్ణ చంద్రమౌళి, వావిలాల రామలింగయ్య, వావిలాల నగఫణీ, నవీన్ సూరి, ఎన్ సోమేశ్వర్ శర్మ, ఆనంద్ గార్లపాటి మోహన్ రావు, కాటేపల్లి శ్రీనివాస శర్మ కృష్ణమూర్తి శర్మ, సాయి నాగభరద్వాజ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 19 వరకు ఓటు దరఖాస్తు

- రాజకీయ పార్టీలతో ఆర్డీఓ సమావేశం

నవతెలంగాణ-మిర్యాలగూడ



18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని దీనికి సెప్టెంబర్ 19 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్‌డీఓ బీ.చెన్నయ్య తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలకుగాను ఓటర్ జాబితాలో సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. 18 సంవత్సరాల నిండిన వారు, ఓటు హక్కు లేని వారు కొత్తగా ఓటును నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి బుధవారం పోలింగ్ బూతుల వారిగా వచ్చిన దరఖాస్తులను రాజకీయ పార్టీలకు వివరించనున్నట్లు తెలిపారు. 19వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రశాలలో విచారించి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఓటు నమోదు చేస్తామన్నారు. అక్టోబర్ మొదటి వారంలో తుది ఓటర్ జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో కూడా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీవో చెన్నయ్య కోరారు. బుధవారం స్థానిక విజేత కళాశాలలో ఓటు హక్కు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, ముఖ్యంగా యువకులు ఓటు ను నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో యువకులు స్వచ్ఛందంగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. బాధ్యతగా యువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులివ్వాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి
- డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణలో అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి కోరారు. బుధవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ఎంతోమంది పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కొత్తగా పెళ్లయిన దంపతులు రేషన్ కార్డు లేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని చెప్పారు. వెంటనే కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలన్నారు. లేనిపక్షంలో పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మర్రిగూడ

సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ ఒకటవ తేదీన యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని, మర్రిగూడ మండలం నుండి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కే. కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు పీ.పరమేశ్వరి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐఆర్డీఏ చట్టాన్ని రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్ వర్తింపజేయాలని, నూతన జాతీయ విధానం రద్దు చేయాలని, ఐటీ మినహాయింపు పరిమితులు పెంచాలని, బదిలీలు పదోన్నతులు నిర్వహించాలని తదితర డిమాండ్లతో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎన్. శ్రీనివాసరావు, పీ.స్వప్న, కోశాధికారి బీ.యాదయ్య, జిల్లా ప్రతినిధులు డీ.సుందరయ్య, బీ.దీవంత, జీ.వాసుదేవరావు, ఎస్.వెంకట్ కుమార్, కుటుంబ సంక్షేమ నిధి మండల కన్వీనర్ బీ. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాఖీపౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ

అబ్యాస్ పాఠశాలలో బుధవారం ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో 4 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులతో నాకు నువ్వు రక్ష, నేను నీకు రక్ష అంటూ ఒకరికి ఒకరు భరోసానిచ్చుకున్నారు. అందరూ సోదర బావతంతో ఉండలని పాఠశాల చైర్మెన్ వంగాల నిరంజన్‌రెడ్డి కోరారు. పండుగల ప్రముఖ్యత గురించి విద్యార్థులు అవగాహన కల్గివుండలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వంగాల పుష్పలత, ప్రిన్సిపాల్ అప్పాల పాండు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చందూరు

దామరచర్ల : దామరచర్ల మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాఖీపౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వీరన్న, శివకుమార్, శ్రీధర్, మహేష్, గణేష్, అనిత, శిరీష, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సన్ షైన్ హైస్కూల్‌లో రాఖీ సంబరాలు

చందూరు : స్థానిక సన్ షైన్ హైస్కూల్లో బుధవారం ఘనంగా రాఖీ వేడుకలు విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు ఆ స్కూల్ కరస్పాండెంట్ కోడి వెంకన్నకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఖీ ప్రాముఖ్యత గురించి విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-హాలియా




హాలియా

అంగనివాడి టీచర్లను ఆయాలను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అవుతా సైదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హాలియాలో ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు నిరువదిక సమ్మెలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ సువర్ణకి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లు మరియు ఆయాల సేవలు మరువలేనివని శిశు మరణాలను తగ్గించడంలో వీళ్ళ పాత్ర కీలకంగా ఉంది కానీ వీరికి వేతనం చెల్లించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. పెరిగిన ధరల కనుక్కునంగా కనీస వేతనం 26,000 గా నిర్ణయించి అమలు చేయాలని,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్ డ్యూటీ చెల్లించాలని కోరారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లేనియెడల సెప్టెంబర్ 11 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళతామని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు రాజ్యలక్ష్మి, అచ్చమ్మ, ఆండాలు, వజ్రమ్మ, పద్మ, విజయ, నారాయణమ్మ, అంజమ్మ, శారద, పద్మ రమణ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి పట్టణంలో అంగన్వాడిని టీచర్లు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఒంటెపాక వెంకటేశ్వర్లు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పొడిచేటి నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీడీపీఓ అంజు ఆశ్రను కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు సిహెచ్ సుభాషిని, ఒంటెపాక లలిత, జాజుల గౌరమ్మ లతీఫా బేగం, అన్నపూర్ణ, సుజాత పాల్గొన్నారు.



రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల ఐటీ హబ్, ఎస్ఎల్‌బీసీ కెనాల్ మధ్య ఉన్న రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణచారి సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం ఐటీ హబ్, రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ రెండో వారంలో ఐటీ హబ్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నందున్న ఐటి హబ్ నుండి ఉదయ సముద్రం వరకు నిర్వహించే రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల పక్కనే ఉన్న వైకుంఠధామంలో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. మొక్కలు నాటాలని హరితహారం సిబ్బందికి, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ దిలీప్, ఎస్ఐ శ్రీనివాస్, రోడ్డు కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించి వేప చెట్లు తొలగింపు

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామపంచాయతీ పాలకవర్గం చెట్లు పెంపకం నిబంధనలు ఉల్లంఘించి ఏకపక్షంగా వేప చెట్లు కొట్టి వేయడాన్ని సీపీఐ(ఎం) మండల నాయకులు లడే రాములు తీవ్రంగా ఖండించారు. చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం గత 15 సంవత్సరాల పైబడి ప్రభుత్వం, గత పాలక వర్గాలు పెంచిన వేప చెట్లను కొమ్మలు తొలగించడం మానేసి చెట్లమొదలు కొట్టి వేయడం పెట్టాడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెట్లు పెంచే కార్యక్రమాలు చేపట్టినా ఎలాంటి తీర్మానం లేకుండా ఆరెగూడెం గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు భారీ చెట్లను తొలగించడం అన్యాయమని విమర్శించారు. సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలను పాలకవర్గం బలపరుస్తుందా అని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ సెక్రటరీ తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండడం విడ్డూరంగా ఉన్నదని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ(ఎం) ఆందోళన చేయవలసి వస్తుందని రాములు హెచ్చరించారు.

నిత్యవసరాలను రేషన్ ద్వారా పంపిణీ చేయాలి

నవతెలంగాణ-నకిరేకల్




రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల వస్తువులను పంపిణీ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెన్నబోయిన నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం శాలిగౌరారం మండల కేంద్రంలో ఐద్వా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు పెరగడంతో గర్భిణీలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనతకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రజా పంపిణీ ద్వారా 14 రకాల వస్తువులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఇందిరా, ప్రతినిధులు వెంకటమ్మ, పూలమ్మ,, లక్ష్మమ్మ, అంజమ్మ, మౌనిక, యాదమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

రెండవ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించి రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుగులోత్ రాజారామ్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ముందు రెండవ ఏఎన్ఎం సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎం జిల్లా నాయకురాలు మేడే లక్ష్మి బాయి, ఏఐటియుసి జిల్లా నాయకులు కోట రామస్వామి, ఏఎన్ఎం నాయకురాలు స్వప్న, గోపమ్మ, రమాదేవి, గీత, విజయ, పార్వతి, జయమ్మ, పద్మ, రజిని, రప, శిరోమణి ,నాగమ్మ, బేబీ, ఎల్లమ్మ ,యశోధ,ఉమారాణి, రజిత, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సూర్యాపేట

ఘనంగా శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి హోమం

నవతెలంగాణ-చివ్వెంల

మండలపరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో బుధవారం నిజశ్రావణమాస పౌర్ణమి సందర్భంగా శ్రీఉండ్రుగొండ లక్ష్మీనర్సింహాస్వామి స్వామి ఆలయంలో శ్రీ హయగ్రీవ మరియు సుదర్శన సమేత శ్రీలక్ష్మీనర్సింహాహోమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీమాన్ అఖిలేశ్వరాచార్యులు, ఆలయపూజారులు శ్రీమాన్ కృష్ణమాచార్యులు,ఆలయ అభివృద్ధికమిటీ అధ్యక్షులు శ్రీ కృష్ణకుమార్,మధుసూదన్‌రావు, శ్రీనివాస్, కృష్ణమోహన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు గృహలక్ష్మీ పథకం అందేలా చూడాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ మున్సిపల్‌పరిధిలో, నియోజకవర్గవ్యాప్తంగా అర్హులందరికీ గృహలక్ష్మీపథకం వర్తించేలా అధికారులు కృషి చేయాలని మూడో వార్డు కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి అన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హత లేని వారిని ఎంపిక చేసినట్టయితే ఆ పథకం లక్ష్యం నెరవేరదన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులకు అందే విధంగా అధికారులు చూడాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

నవతెలంగాణ-నేరేడుచర్ల

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందిన సంఘటన నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది.ఎస్సై పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన షేక్‌అలీ సైదా(65) నేరేడుచర్ల సెంటర్ నుండి నేతాజీనగర్‌లో గల తన ఇంటికి టీవీఎస్ ఎక్సెల్ AP24Q9331 మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మార్గమధ్యలో వ్యవసాయ మార్కెట్ వద్దకు చేరుకోగానే హుజూర్‌నగర్ వైపు నుండి మిర్యాలగూడ వైపు వెళ్తున్న స్విఫ్ట్ కారు UP32FP7316 యొక్క డ్రైవరు తన కారును అతివేగంగా జాగ్రత్తగా నడిపి టీవీఎస్‌ఎక్సెల్ బండికి వెనుక నుండి టక్కరి ఇవ్వగా అతని కాళ్లకు, తలకు, ఇతర చోట్ల తీవ్రమైన గాయాలయ్యాయి.చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని 108 అంబులెన్స్ ద్వారా మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు నిర్మాణపనులు ప్రారంభం

నవతెలంగాణ-తిరుమలగిరి

తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలం చింతలకుంటతండా గ్రామపంచాయతీ పరిధిలో సీసీరోడ్డు నిర్మాణపనులను బుధవారం జెడ్పీటీసీ దూపటి అంజలి రవీందర్, ,గ్రామసర్పంచ్ జాటోతు రవి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బానోతు యాకుబ్‌నాయక్, సోడా ప్రవీణ్, ఉపసర్పంచ్ భాషానాయక్, గ్రామ అధ్యక్షులు నరేష్ పాల్గొన్నారు.

అనాథపిల్లలకు,మహిళలకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర ఉన్న పేద మహిళలకు,చిన్న పిల్లలకు దుప్పట్లు, పండ్లు,బిస్కెట్ ప్యాకెట్స్ సాయి సిరి సూపర్ మార్కెట్ వారి సౌజన్యంతో పంపిణీ చేశారు. నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన ఉన్న రోడ్డు వెంట ఇద్దరు మహిళలు కొంతమంది చిన్న పిల్లలు ఉన్నారని తెలుసుకొని వారికి ఎటువంటి భద్రత లేదని తెలిసి నేరేడుచర్ల ఎస్సై పరమేష్ వారి సిబ్బందితో వచ్చి వారిని సురక్షిత ప్రాంతం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో యారవ సురేష్,కర్నాకర్‌రెడ్డి, శంకరాచారి, దుర్గారావు, యశ్వంత్ పాల్గొన్నారు.



శ్రీరంగపురంలో జలాభిషేకం

- నేడు బొడ్రాయి పునర్‌ప్రతిష్ఠ కార్యక్రమం

నవతెలంగాణ-కోదాడరూరల్

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగపురం గ్రామంలో నేడు జరుగబోయే బొడ్రాయి పునర్‌ప్రతిష్ఠ, గ్రామదేవతల విగ్రహాలకు మహిళలు పెద్ద ఎత్తున జలాభిషేకం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు వనపర్తి లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరంగపురం గ్రామంలో గురువారం నిర్వహించే బొడ్రాయి, గ్రామదేవతల పునర్‌ప్రతిష్ఠకు పెద్దఎత్తున భక్తులు ప్రజలు హాజరై విజయవంతం చేయాలనికోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కందుల కోటేశ్వర రావు, కందుల చంద్ర శేఖర్, మాజీ కౌన్సిలర్ వనపర్తి సోమమ్మ, పిచ్చయ్య, బొడ్రాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులందరికి ఉద్యోగభద్రత కల్పించి,కనీస వేతన స్కేలు, ప్రతి ఉద్యోగికి జీవిత భీమా రూ.10 లక్షలు,ఆరోగ్య భీమా రూ. 5 లక్షలు అందించాలని అన్నారు.విద్యాశాఖ నియామకాలలో వెయిటేజీ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రాంబాబు, కోశాధికారి లక్ష్మినారాయణ, సయ్యద్, నాగరాజు, మదనాచారి, శీను, రవి, కోటేశ్వరావు, అంజన్, సరస్వతి, సునీత, ఉమా తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-నేరేడుచర్ల

మండల స్థాయి పాఠశాలల ఆటల పోటీలలో పాల్గొనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దిర్శించర్ల బాలబాలికలకు 30 మందికి ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ ఇన్‌చార్జి కుక్కల వెంకన్న క్రీడాదుస్తులు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు అధికంగా విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మౌళిక సదుపాయాల కొరకు ఓజో ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు.దిర్శించర్ల నందు రెండు పాఠశాలలకు మైక్ సెట్లను అందిస్తామని తెలిపారు. ఇదే సందర్భంలో ఇటీవల ఎస్ ఐ ఫలితాల్లో విజయం సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థి నన్నెపంగ వినయ్, గ్రామానికి చెందిన మల్లు సంజీవరెడ్డిలను ప్రధానోపాధ్యాయులు బట్టు మధు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ బాధ్యులు నాగుల్ మీరా అమీర్,సైదులు పీఎస్‌హెచ్‌ఎం కట్టామాధవి, ఉపాధ్యాయులు జి శ్రీదేవి, జె శ్రీనివాస్, ఎస్.విజయ్‌కుమార్, ఎం యాదగిరి, ఎన్ కోటిరెడ్డి, ఎస్ కె సభియా, శభీనా పాల్గొన్నారు.

పేటలో ఐడీబీఐ బ్యాంకు 100వ శాఖ ప్రారంభం

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

ప్రముఖ పారిశ్రామిక జిల్లాగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేట జిల్లాలో ఐడీబీఐ బ్యాంకు 100 వ బ్రాంచిని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని ఐడీబీఐ బ్యాంకు సీజీఎం, జోనల్ హెడ్ శరత్ కామత్ అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ సమీపంలో బ్యాంకుల సముదాయం వద్ద బుధవారం ఐడీబీఐ బ్యాంక్ బ్రాంచిని ఆయన ప్రారంభించారు.అనంతరం పలువురు వ్యాపారవేత్తలకు రుణాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వాసుదేవన్ డిప్యూటీ జోనల్ హెడ్‌నారెన్, ఏజీఎం అజిత్‌కుమార్, బ్రాంచి మేనేజర్, శివాని మేనేజర్, హీరో షోరూం డీలర్ రాచర్ల కమలాకర్,పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

పంటరుణాల లక్ష్యం చేరుకోవాలి

- ఉన్నత విద్యకు ఎక్కువ రుణాలు అందించాలి
- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్



జిల్లాలో పంట రుణాల లక్ష్యం చేరుకోవాలని బ్యాంకర్లను కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ ప్రథమ త్రైమాసిక సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉద్యాన వన రైతులకు బ్యాంకర్లు ఎక్కువగా రుణాలు మంజూరు చేయాలని, ప్రభుత్వం అందించే సబ్సిడీ ఉద్యాన శాఖ ద్వారా లబ్దిదారులకు చెల్లిస్తామని తెలిపారు. ఆయిల్ ఫామ్ కింద ఈ సంవత్సరం 192 మంది రైతులు 830 ఎకరాలలో పంట సాగు చేస్తున్నారని వివరించారు. ఉపాధి హామీ కింద 2వేల ఎకరాల పామాయిల్ సాగు చేయించాలని పీడీని ఆదేశించారు.యువత ఉన్నత చదువుకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 లక్షల లోపు విద్యా రుణాలు అందించాలని,రుణాల మంజూరు కోసం ప్రజావాణిలో అందించిన దరఖాస్తులపై సత్వరమే బ్యాంకర్లు స్పందించాలని సూచించారు.రుణాల మంజూరులో లబ్దిదారులను బ్యాంకర్లు ఇబ్బంది పెట్టొద్దని తెలిపారు.రైతులకు అందించే పంట రుణాల లక్ష్యం పూర్తి కానందున సత్వరమే పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఈ వానాకాలంలో రైతు బంధు కింద 2,76,764 మంది రైతులకు రూ. 310.82 కోట్లు పెట్టుబడి సహాయం అందించామని అలాగే రుణమాఫీ కింద ఇప్పటి వరకు 48,884 మంది రైతులకు రూ.218 కోట్లు చెల్లించామన్నారు.ముద్ర పథకం కింద అందించే రుణాలు వికలాంగులకు కూడా అవకాశం కల్పించి వారి ఆర్థిక భరోసాకు చేయూత అందించాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల రుణాల కింద రూ.589.10కోట్ల లక్ష్యానికి రూ. 102.10కోట్లు అందించి 17.33 శాతం వృద్ధి సాధించామని తెలిపారు.ఈ సమావేశంలో ఎల్ డి ఎం బాపూజీ, ఆర్‌బిఐ ఏ జి ఎం తన్యా సంగ్మా, నాబార్డ్ ఏజీఎం సత్యనారాయణ, ఎస్‌బిఐ ఎజి ఎం జ్యోతి, డిసిసి బ్యాంక్ సీఈఓ మదన్‌మోహన్, ఏపీజీవీబీ ఏజీఎంలు శ్రీనివాసులు, విజయ్ భాస్కర్, వివిధ బ్యాంక్ మేనేజర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- జిల్లా అడిషనల్ పీడీ పెంటయ్య

నవతెలంగాణ-కోదాడరూరల్

ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ పీడీ పెంటయ్య అన్నారు.బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామీణ ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో



పాల్గొని ఆయన మాట్లాడారు.ప్రజా వేదికలో గ్రామాల వారీగా కూలీలకు చెల్లించిన వేతనాలు సక్రమంగా అందినట్లు తెలిపారు. 13వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ 16 గ్రామపంచాయతీలకు సంబంధించిన పనులు 113929957 రూపాయలు కాగా, కూలీల వేతనాలు 99691918 రూపాయలు, సామాగ్రి 14238039, ఫారెస్ట్ 1437170 ఖర్చులు అయ్యాయన్నారు.మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సామాజిక తనిఖీ ఈ నెల 15వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరిగింది అన్నారు. గ్రామానికి సంబంధించిన సిబ్బందిని కార్యదర్శిని వారు చేసిన పొరపాట్లను తెలిపారు.కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరించడం వలన వారికి పెనాల్టీ 76290 రూపాయలు ఫైన్ వేశామన్నారు.మస్టర్‌లలో సంతకాలు లేక నిర్లక్ష్యం వ్యవహరించిన సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, అంబుడ్స్‌మెన్ లచ్చీరాంనాయక్, గుడిబండ సర్పంచ్ అలివేలు మంగమ్మ, ఎంపీటీసీ శంకర్‌శెట్టి కోటేశ్వరరావు, ఎస్‌టీఎం అజయ్, రమేష్, ముత్తయ్య, రాజు, ఈసీ నాగేశ్వరరావు, ఏపీవో టానియా, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-తిరుమలగిరి

కళాసారథిలో పనిచేస్తున్న కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు 30శాతం పిఆర్సి జీవోను అమలు చేయడం పట్ల హర్ష వ్యక్తం చేస్తూ బుధవారం సూర్యాపేట జిల్లా కళాకారుల ఆధ్వర్యంలో తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్,కళాసారథి చైర్మెన్‌రసమయి బాలకిషన్, తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిషోర్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమకు పిఆర్సి అమలు చేయడంతో కళాకారుల కుటుంబాలన్ని సంతోషంగా గడుపుతాయన్నారు.కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని మరింత ఉత్సాహంతో పని చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాకారులు పాలకుర్తి శ్రీకాంత్‌గౌడ్,గడ్డంఉదయ్,పల్లె రాము,డప్పు సుధాకర్,పాకఉపేందర్, బోనాలనరేందర్,గజ్జిమంజుల,కందమల్ల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి :మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ జిల్లా అధ్యక్షులు వేముల నరేష్ మేడిపల్లి వేణి ఆధ్వర్యంలో శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్,విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సాంస్కృతిక సారధి చైర్మెన్ రసమయి బాలకిషన్, తుంగతుర్తి శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్



అర్వపల్లిలో...

చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు వేముల నరేష్, మేడిపల్లి వేణు, సారధి డైరెక్టర్ హరికృష్ణ, కళాకారులు మాగి శంకర్ గడ్డం ఉదయ్ ఈర్ల సైదులు గంట బిక్షపతి పాలకుర్తి శ్రీకాంత్ పల్లెల రాములు డప్పు సుధాకర్ పాక ఉపేందర్ గజ్జి మంజుల కుందమళ్ళ నాగలక్ష్మి సిర్పంగి రాధ ఒంటె పాక ప్రియదర్శిని ఇంద్ర పాల్గొన్నారు.

గ్రామీణ కృషి అనుభవం ఎంతో ముఖ్యం



నవతెలంగాణ-చివ్వెంల

గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా అకాడమీ డిగ్రీ,పీజీ కళాశాల, సికింద్రాబాద్, యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ విధానాలు స్థితిగతులను తెలుసుకొని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ (పీఆర్‌ఏ) కార్యక్ర మం ద్వారా అధ్యయనం చేశామని కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన గ్రామీణ అవగాహనా సదస్సునుద్దేశించి ఆయన మాట్లాడారు.ఈ ప్రక్రియలో వ్యవసాయ విద్యార్థులు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను గురించి తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి గ్రామ పటం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు,వెన్ డయాగ్రమ్,పై చార్ట్,చిత్రాల రూపంలో ప్రదర్శించి గ్రామీణ రైతులకు అవగాహన కల్పించినట్లు తెలియజేసారు. గ్రామం యొక్క వనరులను గ్రామ పటం ద్వారా చిత్రీకరించి, గ్రామంలోని రైతుల వర్గీకరణ, జనాభా భౌగోళికప్రాంతం ,నీటి వనరులు, వ్యవసాయ దిగుబడులు, చీడ పీడల నివారణకు ఆచరిస్తున్న విధానాలు మొదలగు అంశాలపై, చార్ట్‌లో చిత్రీకరించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె శాస్త్రవేత్తలు నరేష్, ఆదర్శ్, రావే ప్రోగ్రాం ఇన్‌చార్జి నరేష్, గ్రామ సర్పంచ్ జూలకంటి సుధాకర్‌రెడ్డి,విద్యార్థినులు హిమజాశ్రీ దేవి, చింతల.గాయత్రి, సౌమ్య, నిమిషా, మేరీ శ్రీరమ్య,రైతులు సోమిరెడ్డి, సుధాకర్, శామ్యూల్, పద్మ, కోడి వెంకన్న, అంజిరెడ్డి, నాగరాజ్, రవి, రాములు, మలేష్, పాల్గొన్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి

నవతెలంగాణ-తిరుమలగిరి

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు పిలుపునిచ్చారు. బుధవారం తిరుమలగిరిలో మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.2014 ఎన్నికల సందర్భంగా నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన బిజెపి నాయకులు తొమ్మిది సంవత్సరాల కాలంలో అదనంగా ఉద్యోగాలు కల్పించక పోను పరిశ్రమలు మూసివేత ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం వలన సుమారు కోటి మంది ఉద్యోగాలు కోల్పోయి ఉద్యోగులుగా రోడ్డున పడ్డారని విమర్శించారు..గ్యాస్ సిలిండర్ ధరను రూ.400 నుండి రూ.1200 పెంచి నేడు రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూ.200 తగ్గిస్తున్నట్టుగా చేస్తున్నారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ,ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.మిట్టపల్లి



లక్ష్మీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గుమ్మడవెల్లి ఉప్పలయ్య, కడారి లింగయ్య, రాయల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'శ్రీఅరబిందో'లో ముందస్తు రాఖీ వేడుకలు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలపరిధిలోని అనంతారం గ్రామంలోని శ్రీ అరబిందో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం రాఖీ పౌర్ణమి ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు విద్యార్థులు రాఖీలను కట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు,కరస్పాండెంట్ షేక్ మస్తాన్ మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతులను, సంప్రదాయాలను కాపాడుకోవాలని, స్త్రీలను గౌరవించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగయ్య, స్వప్న నరసింహ, జాన్‌బి, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.



మున్నూరుకాపు జర్నలిస్టు ప్లీనరీని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సెప్టెంబర్ 6వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మున్నూరుకాపు జర్నలిస్టుల ప్లీనరీ సమావేశానికి రాష్ట్రంలో పనిచేస్తున్న మున్నూరు కాపు జర్నలిస్ట్ సోదరులు భారీ ఎత్తున తరలిరావాలని జర్నలిస్టు సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూడి జనార్ధన్‌పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పబ్లిక్‌క్లబ్‌లో నిర్వహించిన జర్నలిస్టులకు సంబంధించిన ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్నూరు కాపు జర్నలిస్టుల హక్కుల సాధనకై ఈ ప్లీనరీలో ప్రస్తుతం ప్రధాన సమస్యలైన ఇళ్ల నిర్మాణం, హెల్త్‌కార్డు,అక్రిడిటేషన్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏర్పాటు తీర్మానాలు చేశామన్నారు.జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ సభలో తీర్మాణం చేశామన్నారు. తెలంగాణలో 5000 పైచిలుకు విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులు తమ హక్కులను సాధించుకోవాలని కోరారు.. అదేవిధంగా పనిచేస్తున్న కంట్రీబుటర్లు స్ట్రింగర్స్ కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జర్నలిస్టు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు ఫణీంద్ర, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బుక్క రాంబాబు,ఉపాధ్యక్షులు గట్టు అశోక్‌కుమార్,జై కిసాన్ శీను,కార్యదర్శి చల్లా రామారావు, మున్నూరుకాపు యూత్ అధ్యక్షులు నల్లకుంట సందీప్, యూత్ సెక్రెటరీ కొండేటి సతీష్, మున్నూరుకాపు మహాసభ పట్టణ జనరల్ సెక్రెటరీ ఎలిమినేటి నవీన్,తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

నవతెలంగాణ-మఠంపల్లి

మండలంలోని యాతవాకిళ్ల గ్రామంలో పౌరహక్కులపై బుధవారం సర్పంచ్ కోలాహలం లక్ష్మీనర్సింహారాజు అధ్యక్షతన అవగాహనాకార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మామిడి జానకిరాములు మాట్లాడుతూ పౌరులకు సంబంధించిన హక్కులపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ఆర్‌ఐ సుజిత్‌కుమార్,ఏపీఓ ఉమా, సౌజన్య పి .నాగిరెడ్డి,టి.సైదులు తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో...

ఓటు నమోదుపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-నేరేడుచర్ల

పట్టణంలోని న్యూ అరబిందో డిగ్రీ, స్పందన కళాశాలలో ఓటు నమోదుపై తహసీల్దార్ సైదులుగౌడ్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ అక్టోబర్ ఫస్ట్ లోగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు.ప్రతి ఏడాది నాలుగు సార్లు ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తుందని ఈ అవకాశాన్ని యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల కరస్పాండెంట్ కట్ట ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు ఆంజనేయులు, శ్రీధర్,సతీష్,చారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీవో వీరబ్రహ్మాచారి అన్నారు.మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు.ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఫారం 6, 7 ,8 ద్వారా ఓటరు నమోదు,డిలేషన్స్, కరెక్షన్స్ చేసుకోవచ్చన్నారు. ఆగస్టు 26 ,27 తేదీలలో మొదటివిడత ఓటుహక్కు నమోదు కార్యక్రమం పూర్తి అయిందని, సెప్టెంబర్ 2 ,3 వతేదీలలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూతులెవల్ అధికారులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు అందుబాటులో ఉంటారన్నారు.అన్ని పార్టీల ప్రతినిధులు 326 పోలింగ్ కేంద్రాలకు బీఎల్‌ఏ వివరాలు ఇవ్వాలని కోరారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి ,డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్,అల్లావుద్దీన్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ ఫలాలు అందరికి అందాలి : ఎంపీపీ

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

మండలపరిధిలోని మర్రిగూడెం గ్రామంలో బుధవారం మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు దళితవాడలో రాజ్యాంగ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ మాట్లాడారు.భారత రాజ్యాంగం ప్రకారం కుల, మత వర్గ విచక్షణ లేకుండా అందరికి సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు.వాటిని ఎవరూ హరించరాదన్నారు.తెలంగాణ ప్రభుత్వం దళిత, సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, దళితబంధు పథకం అమలు చేస్తోందన్నారు.ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మర్రిగూడెం గ్రామంలో 8 ఎకరాల కార్పొరేషన్ ద్వారా మర్రిగూడెం గ్రామంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని పంపిణీ చేశామన్నారు.సమాజంలో అధికారులకు ఫిర్యాదుకు గురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెల్లా సైదులు, తహసీల్దార్ ఎం.నాగార్జున్‌రెడ్డి, ఎంపీఓ లావణ్య,డిప్యూటీ తహసీల్దార్ సుధ, ఆర్‌ఐ షరీఫ్, ఏఎస్‌ఐ బలరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి,వార్డుసభ్యులు పాల్గొన్నారు.

పండ్లు,కూరగాయలకు విలువ జోడింపుపై గ్రామస్తులకు శిక్షణ

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలంలోని దూపహాడ్ గ్రామంలో గడ్డిపల్లి కెవికె లో శిక్షణ పొందుతున్న సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినిలు పండ్లు, కూరగాయలకు విలువ జోడింపుపై గ్రామస్తులకు బుధవారం శిక్షణ కల్పించారు. అందులో భాగంగా ఎలాంటి రసాయనాలు లేకుండా సులువుగా ఇంట్లోనే చేసుకునే కొన్ని రకాల జామ్స్, కేచప్, స్క్వాష్, మరియు ట్రుటీ ఫ్రూటీలను తయారు చేశారు.గ్రామస్తులతో కూడా చేయించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ డిగ్రీ విద్యార్థినులు దీపికరెడ్డి, శివాని, పుష్ప, భాగ్యశ్రీ, శార్వాణి, శ్వేత, మనోగ్న, దివ్య, వైష్ణవి, గ్రామస్థులు శ్రీనివాస్, వీరభద్రయ్య, రాజు, కవిత, పద్మ శిరోమణి, లింగమ్మ, సుజాత, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ సునీత

నవ తెలంగాణ -ఆలేరు టౌన్

రక్షబంధన్ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని ప్రతిబింబిస్తుందని, భారతీయ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాఖీతో అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సోదరులంతా తమ అక్కాచెల్లెళ్లపై అనిర్వచనీయమైన ప్రేమను కురిపించడంతోపాటు వారి రక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు అనురాగంతో తమ అన్నాదమ్ముల చేతికి రాఖీ కట్టడం గొప్ప సందర్భంగా అభివర్ణించారు.

నారాయణరెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే పైళ్ల

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలంలోని పహిల్వాన్ పురం సర్పంచ్ తుమ్మల వెంకట్ రెడ్డి తండ్రి తుమ్మల నారాయణ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందడంతో స్థానిక శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్ రాజ్ , గుర్రం లక్ష్మారెడ్డి,సోలిపురం సాగర్ రెడ్డి, సుర్కంటి వెంకట్ రెడ్డి,కొమురెల్లి సంజీవ రెడ్డి,తుమ్మల వెంకట్ రెడ్డి,బోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ అనుబంధం రక్షా బంధన్

- తోబుట్టువులపై ప్రేమానురాగాలను ప్రతీక
- పుట్టింటికి పయనమవుతున్న మహిళలు



నవతెలంగాణ-బొమ్మలరామారం

కాలం మారినా, దూరం పెరిగినా చెరగని బంధం అన్నా,చెల్లెళ్ల అనుబంధం... అక్కాతమ్ముళ్ల అనురాగాలు, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ. జీవితంలో తనకు ఎల్లవేళలా రక్షణగా ఉండాలని సాధక బాధకాల్లో తోడుగా నిలవాలని అన్నాదమ్ముళ్లకు రాఖీ కట్టడానికి పుట్టింటికి పయనమయ్యారు.

పేద, ధనిక తారమత్యం లేదు. కుల మతం పట్టింపులు లేవు. వయస్సుతో సంబంధం లేకుండా అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలతో నిర్వహిండుకునే పండుగ రాఖీ పౌర్ణమి.. నువ్వు చల్లగా ఉండాలి... సోదరా అంటూ ఆడపడుచులు రాఖీ కడితే.. మీకు అండగా నేనున్నా సోదరి అంటూ సోదరుడు భరోసా ఇచ్చే వేడుక ఇది.నువ్వు నాకు రక్షనేను నీకు రక్ష మనమిద్దరం దేశానికి రక్ష రాఖీ సంప్రదాయం దేశ చరిత్ర. సంస్కృతిలో భాగంగా ఎదిగింది. రాఖీ పండుగను జరుపుకునేందుకు అనేక చరిత్రలున్నాయి.ఒక ప్రాంతంలో ఒకో రకంగా పండుగను పిలుస్తారు. ఒక ప్రాంతంలో రాఖీ పండుగకు ఒక కారణాలు చెబుతుంటారు. ప్రతి సంవత్సరం శ్రావణ పౌర్ణమి రోజు జరుపుకునే పండుగకు ఎంతో ప్రత్యేకతఉంది.

కొనుగోలు సందడి : రాఖీ పర్వదినం సందర్భంగా తమ సోదరులకు రాఖీలు కొనుగోలు చేసేందుకు దుకాణాల్లో సందడి చేస్తున్నారు.విభిన్న ఆకృతులలో ఆకర్షణమైన రంగులు,చూడగానే ఆకట్టుకుంటున్న మోడల్స్ కనివిందు చేస్తున్నాయి.చిన్నారులు టీవీల్లో వీక్షించే కాటన్ బొమ్మలతో రాఖీలను ప్రత్యక్షంగా తయారు చేసే అమ్ముతున్నారు. వీటిని చిన్నారులు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. స్నేహితులు దినోత్సవం, పుట్టినరోజు, ఇలా ఏ పండుగ అయినా ప్రతి ఒక్కరు నేడు వాట్సాప్, ఫేస్ బుక్ లలో శుభాకాంక్షలు తెలుపుతున్నారు.సాంకేతికత పెరిగిన నేటికి ఆదరణ తగ్గని పండుగ రాఖీ. ఎంత దూరమైనా రాఖీ పండుగ అనగానే అక్క చెల్లెలు అన్నదమ్ములు గుర్తుకు వస్తాయి.

సోదర ప్రేమకు ప్రతిరూపం...

తిరుమల కవిత వెంకటేష్ గౌడ్ హాజీపూర్ సర్పంచ్



ప్రతి సంవత్సరం నా సోదరులకు తప్పనిసరిగా రాఖీ పౌర్ణమి రోజు పుట్టింటికి వెళ్లి రాఖీ కడతా. రాఖీ సోదర ప్రేమకు ప్రతిరూపం.ఈ రాఖీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతికగా నిలుస్తుంది.

తప్పకుండా ఇంటికి వెళ్తాం..

మంజుల గృహిణి



తను ఎక్కడ ఉన్న రాఖీ పౌర్ణమి రోజు తప్పకుండా మా అన్నదమ్ములకు రాఖీ కడతా.. ఆ రోజు రాఖీ కట్టిన తర్వాత మిగిలిన పనులు చూసుకుంటా

స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ -భువనగిరిరూరల్



స్పష్టమైన ఫోటో జాబితా రూపకల్పనకు సహకరించాలని జిల్లా కలెక్టర్ వినయ్ కుమార్ రెడ్డి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం ఆయన కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా తయారీపై సమీక్షిస్తూ ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో అందరూ సహకరించాలని కోరారు. సెప్టెంబర్ 19వ తేదీ వరకు ఓటరు ముసాయిదా జాబితా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లాలో 01.10.2023 నాటికి 18 ఏండ్లు వయసు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. సెప్టెంబర్ 2,3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాల ద్వారా ఓటు నమోదుకు సహకరించాలన్నారు. ఇప్పటి వరకు 16,476 దరఖాస్తులను స్వీకరించినట్టు తెలిపారు. వీటిలో 3626 ఆమోదించబడగా 15 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని, మిగతా 12,835 దరఖాస్తులు విచారణలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ ఎ భాస్కర్ రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బంటు రామచంద్రయ్య, గడ్డం వెంకటేష్, ఎ.కిరణ్, జిల్లా కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వర చారి, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికులంటే ఎందుకింత అలుసు

- డంపింగ్ యార్డ్‌కు నీళ్లు మోయిస్తున్న అధికారులు

నవతెలంగాణ -సంస్థాన్ నారాయణపురం



జీపీ కార్మికుల అంటే అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిన్న చూపు తగ్గడం వాళ్ల చేత ఏళ్ల తరబడిగా పెట్టి చాకిరి చేయిస్తూనే బుధవారం మండలం వావిళ్ళపల్లి గ్రామ పంచాయతీ కార్మికుల చేత అర కిలోమీటర్ దూరం చెట్లకు నీళ్ల మోయిస్తున్నారు.గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ ఉన్నప్పటికీ కక్షపూరితంగానే కార్మికుల చేత నీళ్ల మోయిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు కొంగరి మారయ్య,ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్మికులను చాలీచాలని వేతనాలతో వెట్టి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం జీతం పెరిగిన అదే తరహాలో పని భారం పెరిగిందన్నారు.శ్మశాన వాటికల్లో,రోడ్ల వెంట చెట్లకు నీళ్ల పోయించటం,గడ్డి చెక్కించటం, ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలను శుభ్రం చేయడం వంటి అనేక రకాల పనులు చేయిస్తూ సిబ్బందిని ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు.డంపింగ్ యార్డులో నీళ్ల ముగించడం దారుణ మన్నారు. అధికారులపై చట్టరీత్య చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఇట్లాంటి పనులు ఎవరు చేయించకుండా చూడాలని కోరారు.

డబ్బుందనే సునీతకు కేసీఆర్ టికెట్ ఇచ్చిండు

- రెండుసార్లు ఎమ్మెల్యే అయిన సునీతకు రూ.వందల కోట్ల ఆస్తులెక్కడివి..?
- ఎమ్మెల్యే భర్త మహేందర్ రెడ్డి షాడో ఎమ్మెల్యేగా పెత్తనం చేస్తుండు
- కాంగ్రెస్ ఆలేరు ఇన్‌చార్జి బీర్ల అయిలయ్య

నవతెలంగాణ-గుండాల



ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డికి ప్రజల్లో పేరు లేకున్నా డబ్బుందనే సీఎం కేసీఆర్ మళ్లీ టికెట్ ఇచ్చారని కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జి బీర్ల అయిలయ్య విమర్శించారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం మండలంలోని వస్తాకొండూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా దళిత వాడల్లో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని,దళితులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.అనంతరం దళిత వాడలో పల్లె నిద్ర,వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వాళ్ల డబ్బా ఇండ్లు ఇచ్చారని తెలంగాణ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామని రాష్ట్రంలో సీఎం కేసీఆర్,ఆలేరులో ఎమ్మెల్యే సునీత దళితులను ఓట్లకోసం వాడుకుని దగా చేస్తున్నారని అన్నారు.30,40 ఏళ్లరాజకీయంలో ఉన్న నాయకులు, ఈ ప్రాంతం నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు అయినోళ్ల, మూడుసార్లుఎమ్మెల్యేగా పని చేసిన గుర్రం యాదగిరిరెడ్డి లాంటి నాయకుడు ప్రజా సేవ చేసేశారే తప్ప ఏం సంపాదించుకోలేదని,రెండు సార్లు ఎమ్మెల్యే అయిన గొంగిడి సునీత రూ.వేల కోట్లు, భూములు, బంగళాలు సంపాదించిందని,కోట్ల విలువైన కార్లలో తిరుగుతుందని, అదంతా అక్రమంగా సంపాదించింది కాకుంటే మరెక్కడిదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే భర్త మహేందర్ రెడ్డి షాడో ఎమ్మెల్యేగా పెత్తనం చేస్తుండన్నారు. ప్రజలను, ప్రతిపక్ష నాయకులను అణిచివేస్తున్నారని ఆరోపించారు.ఇన్నేండ్లు దోచుకున్నోళ్లకే సీఎం కేసీఆర్ తిరిగి టికెట్లు ఇచ్చారంటే ప్రజలు ఆలోచించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి,పీఏసీఎస్ చైర్మెన్ లింగాల భిక్షం గౌడ్,మాజీ ఎంపీపీ ద్యాప కృష్ణారెడ్డి,ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరుపు యాదగిరి గౌడ్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పొన్నగాని నారాయణ గౌడ్ నాయకులు సూదగాని రామచంద్రయ్య పొడిశెట్టి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

నవతెలంగాణ-చౌటుప్పల్

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాకిటి నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది సత్యనారాయణపై జరిగిన దాడికి న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చట్టం ద్వారా న్యాయవాదులకు పూర్తి రక్షణ కలుగుతుందని తెలిపారు. న్యాయవాదిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయం కోసం పోరాడే న్యాయవాదులకే రక్షణ లేనప్పుడు సామాన్యులకు రక్షణ ఎలా కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పాల పరమేశ్, ఉపాధ్యక్షులు తాడూరి పరమేశ్, లైబ్రేరియన్ జక్కర్తి శేఖర్, ముత్యాల సత్తిరెడ్డి, స్వాతి, పిట్టల బిక్షమయ్య, గంగదేవి రవీందర్, జె.శ్రీశైలం, ఎం.నర్సింహాగౌడ్, బడుగు శ్రీకాంత్, డి.శ్రీశైలం, జంగయ్య రాఘవేందర్ పాల్గొన్నారు.



దామెరలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలో ఆదివారం రోజున కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బట్టపోతు రాములు మూడవ వర్ధంతి సందర్భంగా బట్టబతు రాములు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది.సర్పంచి నా రెడ్డి అండాలుసాయి రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిమ్మల మమతాశేఖర్ గౌడ్,బట్టపోతు విజయ్, మాజీ ఎంపిటిసి బట్టపోతు కరుణ,డాక్టర్ వరుణ్, పంచాయతీ కార్యదర్శి కల్పన,ఎంప ఖయ్యూం, నరసింహారెడ్డి,నర్సిరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పై కేసు నమోదు చేయాలని వినతి

నవతెలంగాణ- ఆలేరుటౌన్

నాగర్ కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాల్చి చంపేస్తానంటూ ఘాటు వ్యాఖ్యలతో రెచ్చగొట్టి, టీఆర్ఎస్ కార్యకర్తలతో కొట్టిచ్చి చంపుతానని బెదిరింపులు పాల్పడినందుకు కాంగ్రెస్ కార్యాకర్తలు ఆలేరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు. చర్యలు తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిగిరి విద్యాసాగర్ , యూత్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కర్రె అజయ్ ,పర్రె రమేష్, ఆంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఎల్లవేళలా అండగా కేసీఆర్ ప్రభుత్వం

నవతెలంగాణ- యాదగిరిగుట్ట రూరల్



పేదలకు ఎల్లవేళలా కెసిఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌చైర్మెన్ తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు వైస్ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. గొంగిడి మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సహకారంతో బుధవారం, యాదగిరిగుట్ట మండలం చోల్లేరు గ్రామానికి చెందిన వడ్లకొండ భారతమ్మ భర్త పెంటయ్యకు ఇటీవల అనారోగ్యం కారణంగా హైదరాబాదులోని నిమ్స్ హాస్పటల్లో చికిత్స కోసం 2 లక్షల రూపాయల ఎల్‌ఓసి చెక్కును అందజేసి, ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండల జడ్పిటిసి తోటకూరి అనురాధ, చోల్లేరు సర్పంచ్ తోటకూరి బీరయ్య, మాజీ ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్ గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ -యాదగిరిగుట్ట రూరల్



బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు తీసుకొచ్చి, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లిలో బుధవారం నూతనంగా నిర్మించనున్న పూసల సంఘం కమిటీ హాల్ భవనంకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. బీసీలకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం ద్వారా వారు ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చెర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి, యాదగిరిగుట్ట మున్సిపల్ వైస్ చైర్మెన్ కాటంరాజు, సతీష్, నవీన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరం

నవతెలంగాణ -ఆలేరుటౌన్



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు ఒక వరం లాంటిదని ఆలేరు పురపాలక సంఘం చైర్మెన్ శంకరయ్య అన్నారు.ఆలేరు మున్సిపల్ పరిధిలోని 12వార్డులలో బుధవారం కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్ గౌడ్,ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోరెడ్డి శ్రీనివాస్,స్థానిక కౌన్సిలర్లుబేతి రాములు,దాసి నాగలక్ష్మి సంతోష్,మోర్తల సునీత రమణారెడ్డి,కందుల శ్రీకాంత్,ఆలేరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ వెంకటేష్, కుండే సంపత్, పట్టణ ప్రధాన కార్యదర్శి శరబ్ సంతోష్, దయ్యాల సంపత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూతాటి అంజన, పూల శ్రవణ్, మహమూద్, భరత్, ఎస్సీ సెల్ అధ్యక్షులు దుర్గేష్, బీజని మధు కుమార్, కోనాపురం నాగరాజు, సీసా సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చందనలో రాఖీపౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని చందన స్కూల్‌లో బుధవారం విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని స్వీట్లు పంపిణీచేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ అవ్వారి రామేశ్వరి మాట్లాడారు. సోదరి సర్వతోముఖ వికాసానికి సోదరుడి బాధ్యత గుర్తు చేసేదే రక్షా బంధన్ అన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధం ఎంతో తియ్యనైంది, గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, నర్మద, పద్మ, రేణుక, గీత, జగదీశ్వరి, స్రవంతి, కవిత పాల్గొన్నారు.

ప్రగతి హై స్కూల్ లో రక్షాబంధన్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామం ప్రగతి హై స్కూల్ ఆవరణలో స్కూల్ విద్యార్థులు ముందస్తుగా ఒకరినొకరు రాఖీ కట్టుకోవడం జరిగింది.రక్షాబంధన్ విశిష్టతను పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ సయ్యద్ వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ లో రక్షాబంధన్ వేడుకలు

నవతెలంగాణ- వలిగొండ

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా స్థానిక ఎస్సై పెండ్యాల ప్రభాకర్ కి పోలీస్ సిబ్బందికి ఎస్ఎఫ్ఐ మండల నాయకురాలు కావ్య రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ దేశంలో ఆడపిల్లలపై జరుగుతున్న దాడులు అరికట్టాలన్నారు మీ ద్వారా ఆడపిల్లలకు రక్షణకు మరింత ముందుండాలన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు,జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు,మండల ఉపాధ్యక్షులు వేముల జ్యోతిబాస్ లక్ష్మణ్,శివమణి విష్ణు,తదితరులు పాల్గొన్నారు .

ఉపసర్పంచ్‌పై అవిశ్వాసం తీర్మానం

నవతెలంగాణ- సంస్థాన్ నారాయణపురం



నారాయణపురం గ్రామ ఉపసర్పంచ్ ఉప్పరగొని సంజీవను ఉప సర్పంచ్ పదవి నుండి తొలగించాలని కోరుతూ 9 మంది వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం చేశారు. బుధవారం నారాయణపురం గ్రామం పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ సికిలమెట్ల శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వార్డు సభ్యులు 9 మంది వార్డు సభ్యులు ఉప సర్పంచ్ సంజీవను ఆ పదవి నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిసింది. ఉప సర్పంచ్ సంజీవ గత మూడు పర్యాయాలు గ్రామపంచాయతీ నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి హాజరు కాకపోవడమే కాకుండా జాయింట్ చెక్ పవర్ కలిగినా ఆయన సరైన సమయానికి చెక్కుల పైన సంతకాలు పెట్టడం లేదని ఆరోపిస్తూ ఆయన ను ఆ పదవి నుంచి తొలగించాలని అవిశ్వాస తీర్మానం చేసినట్లు తెలిసింది.ఉప సర్పంచ్ సంజీవ గతంలోనూ సస్పెండ్ అయ్యారు. సరైన సమయంలో చెక్కుల పైన సంతకాలు పెట్టకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లించడంలోను, అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని సర్పంచ్ శ్రీహరి, కొంతమంది వార్డు సభ్యులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన అధికారులు ఆయన్ను కొంతకాలం సస్పెండ్ చేశారు.ఉప సర్పంచ్ తన ప్రవర్తనను మార్చుకోకుండా మళ్లీ అదే పద్ధతిని కొనసాగిస్తుండడంతో వార్డు సభ్యులు ఆయన్ను తొలగించి కొత్త వ్యక్తిని నియమించాలని కోరుతూ అవిశ్వాస తీర్మానం చేశారు.ఈ తీర్మానం కాపీని జిల్లా కలెక్టర్,డిపిఒ,డిఎల్పీఒ కు అందజేయనున్నట్లు తెలిసింది.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని మొగిలిపాకలో గ్రామానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు 20 లక్షలుగా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను బిఆర్ఎస్ జిల్లా నాయకులు ముద్దసాని కిరణ్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం అదే గ్రామానికి గ్రామానికి చెందిన మొగిలిపాక మల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన మృతదేహం పై పూలమాల వేసి నివాళులు అర్పించి, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో నరసింహ,బిక్షపతి, జక్కుల శంకరయ్య, మొగిలిపాక రమేష్,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మద్దెలమ్మ దేవాలయంలో హోమం

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని మణికంఠనగర్‌లోని శ్రీశ్రీశ్రీ మరుద్వతి మద్దెలమ్మ దేవాలయంలో బుధవారం బోనాల ఉత్సవం సందర్భంగా దేవాలయకమిటీ ఆధ్వర్యంలో హెూమం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు గోశిక స్వామి, ఉపాధ్యక్షులు గుర్రం నర్సింహా, కార్యదర్శి గోశిక రవీందర్, సహాయకార్యదర్శి గంజి రామచంద్రం, కోశాధికారి జెల్ల నర్సింహా, గోశిక కరుణాకర్, వనం రాజు, బాల్యం చంద్రయ్య, నల్ల రమేశ్, జయశ్రీ, కోడి వనిత పాల్గొన్నారు.

రక్షణ లేని పాఠశాలలు..పారిపోతున్న పిల్లలు

- ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొడారి వెంకటేష్

నవతెలంగాణ-భువనగిరిరూరల్

యాదాద్రి భువనగిరి జిల్లాలోని గురుకులాలు, కస్తూరిబా పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు , పాఠశాలల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పిల్లలు పారిపోతున్న సంఘటన చోటుచేసుకోవడం విచారకరమని ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడారి వెంకటేష్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల18న జిల్లా కేంద్రం లోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి, పాఠశాల నుండి పారిపోయిన సంఘటన మరవకముందే ఆగస్టు 27 న బీబీనగర్ మండల కేంద్రంలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నుండి మరో విద్యార్థిని పారిపోయిన సంఘటన జరగడం, ఈ నెల30 న భువనగిరి జిల్లా కేంద్రంలోని బీచ్ మహల్లా ప్రాథమిక పాఠశాల నుండి మరో విద్యార్థిని పాఠశాల నుండి పారిపోయిన సంఘటనలు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి చొరవ తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'30పడకలను 15పడకలుగా ఎలా తగ్గిస్తారు'

నవతెలంగాణ -ఆలేరుటౌన్

ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో 30పడకల స్థాయి నుండి 15 పడకల స్థాయి వరకు తగ్గించి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని జనరల్ బాడీ మీటింగ్ లో, వైద్య ఆరోగ్యశాఖ తీరుపై , కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, మాజీ శాసనసభ్యులు, డాక్టర్ కుడుదుల నగేష్, తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆస్పత్రిలో వైద్యులు సకాలంలో హాజరు కావడం లేదని తన పరిశీలన తేలిందని ఆరోపించారు. గతంలో పారదర్శకంగా పనిచేస్తున్న వైద్యుల పై, ఆస్పత్రి లక్ష్యంగా వ్యాపారం చేస్తున్న కొందరు ఆరోపణలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి , కలెక్టర్ వినయ కృష్ణారెడ్డి ముందు నిలదీశారు. పరిస్థితులను చకదిద్ది ప్రజలకు ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ- రాజాపేట

రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్ రెడ్డి బుధవారం రాజాపేట లో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి ఏజెంట్ శిక్షణ కమిటీ సమావేశంలో పేర్కొన్నారు. కార్యకర్తలు క్రమశిక్షణతో సైనికుల్లాగా పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బూత్ సాయి ఏజెంట్లను నియమించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ ధనావత్ శంకర్ నాయక్ ,మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ గౌడ్ , మంచాల వీరేశం, బుడిగే పెంటయ్య, బసవరాజు గౌడ్, సత్యనారాయణ , రాంజీ నాయక్, బాల మల్లేశం, నర్సింలు, చల్లూర్ చిన్న పోచయ్య ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంజ నరేష్ ,కటకం గణేష్ ,కటకం శివ ,మహేష్ అన్ని గ్రామ శాఖల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజుల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా ఫోన్‌లతో గడిపే సమయం ఎక్కువైపోయింది. సోషల్ మీడియా వినియోగమూ పెరిగిపోయింది. గంటల కొద్ది ఫోన్లు, కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు, టాబ్లెట్స్ చూస్తూనే ఉంటున్నాం. సమాచారం పంచుకోవడానికి, విషయాలపై అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడే సోషల్ మీడియా ఒక వ్యసనమైపోయింది. ఇలా ఎక్కువ సమయం గడపడం వల్ల మానసిక సమస్యలకు దారి తీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి సోషల్ మీడియా డీటాక్స్ ఒక్కటే మార్గం అని సూచిస్తున్నారు. మరి సోషల్ మీడియా డీటాక్స్ అంటే ఏంటి? దీని నుంచి బయటపడటం ఎలాగో.. నిపుణులు ఏం చెప్తున్నారో తెలుసుకుందాం..

కంట్రోల్ చేసుకుంటేనే...



సోషల్ మీడియా డీటాక్స్ అంటే..

సోషల్ మీడియా డీటాక్స్ అంటే కొంత సమయం వరకూ సోషల్ మీడియాని వాడకపోవడం. ఈ కొంత సమయం అన్నది వారం నుండి, ఆరు నెలల వరకూ ఎంత కాలమైనా కావచ్చు. ఈ ప్రాసెస్‌లో మీరు కొన్ని ఎకౌంట్లని డిలీట్ చేయడం, కొన్ని ఎకౌంట్లని టెంపరరీగా డిసేబుల్ చేయడం వంటివి చేయాల్సి రావచ్చు.

మీ గురించి ఆలోచించండి

ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలుసుకునే హడావిడిలో మన గురించి మనం మర్చిపోతున్నాం. ఇంకొకరి లైఫ్‌లో జరిగే విషయాల పట్ల ఉన్న కుతూహలంలో సగం కూడా మన లైఫ్ గురించి ఉండడం లేదు. ఒక్కసారి ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. ఎవరితో ఎక్కువ కనెక్ట్ అవ్వగలుగుతామని? రియల్ లైఫ్‌లో కంటికి ఎదురుగా కనిపించే మనిషితోనా, ఆన్‌లైన్‌లో కనిపించే మనిషితోనా? ఈ రెండు ప్రశ్నకి సమాధానం మొదటిదైతే కొన్ని మార్పులు చేసుకోవాలి. ఇందుకు మొదట ఎంచుకోవాల్సిన మార్గం సోషల్ మీడియా డీటాక్సింగ్. ఇది తేలికైన విషయం కాదు. ఒక అలవాటు టాక్సిక్ లెవెల్‌కి చేరుకుంటేనే డీటాక్స్ చేసుకోవాల్సిన అవసరం వస్తుంది. కొంచెం ఓపికతో, సహనంతో ఈ పని చేస్తే ఎంత ఫ్రీడమ్ వస్తుందో చేసి చూస్తే అర్థమవుతుంది.

పోల్చుకోవద్దు

సోషల్ మీడియాలో ఇతరుల జీవితాన్ని చూసి మన జీవితం కూడా అలా లేదని ఫీలవుతూ ఉంటారు కొందరు. కానీ, ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. అది వారు చూపిస్తున్న జీవితం. అది నిజమే అని కూడా అనుకున్నా, వారి జీవితంతో మన జీవితాన్ని కంపేర్ చేసుకుంటే మన మీద మనకి నమ్మకం, గౌరవం తగ్గిపోతాయి. అందుకే, సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకుని మన లైఫ్ మీద ఫోకస్ పెట్టుకోవాలి.

అవసరమైన యాప్స్ మాత్రమే

అన్ని స్మార్ట్ ఫోన్‌లలోనూ ఏయే యాప్స్ ఎక్కువ సేపు వాడుతున్నాం, టోటల్ స్క్రీన్ టైం ఎంత అనే వివరాలు ఉంటాయి. దాన్ని బేస్ చేసుకుని ఎక్కువ సమయం కేటాయిస్తున్న యాప్స్‌ని అన్ ఇన్‌స్టాల్ చేసేయండి. దీనివల్ల చాలా ఖాళీ సమయం దొరకడమే కాదు, చాలా విషయాల్లో క్లారిటీ కూడా వస్తుంది.



గ్రేస్కేల్ యూజ్..

ఫోన్‌లో ఈ సెట్టింగ్ చేసుకోడానికి కొన్ని సెకన్ల కంటే ఎక్కువ సేపు పట్టదు. దీని వల్ల యాప్స్ కలర్‌ఫుల్‌గా మెరుస్తూ కనబడుతూ మిమ్మల్ని ఎట్రాక్ట్ చేయవు. దానితో ఆటోమాటిక్‌గా ఫోన్ ఎడిక్షన్ కూడా తగ్గిపోతుంది. కలర్స్ కనపడని ఫోన్ మీద ఇంటరెస్ట్ తగ్గిపోవచ్చు. ప్రయత్నిస్తే బాగుంటుందేమో..



తియ్యని వేడుక..

అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు చిహ్నం రాఖీ. శ్రావణ పూర్ణిమ రోజు నిర్వహించుకునే ఈ రాఖీని ఆత్మీయతతో పాటు తియ్యగా మార్చుకుంటే ఇంకా ఆనందంగా ఉంటుంది కదా! అందుకే ఈ వారం రాఖీ స్పెషల్‌గా కొన్ని స్వీట్స్...

కొబ్బరి కోవా లడ్లు



కావాల్సిన పదార్థాలు : ఎండుకొబ్బరి కోరు - పావు కేజీ, కోవా - నూటయాభై గ్రా., చక్కెర - నూటయాభై గ్రా., బాదం, జీడిపప్పు పొడి - చెంచా,

తయారు చేసే విధానం : అరకప్పు నీటిలో పంచదార కలిపి స్టవ్ మీద పెట్టి కరిగించాలి. మరో పాత్రలో కోవా తీసుకుని దోరగా వేయించి కొబ్బరికోరును కలపాలి. తర్వాత చక్కెర పాకం చేర్చి.. స్టవ్ మీదనే ఉంచి కలుపుతూ ఉండాలి. మిశ్రమం బాగా దగ్గరగా అయ్యాక బాదం, జీడిపప్పు పొడి కలిపి దింపేస్తే సరిపోతుంది. కాస్త వేడి తగ్గాక ఉండల్లా చేసుకోవాలి.

వేరుశెనగ బర్ఫీ



కావాల్సిన పదార్థాలు : వేరుసెనగపప్పు - అరకేజీ, యాలకులపొడి - కొద్దిగా చక్కెర - అరకేజీ, జీడిపప్పు పలుకులు - పావుకేజీ కన్నా కొద్దిగా తక్కువ, నెయ్యి- కొద్దిగా..

తయారు చేసే విధానం : వేరుసెనగపప్పును నూనె లేకుండా వేయించి, పొట్టు పూర్తిగా తీసేయాలి. వీటిని మరీ మెత్తగా కాకుండా కాస్త బరకగానే పొడి చేసుకోవాలి. తర్వాత జీడిపప్పును కూడా బరకగా పొడి చేసుకోవాలి. కడాయిలో కొన్ని నీళ్ళు తీసుకుని చక్కెర చేర్చి పాకం పట్టాలి. పాకం కొద్దిగా ముదురు అవుతున్నప్పుడు ముందుగా సిద్ధం చేసుకున్న వేరుశెనగ, జీడిపప్పు పొడి, యాలకుల పొడి ఒక దాని తర్వాత ఒకటి వేసి బాగా కలపాలి. మిశ్రమం దగ్గరగా అయ్యాక నెయ్యి రాసిన పళ్లెంలోకి మార్చుకుని బిళ్లల్లా కట్ చేసుకోవాలి. పైన జీడిపప్పు పలుకులు అద్దితే సరి.

కోవా గులాబ్‌జామ్



కావాల్సిన పదార్థాలు : చక్కెర వేయని కోవా - కప్పు, పనీర్ తురుము - కప్పు, మైదా - చెంచా, చక్కెర - ఒకటిన్నర కప్పు, నెయ్యి - వేయించడానికి సరిపడా, యాలకుల పొడి - చెంచా.

తయారు చేసే విధానం : చక్కెరలో సరిపడా నీళ్ల చేర్చి లేత పాకం వచ్చేదాకా స్టవ్ మీద పెట్టి కరిగించుకోవాలి. తర్వాత యాలకుల పొడి చల్లి దింపేయాలి. మరో పాత్రలో కోవా, పనీర్ తురుము, మైదా తీసుకుని గట్టిగా ముద్దలా కలుపుకోవాలి. చేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండల్లా చేసుకుని సన్నని మంటపై ఉంచి నెయ్యి కరిగించి అందులో వేయించాలి. ఇవి తేలిగ్గా విచ్చుకుంటాయి కాబట్టి నెమ్మదిగా తిరగేయాల్సి ఉంటుంది. బంగారు వర్ణంలోకి వచ్చాక తీసి చక్కెర పాకంలో వేయాలి. చల్లారక తింటే బాగుంటాయి.

గోధుమరవ్వ పాయసం

కావాల్సిన పదార్థాలు : సన్నని గోధుమరవ్వ - ముప్పావు కప్పు, నీళు - మూడు కప్పులు, చిక్కని కొబ్బరిపాలు - కప్పు, చిక్కని పాలు - కప్పు, బెల్లం - కప్పు, నెయ్యి - రెండు చెంచాలు, జీడిపప్పు, ఎండుద్రాక్ష - పావు కప్పు కన్నా కొద్దిగా తక్కువ, యాలకుల పొడి - అర చెంచా.




తయారు చేసే విధానం : స్టవ్ మీద కడాయి పెట్టి చెంచా నెయ్యి వేసి గోధుమ రవ్వను వేయించుకోవాలి. ఈ రవ్వను పక్కకు పెట్టుకుని అదే కడాయిలో నీళ్ల చేర్చి మరుగుతున్నప్పుడు రవ్వ వేసి సన్న మంట మీద ఉడికించుకోవాల. ఈ మిశ్రమాన్ని పక్కకు పెట్టుకోవాలి. మరో కడాయిలో చెంచా నెయ్యి వేసి ఎండుద్రాక్ష, జీడిపప్పు పలుకులను వేయించి విడిగా తీసుకోవాలి. అందులోనే పాలు మరిగించి ఉడికిన రవ్వ చేర్చాలి. కాస్త దగ్గరగా అయ్యాక బెల్లం తురుము కూడా వేసి.. పూర్తిగా కలిశాక దింపేముందు కొబ్బరిపాలు, యాలకులపొడి, వేయించి పెట్టుకున్న జీడిపప్పు, ఎండుద్రాక్ష పలుకులు, మిగిలిన నెయ్యి ఒకదాని తర్వాత మరొకటి వేస్తే సరిపోతుంది. అంతే గోధుమరవ్వ పాయసం సిద్ధం.

తీపి సమోసాలు

కావాల్సిన పదార్థాలు : గోధుమపిండి - రెండుకప్పులు, నెయ్యి - రెండు చెంచాలు, పాలు - సరిపడా, ఆకుపచ్చ ఫుడ్ కలర్ - కొద్దిగా, నూనె - వేయించడానికి సరిపడా.

ఫిల్లింగ్ కోసం : కొబ్బరి తురుము - కప్పు, జీడిపప్పు - పావుకప్పు, పల్లీలు, కిస్మిస్ - కలిపి అరకప్పు, చక్కెర - ఒకటిన్నర కప్పు, యాలకుల పొడి - చెంచా, నెయ్యి - మూడు చెంచాలు.



తయారు చేసే విధానం : కడాయిలో నెయ్యి కరిగించి జీడిపప్పు, పల్లీలూ, కిస్మిస్ వేయించుకోవాలి. తర్వాత కొబ్బరి తురుము కూడా వేయించుకోవాలి. అందులో చక్కెర వేసి కలుపుతూ ఉంటే కాసేపటికి కరుగుతుంది. దింపే ముందు యాలకులపొడి వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. ఓ గిన్నెలో గోధుమపిండి తీసుకుని ఫుడ్‌కలర్ వేసుకుని పాలూ, నీళ్ల పోసుకుంటూ పూరీ పిండిలా కలపాలి. ఇప్పుడు నెయ్యి వేసుకుని మరోసారి కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇది నానాక కొద్దిగా తీసుకుని అర్ధచంద్రాకారంలో వత్తుకోవాలి. దాన్ని కోన్‌లా మడిచి మధ్యలో ముందుగా చేసిపెట్టుకున్న మిశ్రమాన్ని ఉంచి అంచుల్ని మూసేయాలి. ఇలా మిగిలిన పిండిని చేసుకుని నూనెలో వేసి ఎర్రగా వేగే వరకూ వేయించుకుంటే, వేడివేడి తీపి సమోసాలు సిద్ధం.

నువ్వుల బర్ఫీ

కావాల్సిన పదార్థాలు : నువ్వులు - కప్పు, చక్కెర - కప్పు, యాలకులు - పది, డ్రైఫ్రూట్స్ - పావు కప్పు

తయారు చేసే విధానం : కడాయి వేడిచేసి నూనె లేకుండా నువ్వుల్ని సన్న మంట మీద వేయించుకోవాలి. వాటి వేడి తగ్గాక మెత్తగా పొడి చేసుకోవాలి. మరో గిన్నె స్టవ్ మీద పెట్టి చక్కెర, కొన్ని నీళ్ల పోసి గట్టి పాకం పట్టుకోవాలి. అందులో నువ్వుల పొడి, యాలకుల పొడి వేసుకోవాలి. బర్ఫీ మిశ్రమం దగ్గర పడుతు న్నప్పుడు స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసుకుని పైన డ్రై ఫ్రూట్స్ వేసేయాలి. వేడి తగ్గాక ముక్కల్లా కట్ చేసుకుంటే సరి.



ఉపాధి నిధులు చాలట్లేదు

(మొదటిపేజి తరువాయి)

పొందుపరిచిన బేషరతు హక్కులను ఆంక్షలతో కూడినవిగా మారుస్తున్నాయన్నారు. వేతనాల చెల్లింపులకు ఆధార్‌ను ప్రవేశపెట్టడం వల్ల వేతన చెల్లింపుల్లో పెద్దగా మార్పేమీ రాలేదన్నారు. దీనిపై ఒక సంస్థ ఇటీవల జరిపిన సర్వేలో వెల్లడైన అంశాలు చూస్తే.. మొత్తంగా 26 కోట్ల మంది ఉపాధిదారుల్లో 41.1శాతం మంది ఈ తరహా చెల్లింపులకు ఇంకా అర్హులు కారని తేలింది. పెద్ద సంఖ్యలో ఉపాధి కార్మికులు వుండే ఐదు రాష్ట్రాల్లో 1.2కోట్ల మంది కార్మికులకు ఏబీపీఎస్ ఖాతాలు లేకపోవడంతో వారు చెల్లింపులకు అర్హులు కారని ఆ సర్వే నివేదిక పేర్కొంది. హిందూ పత్రిక ఈ నివేదికను బుధవారం ప్రచురించింది. చెల్లింపులకు పట్టే సమయం లేదా తిరస్కరణ శాతాలకు సంబంధించి చూసినట్లైతే ఎబిపిఎస్‌కు, సాధారణ ఖాతా లావాదేవీలకు గణాంకాల పరంగా చాలా కొద్ది తేడా వుందని ప్రభుత్వ డేటాను విశ్లేషిస్తే తెలుస్తోందని సర్వే పేర్కొంది. దీనివల్ల కార్మికులకు పెద్దగా లాభం లేకపోయినా నష్టాలు మాత్రం ఎక్కువగానే వున్నాయని ఆ లేఖ పేర్కొంది.

గత ఆరు మాసాలుగా తాను ఉపాధి హామీ పథకం కింద పని జరిగే ప్రదేశాల్లో పర్యటించానని, రాష్ట్రాల వారీగా కార్మికులతో మాట్లాడానని ఆమె చెప్పారు. పని జరిగే చోట నిర్దిష్ట సమయాల్లో ఆన్‌లైన్‌లో హాజరును నమోదు చేసుకోవడమన్నది ప్రధాన సమస్యగా వుందని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. గ్రామీణ భారతంలో చాలా ప్రాంతాల్లో, ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ కనెక్టివిటీలో చాలా ఇబ్బందులు వుంటాయి. తప్పనిసరి ఆన్‌లైన్ నమోదు కావడంతో కార్మికులకు చాలా ఇబ్బందులు వస్తున్నాయని బృందాకరత్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో హాజరు నమోదు కోసం పనికి ముందు, అయిపోయిన తర్వాత అదనపు సమయం వుండాల్సి వస్తోందని, దీనివల్ల మహిళలు ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నారని ఆమె చెప్పారు. హాజరు నమోదు కాకపోతే వేతనాలు తిరస్కరిస్తున్న సందర్భాలు వున్నాయన్నారు.

షెడ్యూల్ రేట్లు, పీస్ రేట్లు చాలా ఇబ్బందికరంగా మారాయని మహిళా కార్మికులతో మాట్లాడినప్పుడు చెప్పారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో, పని ప్రదేశాల్లో మహిళల పని నిబంధనలకు సంబంధించినంత వరకు చాలా తక్కువ రేట్లకే మహిళల శ్రమ దోపిడీ జరుగుతోందని స్పష్టమవుతోంది. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం అమలు జరిగే పని ప్రదేశాల్లో ఇటీవలి కాలంలో జరిగిన సర్వేలను ఏ మంత్రిత్వ శాఖ ఉపయోగించుకోవడం లేదు. గతంలో అనేక రాష్ట్రాల్లో ఇటువంటి సర్వేల తర్వాత మహిళల పని నిబంధనలను నిర్ణయించేవారు. దీనిపై అత్యవసరంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని ఆ లేఖలో ఆమె తెలిపారు. ఈ లేఖలో తాను లేవదీసిన అంశాలన్నింటిపై తగు చర్యలు తీసుకోగలరని ఆశిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

మెగా డీఎస్సీ కాదు...దగా డీఎస్సీ

(మొదటిపేజి తరువాయి)

వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఎద్దేవా చేశారు. ఒక గజదొంగ దారి దోపిడీ ద్వారా సర్వం దోచుకున్న తర్వాత దారి ఖర్చుల కోసం రూ.200 ఉంచుకోమని ఇచ్చినట్టుగా ఉందని కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో గ్యాస్ బండ ధర రూ.410 ఉంటే, దానిని మోడీ అధికారంలోకి వచ్చాక రూ.1200 చేశారని విమర్శించారు. ఇన్నాళ్ల పేద మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన బీజేపీ పాలకులు... ఇప్పుడు గ్యాస్ ధర తగ్గించడాన్ని ఇలా కాకుండా మరెలా అర్థం చేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రేవంత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నేడు, రేపు 'ఇండియా' కూటమి భేటీ

న్యూఢిల్లీ : ప్రతిపక్ష కూటమి ఇండియా మూడో సమావేశం ముంబయిలో నేడు, రేపు (గురువారం, శుక్రవారం) జరగనున్నది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలనే లక్ష్యంతో 26 ప్రతిపక్ష పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పాటైన సంగతి తెలిసిందే. ముంబయిలో జరిగే ఈ సమావేశాల్లో కూటమి లోగో, సమన్వయ కమిటీ నియామకం వంటి అంశాలపై చర్చ జరగనున్నట్టు తెలుస్తున్నది.

ఇండియా కూటమి భేటీతోనే గ్యాస్ ధరలు తగ్గాయి : ఆప్

తాజాగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ మాట్లాడుతూ ఇండియా కూటమి పాట్నా, బెంగళూరు సమావేశాల తరువాతే ఈ ధరలు తగ్గాయని, మూడో సమావేశం తరువాత పెట్రోలు, డీజిల్ ధరలు కూడా తగ్గుతాయన్నారు.

మెదక్‌లో సీటు దక్కేదెవరికి..?

(మొదటిపేజి తరువాయి)

చేశారు. అయితే ఆయనకు తొలి జాబితాలో చోటు తప్పక ఉంటుందని ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు. అందోల్ నియోజకవర్గం నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎఐసీసీ పరిశీలకులుగా నియమించబడిన దామోదర రాజనర్సింహ పేరు కూడా ఉండే అవకాశముంది. వీరిద్దరితో జహీరాబాద్ ఎస్సీ రిజర్వుడ్ స్థానం నుంచి డాక్టర్ చంద్రశేఖర్‌కు ఛాన్స్ ఇస్తారంటున్నారు. ఆయన బీజేపీని వీడి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. అక్కడి నుంచి అనేక సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేసిన గీతారెడ్డి ఆరోగ్య సమస్యల వల్ల పోటీ చేసేందుకు ఇష్టపడటం లేదు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న నరోత్తం కూడా ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిపోయారు. దాంతో చంద్రశేఖర్‌కు జహీరాబాద్ టికెట్ ఖరారు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. మిగతా నియోజకవర్గాల్లో మాత్రం వడపోత తర్వాతనే అభ్యర్థుల్ని ప్రకటించే ఛాన్స్ ఉంది.

ఇతర పార్టీలపై ఫోకస్

ఉమ్మడి మెదక్ జిల్లాలో 2014 నుంచి బీఆర్ఎస్ పట్టుబిగించింది. అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్ గెలుస్తూ వస్తోంది. అయితే ఈ సారి ఎక్కువ స్థానాల్లో గెలిచేందుకు కాంగ్రెస్ అధిష్టానం పట్టుదలతో పావులు కదుపుతున్నది. జగ్గారెడ్డి, దామోదర, చంద్రశేఖర్‌తో పాటు మరో ఐదారు చోట్ల గెలిచి తీరుతామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అందుకే బీఆర్ఎస్, బీజేపీలో ఉన్న అసమ్మతి నేతల్లో ముఖ్యులపై గాంధీభవన్ దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్‌లో తన కొడుక్కు టికెట్ రాలేదన్న నెపంతో మైనంపల్లి హనుమంతరావు తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పార్టీ నుంచి దూరం కాకపోయినా మంత్రి హరీశ్‌రావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన హనుమంతరావు వారం రోజుల తర్వాత తన వైఖరి ప్రకటిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో మెదక్ నుంచి కాంగ్రెస్ తరపున మైనంపల్లి రోహిత్‌కు టికెట్ ఇస్తారనే చర్చ నడుస్తోంది. రోహిత్‌కు టికెట్ ఇస్తే బీఆర్ఎస్ నుంచి భారీ స్థాయిలో వలసలు ఉండే అవకాశముంది. గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క దుబ్బాక నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్న రఘునందన్‌రావుపై కూడా కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఫోకస్ పెట్టినట్టు చెబుతున్నారు. ఆయన కాంగ్రెస్‌లోకి వస్తే పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి అవకాశం ఇస్తారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో పక్క నర్సాపూర్ టికెట్ విషయంలో బీఆర్ఎస్ మల్లగుల్లాలు పడుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వకపోతే ఆయన్ను కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలన్నది కాంగ్రెస్ పెద్దల ఆలోచన. ఒక వేళ మదన్‌రెడ్డికే బీఆర్ఎస్ టికెట్ వస్తే అప్పుడు సునీతా లక్ష్మారెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వొచ్చనే ప్రచారముంది.

టికెట్ టెన్షన్‌లో ఆశావాహులు

ఎప్పటి నుంచో పార్టీ కోసం పనిచేస్తూ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉంటున్న కాంగ్రెస్ ఆశావహుల్లో టికెట్ వస్తుందా..? రాదా..? అనే టెన్షన్ కనిపిస్తోంది. పటాన్‌చెరు నుంచి టికెట్ ఆశిస్తున్న కాట శ్రీనివాస్ గౌడ్‌తో పాటు గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన గాలి అనిల్‌కుమార్ కూడా పోటీలో ఉన్నారు. వీరిద్దరిలో ఎవరికి టికెట్ వస్తుందో అంతుచిక్కని పరిస్థితుల్లో మధ్యలో మూడో వ్యక్తిగా బీజేపీ ఎమ్మెల్యే పేరు పరిశీలిస్తుండటంతో ఆశావహుల్లో టెన్షన్ తీవ్రమైంది.

మెదక్ నుంచి మైనంపల్లి రోహిత్‌కు టికెట్ ఇస్తే ఇన్నాళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన మా సంగతేంటని మ్యాడం బాలకృష్ణ, శశిధర్‌రెడ్డి ప్రశ్నించే అవకాశముంది. నర్సాపూర్ టికెట్ కోసం గాలి అనిల్‌కుమార్ ఆశపడుతున్నారు. అక్కడ కూడా ఇతర పార్టీల నాయకులకు ఛాన్స్ ఇస్తే అనిల్‌కుమార్ తిరుగుబాటు చేసే అవకాశమూ లేకపోలేదు. నారాయణఖేడ్ నుంచి సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సురేష్‌షెట్కర్ ఇద్దరూ తీవ్రంగా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. రెండు గ్రూపుల్లో ఎవరికిచ్చినా మరో గ్రూపు సహకరించకపోవచ్చని చెబుతున్నారు. గజ్వేల్ నుంచి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సిద్దిపేట నుంచి సూర్యవర్మతో పాటు అర డజన్ మంది టికెట్ కోసం దరఖాస్తు చేశారు. దుబ్బాక నుంచి కత్తి కార్తిక గౌడ్ సేవా కార్యక్రమాలతో పాటు పార్టీ పరంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. ఆమె ఖచ్చితంగా తనకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. అదే నియోజకవర్గం నుంచి చెరుకు శ్రీనివాసరెడ్డి కూడా టికెట్ రేసులో ఉన్నారు. వీరితో పాటు మరో ఒకరిద్దరు టికెట్ ఆశిస్తున్నారు.

ప్రజలపై నిఘా..

(మొదటిపేజి తరువాయి)



దేశంలోని వేహియర్, ఇజ్రాయిల్‌కు చెందిన అనామక కాగ్నైట్, సెప్టియర్ వంటి కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. అయితే వీటిలో కొన్ని కంపెనీల చరిత్రను పరిశీలిస్తే అనేక అనుమానాలు, ఆందోళనలు కలగడం సహజమే. సెప్టియర్ అనే కంపెనీని 2021లో అట్లాంటిక్ కౌన్సిల్ 'బాధ్యతారాహిత్య సంస్థ'గా అభివర్ణించింది.

ఈ కంపెనీలన్నీ అలాంటివే

ఉగాండా, రువాండా దేశాలలో కూడా మన దేశంలో మాదిరిగానే నిఘా సమాచారాన్ని సేకరించే అధికారాన్ని ప్రభుత్వాలకు కట్టబెట్టే చట్టాలు ఉన్నాయి. ఇజ్రాయిల్‌కు చెందిన సెప్టియర్ కంపెనీనే తీసుకుందాం. దీనిని 2000వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. చట్టబద్ధమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ కంపెనీ ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియోకు, వొడాఫోన్ ఐడియాకు, సింగపూర్‌కు చెందిన సింగ్‌టెల్‌కు విక్రయించింది. ఇజ్రాయిల్ కంపెనీ కాగ్నైట్ కూడా మన దేశంలో నిఘా సమాచారాన్ని అందజేస్తోంది. భారత్, అమెరికా దేశాలలో ప్రధాన కార్యాలయాలు ఉన్న వేహియర్ కంపెనీ కూడా ఇలాంటిదే. అయితే ఇటు మోడీ ప్రభుత్వం కానీ, అటు ఆయా కంపెనీలు కానీ దీనిపై పెదవి విప్పడం లేదు.

వెల్లువెత్తుతున్న ఆరోపణలు

కాగ్నైట్ సహా పలు కంపెనీల సేవలను వివిధ దేశాలలోని పాత్రికేయులు, రాజకీయ నాయకుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేందుకు ఉపయోగించుకుంటున్నారని 2021లో మెటా ఆరోపించింది. అయితే ఈ దేశాల జాబితాలో భారత్ లేదు. జలాంతర్గాముల కేబుల్ ప్రాజెక్టులలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ విలేకరి ఏం చెప్పారంటే...సముద్ర గర్భంలోని కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు, డాటా సెంటర్లలో నిఘా పరికరాలు అమర్చాలని భారత ప్రభుత్వం బాహాటంగానే టెలికం కంపెనీలను కోరింది.

ఇజ్రాయిల్ గ్రూప్ ఎన్ఎస్ఓకు చెందిన పెగాసస్ స్పైవేర్‌ను భారత ప్రభుత్వం ఉపయోగించిందన్న వార్తలు వచ్చిన తర్వాత ఇలాంటి 'నిఘా' ఆరోపణలు ఎక్కువయ్యాయి. తమను లక్ష్యంగా చేసుకొని మోడీ ప్రభుత్వం పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తోందని ప్రతిపక్ష నేతలు, పాత్రికేయులు, హక్కుల కార్యకర్తలు 2019, 2021 సంవత్సరాలలో ఆరోపించారు. పెగాసస్ స్పైవేర్ ఓ లింకు ద్వారా మొబైల్ ఫోన్లను హ్యాక్ చేస్తోందని, ఇ-మెయిల్స్, కాల్స్, టెక్స్ మెసేజ్‌లను రహస్యంగా రికార్డు చేస్తోందని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. పెగాసస్ స్పైవేర్ బండారాన్ని బయటపెట్టేందుకు 2021 జూలై 16న వైర్, ఫ్రాన్స్ మీడియా సంస్థ ఫర్‌బిడెన్ స్టోరీస్, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ చేతులు కలిపాయి.

దీనిపై ఎన్ఎస్ఓ సంస్థ స్పందిస్తూ భారత్ సహా పలు దేశాల ప్రభుత్వాలకు మాత్రమే దీనిని విక్రయించామని తెలిపింది.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందిన వ్యక్తిగత డేటా ప్రొటెక్షన్ బిల్లుపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ బిల్లు నిఘా సమాచారాన్ని పొందే విషయంలో ప్రభుత్వానికి రక్షణ కల్పిస్తుందే తప్ప ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడదని నిపుణులు అభిప్రాయపడ్డారు.

పాతబస్తీలో దారుణం

(మొదటిపేజి తరువాయి)

బాబా మదర్ ఖాన్ దగ్గరకు అత్తమామలు తీసుకెళ్లారు. దాంతో అతడు ఇంటికి వచ్చి చూసి ఆమెకు దెయ్యం పట్టిందని, తన ఇంటికి ఆమెను తీసుకురావాలని చెప్పాడు. అలా వెళ్ళిన యువతికి మంత్రం చేస్తానని మాయమాటలు చెప్పి ఆమె కళ్లకు గంతలు కట్టి గదిలో బంధించి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దాంతో కుటుంబ సభ్యులు భవాని నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని వారిని అక్కడికే పంపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ బాబా ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఎస్ఐ శాకీర్ అలీ దర్యాప్తు చేస్తున్నారు.

1న ఇంజనీరింగ్ స్పాట్ అడ్మిషన్ల నోటిఫికేషన్

అందుబాటులో 18,815 సీట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను కాలేజీలు వచ్చేనెల ఒకటిన విడుదల చేస్తాయని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల ఒకటిన కాలేజీల్లో ఇంటర్నల్ స్లైడింగ్ చేసుకోవచ్చని సూచించారు. అదేనెలా రెండున ఇంజినీరింగ్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించి పత్రికల్లో నోటిఫికేషన్‌ను ఇవ్వాలని తెలిపారు. వచ్చేనెల మూడు, నాలుగు తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాలేజీల వారీగా, బ్రాంచ్‌ల వారీగా వివరాలను https://tseamcet.nic.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో ఇంకా 18,815 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూడు విడతల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం కౌన్సెలింగ్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే.

మహిళలకు కర్నాటక సర్కారు రక్షాబంధన్ కానుక

బెంగళూరు: రక్షా బంధన్ సందర్భంగా కర్నాటక ప్రభుత్వం మహిళలకు భారీ కానుక అందించింది. కర్నాటకలోని అక్కాచెల్లెళ్లకు సిద్ధరామయ్య ప్రభుత్వం రక్షాబంధన్ కానుక ఇచ్చింది. కర్ణాటకలోని మైసూర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎంపీ రాహుల్‌గాంధీ గహ లక్ష్మి యోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా కోటి మందికి పైగా మహిళలకు నెలవారీ రూ.2000 భతిని అందజేస్తామని నేతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గహలక్ష్మి యోజన కార్యక్రమంలో ప్రసంగించారు. ఎన్నికల ముందు ఐదు వాగ్దానాలు చేశామని రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ ఏదైనా చెబితే అది చేసి చూపిస్తుందన్నారు. గహలక్ష్మి, శక్తి యోజన, గహజ్యోతి, అన్న భాగ్య యువ నిధి యోజనలను కాంగ్రెస్ ప్రారంభించిందన్నారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కర్ణాటకకు ఐదు వాగ్దానాలు చేసింది. కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నేతలు ఏదైనా చెబితే అది చేస్తారని మేం చెప్పాం. ఈరోజు మనం ట్యాబ్‌లో క్లిక్ చేయగానే కోట్లాది మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.2000 జమ అయింది." అని రాహుల్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇంకా మాట్లాడుతూ, 'ఎన్నికల తర్వాత కర్ణాటకలో మహిళలు బస్సుల్లో ప్రయాణించడానికి ఏమీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ పథకానికి 'శక్తి' అని పేరు పెట్టి దానిని పూర్తి చేశాం." అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఐదు పథకాలు చూడండి అని రాహుల్ అన్నారు. ఒక్కటి తప్ప మిగతావన్నీ మహిళల కోసం, మిగిలిన నాలుగు పథకాలు మహిళల కోసం రూపొందించబడ్డాయన్నారు. దీని వెనుక లోతైన ఆలోచన ఉందన్నారు. తాను భారత్ జోడో యాత్రలో వేలాది మంది మహిళలను కలిశానని రాహుల్ పేర్కొన్నారు. కర్ణాటకలో దాదాపు 600 కిలోమీటర్లు నడిచానన్న రాహుల్ గాంధీ.. తనకు ఓ విషయం స్పష్టంగా అర్థమైందన్నారు. ద్రవ్యోల్బణాన్ని భరించలేకపోతున్నామని వేలాది మంది మహిళలు తనతో చెప్పారని.. కర్ణాటక మహిళలే ఈ రాష్ట్రానికి పునాది అని తనకు అర్థమైందన్నారు. 1.1 కోట్ల మంది మహిళలకు నెలవారీ రూ.2,000 సహాయం అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం 'గహలక్ష్మి' పథకాన్ని ప్రారంభించింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ గహ లక్ష్మి యోజన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా మొత్తాన్ని బదిలీ చేశారు. అదే సమయంలో, ఈ పథకాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో ప్రారంభించారు.



జయహో..ప్రజ్ఞానంద...

చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం

చెన్నై: అజర్ బైజాన్‌లో జరిగిన ఫిడే ప్రపంచకప్ రన్నరప్‌గా నిలిచిన 18ఏళ్ల ప్రజ్ఞానందకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. తమిళనాడు ప్రభుత్వ అధికారులు, కళాకారులు, విద్యార్థులు, అభిమానులు పూలు చల్లుతూ, అభినందనలు తెలుపుతూ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన ప్రజ్ఞానందను చూసేందుకు అభిమానులు, మీడియా సభ్యులు అత్యధిక సంఖ్యలో విచ్చేశారు. అలాగే ప్రజ్ఞానందకు స్వీట్లు, బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజ్ఞానంద మాట్లాడుతూ.. తనను ఆహ్వానించడానికి ఇంతమంది రావడం చాలా సంతోషంగా ఉందని, ఇది నిజంగా నమ్మశక్యం కావడం లేదన్నాడు. క్రికెట్ స్టార్లకు మాత్రమే ఇంతటి గౌరవం దక్కుతుందని, తనకు ఆ విధమైన ప్రశంసలు, అభిమానులు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నాడు. తాను పాల్గొనే ప్రతి టోర్నమెంట్‌కు తన తల్లి నాగలక్ష్మి హాజరయ్యేదని, ఎక్కడ బసచేసినా భోజనాన్ని తయారుచేసే బాధ్యతను ఆమె తీసుకొనేదని అన్నాడు. జర్మనీలోని డ్యూసెల్‌డార్ఫ్‌లో జరిగిన ఫిడే ప్రపంచ ర్యాపిడ్ టీమ్ ఛాంపియన్‌కు, అజర్‌బైజాన్‌లోని బాకు వేదికగా జరిగిన ప్రపంచకప్ చెస్ ఛాంపియన్‌షిప్‌లకు ఆమె చేతి వంట సాంబారు అన్నం మాత్రమే తిన్నానని అన్నాడు.

ర్యాంకింగ్స్‌లోనూ పైపైకి..

ప్రపంచకప్ చెస్ రన్నరప్‌గా నిలిచిన ప్రజ్ఞానంద కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్స్ సాధించాడు. రన్నరప్‌గా నిలవడంతో 2727.2 పాయింట్లు సొంతం చేసుకున్నాడు. అంతేకాదు లైవ్ రేటింగ్స్‌లో టాప్ 20 ర్యాంక్‌లో నిలిచాడు. టైటిల్ నెగ్గిన కార్ల్‌సన్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ప్రజ్ఞానంద భారత సీనియర్ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్, చదరంగం లెజెండ్ గ్యారీ కాస్పరోవ్‌ల నుండి ప్రశంసలు పొందాడు. ట్విటర్



వేదికగా కాస్పరోవ్ 'కష్టమైన ఎత్తులతో ప్రత్యర్థి ముందు దృఢంగా ఉంటాడు' అని పేర్కొన్నాడు.

తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రశంసలు..

రూ.30 లక్షల చెక్కు అందజేత

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ప్రజ్ఞానంద తన కుటుంబసభ్యులతో కలిసి కలిశాడు. ఈ సందర్భంగా స్టాలిన్ ప్రజ్ఞానందను ప్రశంసలతో ముంచెత్తారు. తమిళనాడుతోపాటు యావత్ దేశం గర్వించేలా గొప్ప ప్రదర్శన కనబర్చావంటూ కొనియాడారు. అలాగే ప్రోత్సాహకంగా రూ.30 లక్షల చెక్కును అందించి మెమెంటోను బహుకరించారు. తమిళనాడు యువజన సంక్షేమం, క్రీడాశాఖ ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రజ్ఞానందను శాలువాతో సత్కరించారు.



శభాష్ ప్రణయ్

హైదరాబాద్: కోపెన్‌హగన్ వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మెరిసిన యువ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ అభినందనల జల్లు కురుస్తూనే ఉన్నది. కాంస్య పతకంతో హైదరాబాద్‌లో అడుగుపెట్టిన ప్రణయ్‌ను జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, గురుసాయిదత్, గోపీ తల్లి సుబ్బరావమ్మ సన్మానం చేసి చిరు సత్కారం చేశారు. ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీలో పతకంతో దేశానికి, రాష్ట్రానికి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావడం గర్వకారణమని సుబ్బరావమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని ఆమె అన్నారు. సన్మాన కార్యక్రమంలో సీనియర్ కోచ్ రాజేందర్, అనిల్ పాల్గొన్నారు.

పెగూల, వోంద్రుసోవా శుభారంభం

అన్‌సీడెడ్ చేతిలో ఓడిన గార్సియా

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో 2వ సీడ్ సబలెంకా(రష్యా), 3వ సీడ్ పెగులా(అమెరికా), 9వ సీడ్ వోంద్రుసోవా(చెక్) శుభారంభం చేయగా.. 7వ సీడ్ గార్సియా(ఫ్రాన్స్) తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. మంగళవారం రాత్రి జరిగిన తొలిరౌండ్ పోటీల్లో పెగులా 6-2, 6-2తో జియోర్గి(ఇటలీ), వోంద్రుసోవా 6-3, 6-0తో హాన్స్(కొరియా)పై సునాయాసంగా విజయం సాధించారు. ఇక గార్సియా(ఫ్రాన్స్) 4-6, 1-6తో వాంగ్(చైనా) చేతిలో ఓటమిపాలైంది.

మరో పోటీలో 17వ సీడ్ కీస్(అమెరికా) 6-2, 6-4తో ఆర్యంకా రస్(నెదర్లాండ్స్)పై, 25వ సీడ్ ప్లిస్కోవా(చెక్) 6-1, 6-4తో రూసే(జర్మనీ)పై, కెనిన్(అమెరికా) 7-6(7-2), 6-4తో బోర్డన్(జర్మనీ)పై గెలిచారు. ఒక 12వ సీడ్ క్రేజీకోవా(చెక్) 4-6, 6-7(3-7)తో అన్‌సీడెడ్ బ్రోంజెట్టి(ఇటలీ) చేతిలో ఓటమిపాలైంది.



అల్కరాజ్ సునాయాసంగా..

ఇక పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్) శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో అల్కరాజ్ 6-2, 3-2తో ఆధిక్యతలో ఉన్న దశలో కూఫర్(జర్మనీ) గాయం కారణంగా మ్యాచ్‌నుంచి వైదొలిగాడు. ఇతర పోటీల్లో 5వ సీడ్ సిన్నర్(ఇటలీ) 6-3, 6-1, 6-1తో హంట్మన్(జర్మనీ)పై, 26వ సీడ్ ఎవాన్స్(బ్రిటన్) 6-4, 6-2, 7-5తో గలన్(కొలంబియా)పై సునాయాసంగా నెగ్గి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. ఇక స్విట్జర్లాండ్‌కు చెందిన వావ్రింకా 7-6(7-5), 6-2, 6-4తో నిషియోకా(జపాన్)పై గెలుపొందగా.. ఐదుసెట్ల హోరాహోరీ పోరులో హుర్కాజ్, చైనాకు చెందిన యు గెలిచారు. హుర్కాజ్(పోలండ్) 4-6, 5-7, 7-6(7-5), 6-3, 6-1తో హుస్లర్(స్విట్జర్లాండ్)పై, చైనాకు చెందిన యు 3-6, 6-4, 2-6, 6-4, 6-2తో లాజోవిక్(క్రొయేషియా)పై నెగ్గి ముందుకు దూసుకెళ్లారు. ఇక 13వ సీడ్ డి-మేనర్(ఆస్ట్రేలియా) 6-2, 3-6, 6-1, 7-5తో సికాటోవిక్(కజకిస్తాన్)పై నెగ్గి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు.

బాబర్, ఇఫ్తికార్ సెంచరీలు

నేపాల్‌పై 238పరుగుల తేడాతో పాకిస్తాన్ గెలుపు

ఆసియాకప్ క్రికెట్ టోర్నీ



ముల్తాన్(పాకిస్తాన్): ఆసియా కప్ 2023లో పాకిస్తాన్ జట్టు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన గ్రూప్-ఏ తొలి లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 238పరుగుల తేడాతో నేపాల్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసింది. కెప్టెన్ బాబర్ అజామ్(151) రికార్డు సెంచరీకి తోడు ఇఫ్తికార్(109నాటౌట్) శతకంతో కదం తొక్కాడు. పాకిస్తాన్ జట్టు 124పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ వీరిద్దరూ కలిసి 5వ వికెట్‌కు 218పరుగులు జతచేశారు. ఛేదనలో నేపాల్ జట్టు 23.4ఓవర్లలో 104పరుగులకు ఆలౌటైంది. షాదాబ్‌కు నాలుగు, షాహిన్, రవూఫ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బాబర్‌కు లభించగా.. నేడు శ్రీలంక-బంగ్లాదేశ్‌ల మధ్య మ్యాచ్ జరగనుంది.

రికార్డుల బాబర్..

పాకిస్తాన్ జట్టు కెప్టెన్ బాబర్ అజామ్ నేపాల్‌పై సెంచరీ చేసి పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. నేపాల్‌పై బాబర్ అజామ్ 109బంతులు ఆడి 10 బౌండరీల సాయంతో కెరీర్‌లో 19వ సెంచరీని నమోదు చేశాడు. దాంతో వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్ల జాబితాలో 15వ స్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో డేవిడ్ వార్నర్(19 సెంచరీలు) రికార్డును సమం చేశాడు. సయీద్ అన్వర్(20) తర్వాత పాక్ తరఫున అత్యధిక వన్డే శతకాలు బాధిన పాకిస్తాన్ ఆటగాడిగానూ నిలిచాడు. అలాగే అత్యంత వేగంగా 19 సెంచరీలు చేసిన ప్లేయర్‌గా చరిత్ర సష్టించాడు. బాబర్‌కు 19సెంచరీలు సాధించేందుకు కేవలం 102 ఇన్నింగ్స్‌లు మాత్రమే తీసుకున్నాడు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా ఆటగాడు హషీమ్ ఆమ్లా (104 ఇన్నింగ్స్‌ల్లో) పేర ఉన్న రికార్డును చెరిపేసాడు.

స్కోర్‌బోర్డు..

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫకర్ జమాన్ (సి)ఆసిఫ్ (బి)కరణ్ 14, ఇమామ్ (రనౌట్) 5, బాబర్ (సి)సందీప్ (బి)సోంపాల్ 151, రిజ్వాన్ (రనౌట్) దిపేంద్ర 44, అఘా సల్మాన్ (సి)కుశాల్ బుర్టెల్ (బి)లమిచ్ఛెనె 5, ఇఫ్తికార్ (నాటౌట్) 109, షాదాబ్ (బి)సోంపాల్ 4, అదనం 10. (50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 342పరుగులు.

వికెట్ల పతనం: 1/21, 2/25, 3/111, 4/124, 5/338, 6/342

బౌలింగ్: సోంపాల్ 10-1-85-2, కరణ్ 9-0-54-1, గుల్షన్ 4-0-35-0, రాజ్‌పన్సి 10-0-48-0, లమిచ్ఛెనె 10-0-69-1, దేశ్‌పాండే 6-0-40-0, కుశాల్ 1-0-10-0

నేపాల్ ఇన్నింగ్స్: కుశాల్ (సి)రిజ్వాన్ (బి)షాహిన్ అఫ్రిది 8, ఆసిఫ్ (సి)ఇఫ్తికార్ (బి)నసీమ్ 5, రోహిత్ (ఎల్‌బి)షాహిన్ అఫ్రిది 0, ఆరిఫ్ (బి)హరీస్ రవూఫ్ 26, సోంపాల్ (సి)రిజ్వాన్ (బి)రవూఫ్ 28, గుల్షాన్ (సి)ఫకర్ జమాన్ (బి)షాదాబ్ 13, దిపేంద్ర (బి)నవాజ్ 3, కుశాల్ మల్లా (సి)ఇఫ్తికార్ (బి)షాదాబ్ 6, సందీప్ (బి)షాదాబ్ 0, కరణ్ (నాటౌట్) 7, లలిత్ (ఎల్‌బి)షాదాబ్ 0, అదనం 8. (23.4ఓవర్లలో ఆలౌట్) 104పరుగులు.

వికెట్ల పతనం: 1/10, 2/10, 3/14, 3/73, 5/82, 6/90, 7/91, 8/91, 9/104, 10/104

బౌలింగ్: షాహిన్ అఫ్రిది 5-0-27-2, నసీమ్ షా 5-0-17-1, రవూఫ్ 5-1-16-2, షాదాబ్ 6.4-0-27-4, నవాజ్ 2-0-13-1.


ఎన్నికల భద్రతపై పోలీసులకు శిక్షణ

సీఈఓ వికాస్‌రాజ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహకంగా రాష్ట్ర పోలీసు అధికారులకు ఒకరోజుపాటు సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా, సురక్షితమైనదిగా నిర్ధారించడానికి, కీలకమైన భద్రతా మాడ్యూళ్లపై వారి అవగాహనను పెంపొందించే లక్ష్యంతో బుధవారం ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో ఈ శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత యొక్క డైనమిక్ స్వభావాన్ని గుర్తుచేశారు. ఎన్నికలకు సంబంధించిన సంఘటనల గురించి మీడియా విస్తృతంగా కవరేజ్ చేయడంతో దిద్దుబాటు చర్యలను వేగంగా అమలు చేయడంలో వచ్చే ఇబ్బందిని ఆయన వివరించారు. ఎన్నికల సమయంలో భద్రతను కాపాడుకోవడానికి పోలీసు అధికారులు కొత్త వ్యూహాలు, సాంకేతికతలను స్వీకరించడానికి ఈ శిక్షణ కీలకమైన అవకాశాన్ని అందించిందని చెప్పారు. డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల రోజున నగదు లేదా మద్యం అక్రమ రవాణా కోసం అనుమానిత వాహనాల తనిఖీల నుండి పోలింగ్ స్టేషన్ల నిర్వహణ వరకు వివిధ భద్రతా సంబంధిత అంశాలపై వివరించారు. ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మంచి పద్ధతులు, పారదర్శకత పాటించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా దాదాపు 700 మంది పోలీసు సిబ్బందిని మార్చినట్టు తెలిపారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాలతో కూడిన అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో దాదాపు 80-85 చెక్‌పోస్టుల ఏర్పాటును ఆయన హైలైట్ చేశారు. క్లోజ్డ్-సర్క్యూట్ కెమెరాలతో అనుసంధానించిన ఆ చెక్ పాయింట్లు భద్రతా చర్యలను బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. చెక్ పోస్ట్‌ల్లో ఇతర శాఖలకు సంబంధించిన అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సీఈఓ ఆరిజ్ అఫ్తాబ్ ఎన్నికలకు ముందున్న సన్నాహక పనులపై వివరణాత్మక ప్రదర్శనను అందించారు. పోలింగ్ బూత్‌ల వర్గీకరణ, వల్నరబిలిటీ అసెస్‌మెంట్‌ల గురించి ఆయన చర్చించారు, క్రిటికల్ అసెస్‌మెంట్‌లను నొక్కిచెప్పారు. తమిళనాడు సీఈఓ తిరు సత్యబ్రత సాహూ, సీనియర్ పోలీసు అధికారులకు సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) అవసరాలు, ఇండక్షన్, డిప్లాయిమెంట్ మరియు డి- ఇండక్షన్ గురించి అవగాహన కల్పించారు. రాష్ట్ర పోలీసుల మోహరింపు వ్యూహాలను ఆయన పరిశోధించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ), వ్యయ పర్యవేక్షణకు సంబంధించిన సంబంధిత సమస్యలపై దృష్టి సారించే శాంతిభద్రతల నిర్వహణను వివరించారు. అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సంజయ్ కుమార్ జైన్, అదనపు డీజీపీ మహేష్ భగత్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర , రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సర్ఫ్రాజ్ అహ్మద్, మొత్తం 33 జిల్లాల పోలీసు సూపరింటెండెంట్, అదనపు ఎస్పీలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

నవచిత్రం



ఆర్య

సైంధవ్‌లో పవర్‌ఫుల్ రోల్

హీరోగా వెంకటేష్ నటిస్తున్న 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వంలో నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. 8 మంది కీలక నటీనటుల చుట్టూ ఈ సినిమా కథ సాగుతుంది. ఇప్పటివరకు 7 పాత్రలను పరిచయం చేశారు. లేటెస్ట్‌గా బుధవారం సినిమాలోని మరో కీలక పాత్రను రివీల్ చేశారు. తెలుగు ప్రేక్షకులకు బాగా సుపరిచితుడైన కోలీవుడ్ స్టార్ ఆర్య ఈ చిత్రంలో మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. మానస్‌గా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఆర్య మెషిన్‌గన్‌తో ఫెరోషియస్‌గా కనిపిస్తున్నారు. ఇతర ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ రిలీజ్ చేసిన గ్లింప్స్‌లో వెంకటేష్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, శ్రద్ధా శ్రీనాథ్, రుహాని శర్మ, ఆండ్రియా జెరెమియా, సారా, జయ ప్రకాష్ కనిపించారు. ఈ సినిమాని అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలో క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 22న రిలీజ్ చేస్తున్నారు.




శ్రీలీల, బాలకృష్ణ

గణపతి బప్ప మోరియా

త్వరలో రాబోతున్న వినాయక చవితి పండగ సంబురాలు బాలయ్య అభిమానులకు ఈ బుధవారంతోనే స్టార్ట్ అయ్యాయి. బాలయ్య తాజా చిత్రం 'భగవంత్ కేసరి'లోని గణేష్ ఆంథమ్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. గణపతి బప్ప మోరియా అంటూ సాగే గణేష్ ఆంథమ్ గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. ఈపాట ప్రోమోలో బాలకృష్ణ, శ్రీలీల.. బాబాయ్, అమ్మాయిగా కనిపించారు. అలాగే బిడ్డా ఆన్తలేదు.. సప్పుడు గట్టిగా చేయమను అని బాలయ్య అన్నదానికి శ్రీలీల సైతం మా చిచ్చా ఒచ్చిండు కొట్టర కొట్టు అంటూ ఊరమాస్ లెవల్లో డైలాగ్ చెప్పింది. దర్శకుడు అనిల్ రావిపూడి ప్రతి సినిమాలో ఒక యూనిక్ పాయింట్ ఉంటుంది. తమన్ సంగీతం అందించిన ఈ పాటను సెప్టెంబర్ 1న రిలీజ్ చేయనున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

బంధాలకు ప్రతీకగా డుమ్మారే డుమ్మా



రామ్, సయీ మంజ్రేకర్

రామ్ పోతినేని, బోయపాటి శ్రీను కాంబోలో రాబోతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్కంద'-ది ఎటాకర్. ఈ సినిమా నుంచి బుధవారం 'డుమ్మారే డుమ్మా..' అంటూ సాగే పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. తమన్ డిఫరెంట్ సిట్యువేషన్స్‌కి డిఫరెంట్ ట్రాక్‌లను స్కోర్ చేశారు. లేటెస్ట్‌గా సెలబ్రేషన్స్ వైబ్‌లతో ఈ పాటని నింపారు. ఇది పల్లె అందాన్ని, కుటుంబ సభ్యుల మధ్య గొప్ప బంధాన్ని చూపిస్తోంది. ప్రతి భావోద్వేగాన్ని, ప్రతి సందర్భాన్ని జరుపుకోవడానికి ఉన్న ప్రాముఖ్యతను ప్రజెంట్ చేస్తోంది. అలరించే ట్యూన్‌లానే విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి.

ఈ పాటకు కళ్యాణ చక్రవర్తి త్రిపురనేని సాహిత్యం అందించగా, అర్మాన్ మాలిక్, అయ్యన్ ప్రణతి ఆహ్లాదకరంగా పాడారు. ఈ పాటలో రామ్, సయీ మంజ్రేకర్‌తో పాటు శ్రీకాంత్, గౌతమి కూడా సందడి చేశారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సెప్టెంబర్ 15న రిలీజ్ కానుంది.

కలెక్షన్లు పెరుగుతున్నాయ్



కార్తికేయ, నేహాశెట్టి

కార్తికేయ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. లౌక్య ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద రవీంద్ర (బెన్నీ) బెనర్జీ ముప్పనేని నిర్మించిన ఈ సినిమాకు క్లాక్స్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం గత వారం విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ బుధవారం నిర్వహించిన విజయోత్సవ సభకు హీరో శ్రీ విష్ణు, దర్శకుడు అజయ్ భూపతి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హీరో కార్తికేయ మాట్లాడుతూ, 'కలెక్షన్లు డే బై డే పెరుగుతూనే ఉన్నాయి. మేం నమ్మి తీసుకున్న నిర్ణయాన్ని ప్రేక్షకులు సమర్థించడం, సపోర్ట్ చేయడం అనేది నాకు పెద్ద సక్సెస్ అనిపిస్తుంది. గత నాలుగైదేళ్లుగా ఎన్నో రకాల పాత్రలు చేస్తున్నాను. ఇప్పుడు ఇన్నాళ్లకు నేను నమ్మింది జరిగింది. నాకు పెద్ద రిలీఫ్ అనిపించింది' అని తెలిపారు. 'కార్తికేయ ఎప్పటికప్పుడు కొత్త కొత్త పాత్రలు చేస్తూనే ఉన్నాడు. తనకి పెద్ద హిట్ పడాలని అనుకున్నాను. ఇప్పుడు ఈ సినిమాతో హిట్ కొట్టేశాడు' అని హీరో శ్రీ విష్ణు అన్నారు.

దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ, 'కార్తికేయకు హిట్ వస్తే నాకు కూడా హిట్ వచ్చినట్టే. క్లాక్స్‌కు ఇంత మంచి హిట్ రావడం ఆనందంగా ఉంది' అని చెప్పారు. "నాకు రెండో హిట్ వచ్చినందుకు ఎంతో హ్యాపీగా ఉంది. ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని నాయిక నేహా శెట్టి అన్నారు.

వినూత్న కథ

సాయి ధన్సిక, విమలారామన్, గణేష్ వెంకట్రామన్ ముఖ్య పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'అంతిమ తీర్పు'. శ్రీసిద్ధి వినాయక మూవీ మేకర్స్ పతాకంపై డి.రాజేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఎ.అభిరామ్ దర్శకుడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ తన నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, 'వినూత్న కథాంశంతో రూపొందిన చిత్రమిది. ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలు ఇందులో ఉన్నాయి. సాయిధన్సిక నటన సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసి త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అని తెలిపారు.



మెప్పించే రాజా.. రమ్యం

విగ్నేష్ రెడ్డి గవి, శ్రీ ఆశ్రిత జంటగా నటిస్తున్న సినిమా 'రాజా రమ్యం'. విలేజ్ డ్రామా కథతో ఈ చిత్రాన్ని దర్శకుడు ప్రనిల్ గౌరీ పాగ రూపొందిస్తున్నారు. గావి ఫిలిమ్స్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ పై కోకొండ జయచందర్ రెడ్డి, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఏమి పాపం..' అనే లిరికల్ సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పాటకు సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ సాహిత్యాన్ని అందించడంతో పాటు పాడటం విశేషం. హార్ట్ టచింగ్ లిరిక్స్, ట్యూన్‌తో సాగే ఈ పాట అందర్నీ విశేషంగా అలరించడం ఖాయం. ప్రస్తుతం షూటింగ్ తుది దశలో ఉన్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందు కొచ్చేందుకు సిద్ధమవుతోంది.



విగ్నేష్ రెడ్డి గవి, శ్రీ ఆశ్రిత

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

ప్రయివేటుకు ఈవీ చార్జింగ్ కేంద్రాలు

తొలి విడతలో 615 కేటాయింపు

- పీపీపీ పద్ధతిలో ఏర్పాటు
- నిజమే...రెడ్కో చైర్మెన్ వై సతీష్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పర్యావరణ పరిరక్షణ కోసం కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు కాలుష్య రహితమైన ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. 2047 నాటికి దేశంలో పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలు రావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. అయితే ఈ వాహనాల తయారీ, అమ్మకం, పునర్వినియోగం సహా అన్నింటినీ ప్రయివేటుకే అప్పగించాలని కేంద్రం నిర్ణయించింది. దానిలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 1,200 ఎకరాల విస్తీర్ణంలో మొబిలిటీ ఈవీ క్లస్టర్‌ను ఏర్పాటు చేసింది. దీనిలో పరిశ్రమలు స్థాపించేందుకు దేశ, విదేశీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు పలుమార్లు చెప్పారు. తాజాగా ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కేంద్రాలను ప్రయివేటుకే ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఈ చార్జింగ్ కేంద్రాలను జీహెచ్ఎంసీతో పాటు వేర్వేరు ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (టీఎస్‌రెడ్కో) ఏర్పాటు చేసింది. ఇవి పూర్తిగా ప్రభుత్వ నిధులతో ఏర్పాటయ్యాయి. యాదగిరిగుట్టలో మాత్రం పీపీపీ పద్ధతిలో ఈవీ చార్జింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో 150 చార్జింగ్ కేంద్రాలను రెడ్కో ఏర్పాటు చేసింది. వాటిలో 90 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 405 ఈవీ చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో అన్ని ప్రయోగ దశలు దాటుకొని ఇవి విజయవంతంగా నడుస్తున్నాయి. 2025 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3వేల ఈవీ చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వీటిని ప్రభుత్వ పెట్టుబడులతో కాకుండా, ప్రయివేటు వ్యక్తులకే ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఇచ్చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

తొలి దశలో గ్రేటర్ హైదరాబాద్ మినహా అన్ని జిల్లా, మండల కేంద్రాలు, హైవేలపై 615 ఈవీ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ప్రయివేటు వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. స్థలాల ఎంపికను టీఎస్ రెడ్కోనే నిర్ణయించనుంది. ఇప్పటికే ఆ సంస్థ పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఖాళీ స్థలాలను సేకరించింది. తాజాగా ప్రయివేటు వ్యక్తులకు చెందిన సొంత స్థలాలతో పాటు రెడ్కో వివిధ ప్రభుత్వ శాఖల నుంచి సేకరించిన ఖాళీ స్థలాల్లో కూడా లీజు ప్రాతిపదికన పీపీపీ పద్ధతిలోనే చార్జింగ్ కేంద్రాల నిర్మాణం చేపట్టనున్నారు. వీటిలో ఫాస్ట్ అండ్ స్లో చార్జింగ్ కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేస్తారు. దీనికి సంబంధించిన విధివిధానాలను ఇప్పటికే ఖరారు చేసినట్టు సమాచారం.



నిజమే...

రాష్ట్రవ్యాప్తంగా 615 ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కేంద్రాలను పీపీపీ పద్ధతిలో నిర్మించాలని నిర్ణయిం చాం. దీనికోసం మా వైపు నుంచి స్థలాల సేకరణ పూర్తిచేశాం. ప్రయివేటు వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాల కొనుక్కున్న వారు మారుమూల ప్రాంతాల్లో కూడా ఇబ్బంది పడకూడ దనే ఉద్దేశ్యంతోనే ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఇక్కడి చార్జీలను స్థాపిత సామర్థ్యాలను బట్టి నిర్ణయిస్తాం. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగానికీ, మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజలు సహకరించాలి.



– టీఎస్‌రెడ్కో చైర్మెన్ వై సతీష్‌రెడ్డి



జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

- మంత్రి మహేందర్‌రెడ్డికి విజ్ఞప్తి
- శుభాకాంక్షలు తెలిపిన ఫెడరేషన్ నేతలు

నవతెలంగాణ - హైదరాబాద్

రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రిగా డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, కార్యదర్శి ఎస్ కే సలీమా, నాయకులు కె. పాండురంగారావు, జే. ఉదయ్ భాస్కర్ రెడ్డి తదితరులు మంత్రి మహేందర్ రెడ్డిని కలిసి బుధవారం పూలగుచ్ఛం అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో దీర్ఘకాలికంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రికి వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, రైల్వే రాయితీ పాస్‌లు, పెన్షన్ స్కీమ్ తదితర 12 దీర్ఘకాలిక డిమాండ్లను మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్‌రెడ్డి స్పందిస్తూ త్వరలోనే జర్నలిస్టుల సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మరోసారి పూరిస్థాయిలో సమస్యలపై చర్చిద్దామని చెప్పారు. ఇందుకు ఫెడరేషన్ నేతలు అంగీకరించారు.

ప్రిన్సిపాల్ తీరును నిరసిస్తూ విద్యార్థుల ఆందోళన

- ప్రధాన రహదారిపై రాస్తారోకో, కలెక్టరేట్ ముట్టడి
- విద్యార్థి యువజన సంఘాల మద్దతు




నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి విద్యార్థులపై వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారు. పట్టణంలోని పాఠశాల నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా వచ్చి చౌక్‌లో సుమారు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ తమకు సరిగ్గా భోజనం పెట్టడం లేదన్నారు. నైట్ వాచ్‌మెన్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని పలుమార్లు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. డార్మెంటరీలు శుభ్రంగా లేవని, రెండు రోజులుగా నీళ్ల రావడం లేదని తెలిపారు. గతంలో ఉన్న ప్రిన్సిపాళ్లతో తమకు ఎలాంటి ఇబ్బందులు రాలేదని, కానీ ప్రస్తుత ప్రిన్సిపాల్ ఇష్టరీతిన వ్యవహరిస్తూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రిన్సిపాల్ విషయం ఆర్సీఓకు చెప్పినప్పటికీ స్పందన లేదన్నారు. దాంతో తమ సమస్య ఎవరు తీరుస్తారో తెలియక రోడ్డెక్కినట్టు తెలిపారు. తల్లిదండ్రులు దూరంగా ఉన్న తమ బాధను ప్రిన్సిపాల్ పట్టించుకోకపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్‌ను తొలగించే వరకు ఆందోళనను ఆపేది లేదని స్పష్టంచేశారు. ఉదయం ఎనిమిది గంటలకు అల్పాహారం కూడా తినకుండా రోడ్డెక్కామన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు వెళ్లి కలెక్టర్ ఇంటి ఎదుట బైటాయించారు. అదే సమయంలో ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి అక్కడికి రావడంతో ఆమెకు వ్యతిరేకంగా విద్యార్థినులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. క్యాంపు కార్యాలయం లోపల ఆందోళన చేయవద్దని హెచ్చరించడంతో విద్యార్థినులు కలెక్టరేట్‌కు చేరుకొని గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. మధ్యాహ్నం వరకు ధర్నా కొనసాగినా ఏ ఒక్క అధికారి కూడా విద్యార్థుల ఆవేదన వినకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఎంతకూ వెనక్కి తగ్గకపోవడంతో విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్.. లెక్చరర్స్‌ను విద్యార్థుల వద్దకు పంపించి వారిని తిరిగి తీసుకురావాలని లేదంటే తొలగిస్తానని హెచ్చరించినట్టు తెలిసింది. లెక్చరర్స్ అంతా అతిథి, కాంట్రాక్టు సిబ్బంది కావడంతో చేసేదేమీ లేక.. విద్యార్థులను బతిమిలాడి పాఠశాలకు తిరిగి తీసుకువెళ్లారు. విద్యార్థులు తాము భోజనం చేసేది లేదని, ప్రిన్సిపాల్‌ను తొలగించే వరకు పాఠశాలలోకి వచ్చేది లేదని, పాఠశాల గేటు ఎదుట భీష్మించుకూర్చోవడంతో పోలీసులు వారిని బెదిరించి లోపలికి పంపించారు. తిరిగి పాఠశాలకు వెళుతున్న తమపై ప్రిన్సిపల్ వేధింపులకు పాల్పడితే జిల్లా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని విద్యార్థినులు ఒకింత ఉద్వేగానికి గురయ్యారు. ఇంత జరుగుతున్నప్పటికీ జిల్లా స్థాయి అధికారులు ఆ వైపు కూడా తొంగి చూడకపోవడం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

టీవీవీపీ అటానమస్ హోదాను రద్దు చేయాలి

- వైద్యారోగ్యశాఖలో విలీనం చేయాలి:టీయుఎంహెచ్ఇయూ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ అటానమస్ హోదాను రద్దు చేసి వైద్యారోగ్యశాఖలో విలీనం చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ- సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియొద్దీన్, కె.యాదానాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.మరియమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు బైరపాక శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు భూలక్ష్మి వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం.రిజ్వీని కలిసి వినతిపత్రం సమర్పించారు. టీవీవీపీని రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చాలనీ, ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరీ ద్వారా జీతాలు ఇవ్వాలనీ, డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డీసీపీ) ఏర్పాటు చేసి వెంటనే 317 జీవోతో నిమిత్తం లేకుండా పదోన్నతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రమోషన్ లేని కేటగిరీలకు కూడా ఆ సౌకర్యం కల్పించాలనీ, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలనీ, కాంట్రాక్ట్ సిబ్బందికి సమాన పనికి - సమాన వేతనం ఇవ్వాలని కోరారు. టీవీవీపీ పరిధిలో 174 ఆస్పత్రుల్లో 5,184 మంది రెగ్యులర్, 1,095 మంది కాంట్రాక్ట్, 2,029 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. అనేక సంవత్సరాల నుంచి పని చేస్తున్నప్పటికీ వీరికి 010 పద్దు ద్వారా ట్రెజరీ జీతాలు లేవనీ, హెల్త్ కార్డులు ఇవ్వడం లేదనీ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదనీ, సకాలంలో జీతాలు రాని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉమ్మడి ప్రభుత్వ నిర్ణయంతో నష్టం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం వీవీపీకి అటానమస్ హోదా కల్పించి వైద్యారోగ్యశాఖలో భాగం కాకుండా చేయడంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని రిజ్వీ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ వచ్చాక కూడా అటానమస్ హోదా రద్దు చేయకపోవడంతో ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పొందుతున్న సౌకర్యాలకు పరిషత్ ఉద్యోగులు నోచుకోవడం లేదని తెలిపారు.

అసెంబ్లీ బరిలో ఉంటా..

తప్పకుండా గెలుస్తా...

ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అజ్మీర ప్రహ్లాద్



నవతెలంగాణ - ములుగు

అసెంబ్లీ బరిలో ఉంటా... తప్పకుండా గెలుస్తానని ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ డాక్టర్ అజ్మీర ప్రహ్లాద్ ధీమా వ్యక్తం చేశారు. ములుగు జిల్లా రామచంద్రపురం గ్రామంలో బుధవారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి అజ్మీర చందూలాల్ కొడుకు అజ్మీరా ప్రహ్లాద్ అభిమానులతో కలిసి పాల్గొన్నారు. వారందరూ ముక్తకంఠంతో అజ్మీరా చందులాల్ ఈ నియోజకవర్గంలో అనేక సేవలను అందించారని, ఆయన మన ముందు లేకపోవడం దురదృష్టకరమని, వారి రూపంలో ప్రహ్లాద్ ఉన్నారని అన్నారు. కానీ బీఆర్ఎస్ అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. అసెంబ్లీ టిక్కెట్టు ఇచ్చి ఉంటే ములుగు నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిపించుకునే వాళ్ళమని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ అసెంబ్లీ బరిలో ప్రహ్లాద్ ఉండాలని కోరారు. అనంతరం అజ్మీర ప్రహ్లాద్ మాట్లాడుతూ.. అందరి నిర్ణయం మేరకే తాను పనిచేస్తానని, తన బలం, బలగం కార్యకర్తలేనని అన్నారు. ఈ నియోజకవర్గంలో చందులాల్ అహర్నిశలు పాటుపడి నియోజకవర్గ కార్యకర్తలను, ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నారని తెలిపారు. వారిలాగానే తానూ అందరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. చివరి వరకు తనకు బీఆర్ఎస్ టిక్కెట్ ఇస్తుందని ఆశించినా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కార్యకర్తల నిర్ణయం మేరకే తప్పకుండా ఈసారి తాను పోటీలో ఉంటానని, విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామచంద్రపూర్ గ్రామస్తులు, చందూలాల్, ప్రహ్లాద్ అభిమానులు పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి వస్తున్నా...

- ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ
- ఆశీర్వదించండి, అభివృద్ధి చేస్తా..: మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య కూతురు డా.అనురాధ



నవతెలంగాణ-ఇల్లందు

నియోజకవర్గ ప్రజల ఆధరాభిమానాలు, ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి అడుగు పెడుతున్నట్టు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య కూతురు డా. అనురాధ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఇల్లందు నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు చెప్పారు. ఎంతోమంది అభిమానులు, శ్రేయోభిలాషులు ప్రోత్స హిస్తు న్నారని, అధికార, ప్రతిపక్ష పార్టీలు టికెట్ ఇస్తామని ప్రాథమికంగా మాట్లాడిన విషయం వాస్తవమేనన్నారు. విప్లవ గ్రూపులు, న్యూ డెమోక్రసీ, ప్రజాప్రంథా, ఇతర రాజకీయ పార్టీల సహకారం కోరతానని తెలిపారు. తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అడుగుజాడల్లో నడుస్తానని, అభివృద్ధికి పాటు పడతానని, కబ్జా రాజకీయాలను అంతమొందిస్తానన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో ఎన్నో వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని, గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని, పోడు, విద్యా వైద్యం, రైతు సమస్యలు అనేకం ఉన్నాయని తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ఎన్నో రకాల ప్రలోభాలకు ఓటర్లను గురి చేసినప్పటికీ ప్రజాభిమానంతో గెలవగలనని ధీమా వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రామకష్ణ

నవతెలంగాణ - బోనకల్



మండల కేంద్రంలోని పెట్రోలు బంకు సమీపంలో మోటార్ సైకిల్ ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వైరా మండలం లింగన్నపాలెం గ్రామానికి చెందిన చలగాని రామకష్ణ తన భార్యను, కుమార్తెను తీసుకొని తన మోటార్ సైకిల్ పై ఏపీలోనే కష్ణాజిల్లా అత్త వారి ఊరు పెనుగంచిప్రోలు వెళ్తున్నాడు. అయితే అదే సమయంలో వత్సవాయి వైపు నుంచి బోనకల్లు వైపు వస్తున్న ఓ ట్రాక్టర్ స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీ కొట్టింది. దీంతో రామకష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఈ ప్రమాదంలో రామకష్ణ చేయి విరిగి, తీవ్ర గాయాలు పాలయ్యాడు. భార్య, కుమార్తెకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది కోట భానుసాహన్ పైలెట్ చక్రవర్తి సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐటీ హబ్‌ను మరింత విస్తరిస్తాం

- కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిజామాబాద్ ఐటీ హబ్‌ను మరింత విస్తరిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు.ఇటీవల ఆమెతో చర్చించిన గ్లోబల్ లాజిక్ సంస్థ నిజామాబాద్ ఐటీ హబ్‌లో కంపెనీ ఏర్పాటుకు నిర్ణయించింది.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయనీ, హైదరాబాద్,బెంగుళూరు నగరాలకు వెళ్లాల్సిన అవసరముండదని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ కంపెనీలు వస్తాయని ఆమె తెలిపారు.

మోటారు సైకిళ్లను వెంటనే అందజేయాలి

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వమిచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ప్రకటించిన మోటార్ సైకిళ్లను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ క్లెయిమ్స్‌కు వెంటనే పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవి కుమార్ మాట్లాడుతూ.. 2022 అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్ల ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి ఏడాది దాటినా వాటికి సంబంధించిన రూల్స్ రూపొందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్ సైకిల్ వస్తుందని ఆశించిన కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. వెంటనే విధి విధానాలు రూపొందించి వెల్ఫేర్ బోర్డులో కార్డు ఉన్న కార్మికులందరికీ మోటార్ సైకిల్స్, మహిళా కార్మికులకు స్కూటీలు అందించాలని కోరారు. ప్రమాద మరణాలు, సహజ మరణాలు, పెండ్లి కానుక, ప్రసూతి సహాయం తదితర అనేక పరిహారాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి నిధులు అందించి కార్మికులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వేలిముద్ర సిస్టంలో కార్మికుల వేలిముద్రలు పడటం లేదని, దాంతో మీ సేవ, ఆఫీసుల చుట్టూ వారికి తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పద్ధతిని మార్పు చేసి, ఐరిస్ పద్ధతిని పెట్టి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరుతున్నామన్నారు. రూ.1.30 లక్షల సహజ మరణ నష్టపరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, ప్రమాదశాత్తు చనిపోయిన వారికి రూ.10 లక్షలకు పెంచాలని, ఇల్లు లేని కార్మికులకి గృహలక్ష్మి కింద ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, జిల్లా సహాయ కార్యదర్శి పోతిరెడ్డి రాజు, కమిటీ సభ్యులు బాలయ్య, యాదయ్య, అంతయ్య, మహేందర్, శ్రీనివాస్, సత్యం, బాబు, నర్సివ్వ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయండి

- సీఎం కేసీఆర్‌కు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహిరంగ లేఖ

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ ప్రకటించిన ప్రకారం 13,500 పోస్టుల డీఎస్సీ నోటిఫికేషన్ పునరుద్ధరించాలని కోరారు. ఈమేరకు బుధవారం సీఎం కేసీఆర్‌కు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఓ వైపు రిటైర్డ్ అవుతున్న వారి సంఖ్య పెరుగుతున్నా. వారి స్థానాల్లో కొత్త వారిని తీసుకోవాలన్న సోయి ప్రభుత్వానికి లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల కోసం సంవత్సరాలుగా అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో కొందరి వయో పరిమితి కూడా దాటిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరవీరుల త్యాగ ఫలితం ఇదేనా? సకల జనులు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఇందుకేనా? అని ప్రశ్నించారు. 2020 డిసెంబర్‌లో అసెంబ్లీ సాక్షిగా టీచర్ పోస్టుల భర్తీపై ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఎంతో ఆర్భాటంగా 13500 పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారనీ, ఐదువేల పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. రాష్ట్రంలో గత ఐదేండ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనే లేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనలో ఆరు నెలలకోసారి టెట్, రెండేండ్లకొసారి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేవారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో అభ్యర్థులు నోటిఫికేషన్ల కోసం ఏండ్లకు ఏండ్లు ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి నిరుద్యోగుల బాధలను గుర్తించాలని కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను వారం రోజుల్లో పునరుద్ధరించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లక్షల మంది నిరుద్యోగులతో ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పట్నం మహేందర్ రెడ్డి

పలువురి శుభాకాంక్షలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ, గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రిగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీరించారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని మొదటి అంతస్తులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. శాంతికుమారి, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ కె. అశోక్‌రెడ్డి, డైరెక్టర్ బి రాజమౌళి సమక్షంలో మంత్రి ఛార్జీ తీసుకున్నారు. అంతకు ముందు ఉదయం నుంచే ఆయనకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల నుంచి అభినందనల వర్షం కురిసింది. పూలగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. వందలాది మంది అభిమానులు రంగారెడ్డి జిల్లా తాండూరు, కొడంగల్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి వచ్చారు. ఈ మేరకు సచివాలయంలోని మంత్రి చాంబర్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. బాధ్యతల స్వీకరణకు ముందు చాంబర్‌లో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వాదాల మధ్య కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తొలి ఫైల్‌పై సంతకం చేశారు. వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్, మంత్రి భార్య పట్నం సునితా మహేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిపి మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి. శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, టి.ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్య, మాధవరం కష్ణారావు, బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, సీనియర్ జర్నలిస్టులు రమేశ్ హజారీ, మారుతిసాగర్, తదితరులు హాజరయ్యారు. ఇదిలావుండగా సమాచార శాఖ అదనపు డైరెక్టర్ నాగయ్య కాంబ్లె, జాయింట్ డైరెక్టర్లు డిఎస్ జగన్, శ్రీనివాస్, వెంకటరమణ, సీఐఈ రాధాకిషన్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, మంత్రి ప్రమాణ స్వీకారం ఫోటోను ప్రత్యేకంగా తయారు చేయించి మంత్రికి అందజేశారు. అలాగే వరంగల్ చారిత్రక వేయిస్తంబాల ఆలయం ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ మంత్రి మహేందర్‌రెడ్డిని ఆశీర్వదించారు.

పక్కపక్కనే రంగారెడ్డి జిల్లా మంత్రుల ఛాంబర్లు

రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకు సచివాలయంలో పక్కపక్కనే చాంబర్లు కేటాయించడం కూడా బాధ్యత స్వీకరణ కార్యక్రమంలో చర్చనీయాంశమైంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న పట్లోళ్ల సబిత ఇంద్రారెడ్డికి కూడా మొదటి అంతస్తులో ఇప్పటికే చాంబర్ ఉంది. ఇప్పుడు సబితారెడ్డికి పట్నం మహేందర్‌రెడ్డి అల్లుడైన సంగతి తెలిసిందే. మంత్రి సబిత చాంబర్ తర్వాతి చాంబర్‌ను కేటాయించారు దీంతో ఆ జిల్లా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. అత్తా, అల్లుళ్లకు పక్కపక్కనే చాంబర్లు ఇవ్వడం యాధృచ్చికమేనని, ఇందులో విశేషమేమీ లేదని చెప్పుకోవడం గమనార్హం.





నేడు రాఖీ పండుగ

సోదరి, సోదరుల బంధానికి ప్రతీక



నవతెలంగాణ - బోనకల్

చరిత్రలో రాఖీ పండుగకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. రాఖీ పౌర్ణమి రోజు సోదరికి సోదరుడు రాఖీ పువ్వు కట్టి తన ప్రేమను, బంధాన్ని చాటేదే రాఖీ పండుగ. ఈ రాఖీ పండగ సందర్భంగా ప్రత్యేక కథనం.. అధికారిక పేరు రాఖీ పౌర్ణమి. ఇతర పేర్లు రాఖీ. ఈ పండుగను జరుపుకొనేవారు హిందువులు, జైనులు, సిక్కులు, ముస్లిం, బౌద్ధులు, క్రైస్తవులు. పౌర్ణమి (శ్రావణ పౌర్ణమి) రోజున ఈ పండుగను జరుపుకుంటారు. రాఖీ, రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంద్యాల పూర్ణిమ అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్ల లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. అన్నకుగాని తమ్ముడికిగాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రాధాన్య విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ. సాధారణంగా జంధ్యాన్ని ధరించేవారు ఈ రోజునే పాతది వదిలి కొత్త దానిని ధరిస్తారు. ఉపనయనం అయిన వారు జంధ్యాల పౌర్ణమి రోజు గాయత్రీ పూజచేసి కొత్త యజ్ఞోపవీతాన్ని ధరించి పాతది తీసివేస్తారు .

రక్షాబంధన్ ఎలా ప్రారంభమైందంటే


పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కరకాలం యుద్ధం సాగింది. యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు నిర్వీర్యుడై, తన పరివారమంతటినీ కూడగట్టుకొని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచిస్తుంది. రాక్షస రాజు అమరావతిని దిగ్బంధనం చేస్తున్నాడని తెలుసుకొని భర్త దేవేంద్రుడికి సమరం చేయడానికి ఉత్సాహాన్ని కల్పిస్తుంది. సరిగ్గా ఆ రోజు శ్రావణ పౌర్ణమి కావడంతో పార్వతీ పరమేశ్వరులను, లక్ష్మీనారాయణులను పూజించి రక్షను దేవేంద్రుడి చేతికి కడుతుంది. అది గమనించిన దేవతలందరూ వారు పూజించిన రక్షలను తీసుకువచ్చి ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. శచీదేవి ప్రారంభించిన ఆ రక్షాబంధనం. నేడు రాఖీ పండుగగా ఆచారమైందని పురాణాలు చెబుతున్నాయి.



































Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886



ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మునగాల

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సోమపంగు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని రేపాలపీహెచ్‌సీ సెంటర్‌లో పనిచేస్తున్న 22 మంది ఆశా వర్కర్లు బుధవారం సీఐటీయూలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో 32 ఏండ్లుగా మైదాన ప్రాంతంలో 18 ఏండ్ల నుండి పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జంగంపల్లి సాయికుమార్, భాగ్యలక్ష్మి, సుధారాణి, నాగమణి, రమణ, అరుణ, భారతి, మేరమ్మ,నాగమణి, షఫీ, ఉష, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరం

నవతెలంగాణ- ఆలేరురూరల్

మండలంలోని కొల్లూరు గ్రామంలో యాక్షన్ ఎయిడు మరియు మాక్సు విజన్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు గ్రామ సర్పంచ్ కోటగిరి జయమ్మ బుధవారం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, ఉప సర్పంచ్ మహేందర్ ,పంచాయతీ కార్యదర్శి మల్లేష్ ,కారోబార్ రమేష్ సంస్థ వాలంటర్ శోభారాణి, వెన్నెల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో.. టికెట్ల లొల్లి

అత్యధికంగా పోటీపడుతున్న ఆశావాహులు

- ఉమ్మడి జిల్లాలో 130 దరఖాస్తులు
- అత్యధికంగా తుంగతుర్తి, అత్యల్పంగా సాగర్
- తెరపైకి ఒకే కుటుంబంలో రెండు టికెట్ల వ్యవహారం
- ముగ్గురు పేర్లతో జాబితా, మూడో వారంలో అభ్యర్థుల ఖరారు
- పొత్తు కుదిరితే మిర్యాలగూడ, మునుగోడు వామపక్షాలకు



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఈసారి అధికారం చేపట్టాలని అధిష్టానం తీవ్ర చేస్తుంది. కర్ణాటక ఫార్ములాను తెలంగాణలో ఉపయోగించి అధికారం చేపట్టాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తుంది. అందులో భాగంగా ఆయా నియోజకవర్గాలలో టికెట్ కోసం ఆశపడే ఆశవాహుల నుండి దరఖాస్తుల స్వీకరించింది. ఆగస్టు 25 వరకు గడువు పెట్టి దరఖాస్తులు స్వీకరించగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుండి ఆశావాహులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా విషయానికొస్తే కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసేందుకు పెద్ద ఎత్తున ఆశవాహులు పోటీ పడుతున్నారు. వచ్చిన దరఖాస్తులను నియోజకవర్గాల వారిగా వేరుచేసి అందులో సర్వేల ఆధారంగా ముగ్గురు పేర్లను ఎంపిక చేయనున్నారు. అతి పేర్లను సెప్టెంబర్ 2న జరిగే సమావేశంలో ఆమోదం తెలిపి ఏఐసీసీ కు పంపనున్నారు. అధిష్టానం ఆమోదం మేరకు అభ్యర్థులను ప్రకటించనున్నారు.

నవతెలంగాణ-మిర్యాలగూడ

కాంగ్రెస్‌లో పార్టీలో పోటీ చేసేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల నుండి దరఖాస్తులు పెద్ద ఎత్తున వచ్చాయి. మొత్తంగా 130 దరఖాస్తులు వచ్చినట్లు మంగళవారం హైదరాబాదులోని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గం నుండి 23 దరఖాస్తులు రాగా అత్యల్పంగా సాగర్ నియోజకవర్గం నుండి రెండు మాత్రమే వచ్చాయి. తుంగతుర్తిలో ప్రధానంగా గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అద్దంకి దయాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రీతం, జేఏసీ నాయకుడు పిడమర్తి రవి, సీనియర్ నేతలు జ్ఞాన సుందర్, వడ్డేపల్లి రవి, గుడిపాటి నరసయ్యతో పాటు మరికొందరు ఉన్నారు. కేవలం రెండు దరఖాస్తు వచ్చిన నాగార్జునసాగర్‌లో సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి తనయులు కొందరు రఘువీరారెడ్డి, కుందూరు జయవీర్ ఉన్నారు. రఘువీరారెడ్డి మిర్యాలగూడ నుంచి కూడా దరఖాస్తు చేసుకున్నారు. వామపక్షాలతో పొత్తు ఏర్పడితే రఘువీరారెడ్డి సాగర్ నుంచి పోటీలో లేక పోతే నల్గొండ పార్లమెంట్ నుంచి పోటీ చేయించాలని జానా రెడ్డి చూస్తున్నట్లు సమాచారం. ఇక పోతే సాగర్‌లో ఎలాంటి పోటీ ఉండదు. దాదాపు అభ్యర్థి ఖరారు అయినట్లు సమాచారం. మిర్యాలగూడలో 20 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ప్రధానంగా కుందూరు రఘువీరారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మా రెడ్డి, పీసీసీ కార్యదర్శి అలుగుబెల్లి అమరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, పగిడి రామలింగ యాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మాధవి, ఎన్ఆర్ఐ తేజ గౌడ్ తో పాటు మరికొందరు ఉన్నారు. పొత్తులో భాగంగా మిర్యాలగూడ వామపక్షాలకు వెళితే అందరూ కూడా సహకరిస్తామని అధిష్టానం ముందు హామీ ఇచ్చినట్టు తెలిసింది. పొత్తు కుదరకపోతే కాంగ్రెస్ నుంచి ఎవరు బరిలో ఉన్నా మిగిలిన వారు రెబల్‌గా నిలిచే అవకాశం కనిపిస్తుంది. సూర్యాపేట నుంచి మాజీ మంత్రి దామోదర్ రెడ్డి ,పటేల్ రమేష్ రెడ్డి, తండు శ్రీనివాస్ యాదవ్‌తో పాటు మరో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. నల్గొండ నుండి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,దుబ్బాక నర్సింహారెడ్డి, చెరుకు సుధాకర్‌తో పాటు నలుగురు ఉన్నారు. హుజూర్‌నగర్ నుండి ఎంపీ ఉత్తంకుమార్ రెడ్డితో పాటు మరో 6 గురు దరఖాస్తు చేసుకున్నారు. కోదాడ నుండి మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నపురెడ్డి అప్పిరెడ్డి, సాముల జైపాల్ రెడ్డి, మరో ముగ్గురు ఉన్నారు. భువనగిరి నుండి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, పొత్నక్ ప్రమోద్, కసిరెడ్డి నరసింహారెడ్డి, పంజాల రామాంజనేయులు ఉన్నారు. దేవరకొండ నుండి మాజీ ఎమ్మెల్యే బాలు నాయక్ బిల్యా నాయక్‌తో పాటు మరో ఎనిమిది మంది ఉన్నారు. మునుగోడు నుండి చలమల్ల కృష్ణారెడ్డి పాల్వాయి స్రవంతి, పున్న కైలాస్, బైకని లింగం యాదవ్ ఉన్నారు. పొత్తులో భాగంగా ఈ స్థానం సీపీఐకి వెళ్లే అవకాశం ఉన్నది. నకిరేకల్ నుంచి 18 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య టీపీసీసీ కార్యదర్శి కొండేటి మల్లయ్య, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యతో పాటు మరికొందరు ఉన్నారు. ఆలేరులో 17 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ఆ జిల్లా అధ్యక్షుడు అందం సంజీవరెడ్డి, బీర్ల ఐలయ్య ,బండ్రు శోభా రాణి ,కల్లూరి రామ చంద్రా రెడ్డి ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గ వారీగా వచ్చిన దరఖాస్తులు

తుంగతుర్తి	23
మిర్యాలగూడ	20
నకిరేకల్	18
ఆలేరు	17
భువనగిరి	11
దేవరకొండ	10
హుజూర్నగర్.	07
నల్గొండ	07
సూర్యాపేట.	06
కోదాడ	05
మునుగోడు	04
నాగార్జునసాగర్	02

ఐదు నియోజకవర్గంలో స్పష్టత

ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఐదు నియోజకవర్గాలలో స్పష్టత వచ్చినట్లు సమాచారం. ముందుగా ఎలాంటి పోటీ లేని నాగార్జునసాగర్ నియోజకవర్గం నుండి దాదాపు అభ్యర్థి ఖరారు అయినట్టు సమాచారం. అక్కడ సీనియర్ నాయకుడు జానారెడ్డి తనయుడు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు ఇద్దరిలో చిన్న కుమారుడికి అవకాశం వస్తుంది. పొత్తులో భాగంగా మిర్యాలగూడ వామపక్షాలకు వెళితే పెద్ద కుమారుడు రఘువీరారెడ్డి సాగర్ అడిగే అవకాశం ఉంటుంది. పార్లమెంటుకు అవకాశం ఇస్తే సాగర్ నుండి జయవీర్ రెడ్డి దాదాపు ఖరారు అవుతుంది. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని నల్గొండ, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, నియోజకవర్గంలో అభ్యర్థుల విషయంలో అధిష్టానంకు ఒక స్పష్టత వచ్చినట్లు సమాచారం. ఈ నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు మొదటి జాబితాలో ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నారు. మిగిలిన నియోజకవర్గాలలో సర్వేల ఆధారంగా ముగ్గురి పేర్లను ఎంపిక చేసి ఏఐసీసీ కు పంపనున్నారు. అందులో ఒక పేరును ఎంపిక చేసి అభ్యర్థిగా ఖరారు చేయనున్నారు.

తెరపైకి కుటుంబంలో రెండు టికెట్లు వ్యవహారం

వచ్చిన దరఖాస్తులను వడపోసేందుకు మంగళవారం కాంగ్రెస్ గాంధీభవన్లో సమావేశం నిర్వహించగా అందులో ఒకే కుటుంబంలో రెండు టికెట్ల వ్యవహారం చర్చకు వచ్చింది. రెండు టికెట్ల వ్యవహారంపై ఢిల్లీ అధిష్టానానికి చెప్పాలని ఉత్తంకుమార్ రెడ్డి రేవంత్ రెడ్డిని సూచించగా తనను డిక్టేట్ చేయెుద్దని చెప్పారు. మహేష్ గౌడ్ ఉత్తంకుమార్ రెడ్డి ల మధ్య కొంత మాటలు యుద్ధం జరిగినట్లు తెలిసింది. ఈ విషయంపై సమావేశంలో ఉత్తమ్ దంపతులు గతంలోనే పోటీ చేశారని అందులో కొత్తేమి లేదన్నారు. జానారెడ్డి తన కుమారుల కోసం దరఖాస్తు చేయించారని చెప్పారు. ఒకే కుటుంబంలో రెండు టికెట్లు వ్యవహారం అధిష్టానం చూసుకుంటుందని పీసీసీ కార్యవర్గం స్పష్టం చేసింది.

పొత్తు కుదిరితే మిర్యాలగూడ, మునుగోడు వామపక్షాలకు

ఇండియా కూటమిలో భాగస్వామ్యం ఉన్న వామపక్షాలతో పొత్తు కుదుర్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తుంది. అందులో భాగంగానే కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికే సీపీఐతో అనధికారికంగా చర్చలు జరిపింది. అందులో సీపీఐ ప్రధానంగా నాలుగు స్థానాలు కోరగా రెండు స్థానాలు ఇచ్చేందుకు కాంగ్రెస్ సూత్రపాయంగా అంగీకరించినట్లు సమాచారం అందులో ఉమ్మడి నల్గొండ జిల్లాలో మునుగోడు నియోజకవర్గం ఉన్నట్లు ప్రచారం నడుస్తుంది. అలా జరిగితే సీపీఐకు ఆ స్థానం మొదలుపెట్టే అవకాశం ఉంది. రేపో, మాపో సీపీఐ(ఎం)తో కాంగ్రెస్ చర్చలు జరపనుంది. చర్చలు సఫలమయితే జిల్లాలో మిర్యాలగూడ స్థానం సీపీఐ(ఎం) కేటాయించే అవకాశం ఉంది. మిగిలిన 10 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుంది.

కాళేశ్వరం ప్రాజెక్టు, యాదగిరిగుట్ట డెవెలప్‌మెంట్ భూసేకరణ పై కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ- భువనగిరిరూరల్



యాదాద్రి భువనగిరి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు, ట్రిబుల్ ఆర్, టీఎస్ఐఐసీ, యాదగిరిగుట్ట డెవలప్‌మెంట్ భూసేకరణపై జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మినీ మీటింగ్ హాల్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా చివరి సంక్షేమ సమావేశంలో ఇచ్చిన ఆదేశాలు అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో మునిగిపోతున్న తిమ్మాపురం, లప్ప నాయక్ తండ, చోక్లా నాయక్ తండాలకు సంబంధించిన భూ సేకరణ త్వరగా పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూమి నష్టపరిహారం త్వరలో చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. రివ్యూ మీటింగ్ లో కాళేశ్వరం ప్రాజెక్టు 14, ప్యాకేజీ 15, ప్యాకేజీ పదారి యొక్క కెనాల్స్ భూసేకరణ వేగవంతం చేయాలని ఎస్‌డీసీ శేఖర్ రెడ్డిని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రాజెక్ట్ ఎస్సీ శ్రీనివాస్, ఆర్డీవో అమరేందర్, ఈ ఈ కుర్షీద్, ఎస్ డి సి శేఖర్ రెడ్డి, నాగలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గౌరవప్రదంగానే రాజకీయాల నుండి తప్పుకుంటా

- కేసీఆర్ మూడవసారి సీఎం కావడం ఖాయం
- టికెట్ ఎవరికీ ఇచ్చినా గెలిపించాల్సిందే
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

గౌరవ ప్రదమైన బాధ్యతల్లో ఉన్నాను. గౌరవ ప్రధంగానే రాజకీయాల నుండి తప్పుకుంటాను.. మూడవ సారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం.. బీఆర్ ఎస్ పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించాల్సిందే. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు అందరిని కలుపుకొని వెళుతూ సమన్వయం చేసుకొంటూ ముందుకు వెళ్లాలని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో మీడియా చిట్ చాట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ పార్టీల్లో అయిన చిన్న చిన్న భేదాభిప్రాయాలు సహజంగా ఉంటాయి. అవన్నీ వీడి అందరం కలిసి కేసీఆర్‌ని మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలి అంటే అభ్యర్థులను గెలిపించాలి. అందర్నీ కలుపుకు పోయే బాధ్యత పోటీ చేసే అభ్యర్థుల మీద ఉంది. నేనేవరి పనుల్లో జోక్యం చేసుకొను. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్స్ అన్నీ ఆచరణ యోగ్యత కానివి. ప్రజలు వారి హామీలు నమ్మవద్దు. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ ఆరోపణలు, కేసులు లేవని తెలిపారు. రాజకీయాల్లో ఓపిక, సహనంతో ఉంటే కచ్చితంగా ఫలితం వస్తుంది. అప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా, తమ అభిమానంతో ప్రజలు ఓట్లు వేస్తారు. తమ మధ్య ఉండే సమస్యలను కొంత మంది నేతలు కులాలకు ఆపాదిస్తున్నారని పేర్కొన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత

- అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రవీంద్రకుమార్ శంకుస్థాపన

నవతెలంగాణ-దేవరకొండ



మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక హంగులతో సమూల మార్పులకు, విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తున్నారని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు - మన బడి కార్యక్రమం రూ.2.06కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం ప్రగతి బాటలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అల్లంపల్లి నర్సింహ, వైస్ చైర్మెన్ రహత్ హత్, ఆర్డీవో శ్రీరాములు, కౌన్సిలర్లు ముడవత్ జయప్రకాష్ నారాయణ, మహమ్మద్ రైస్, తస్మీన్ సుల్తానా, ఏఈ లష్కర్, బొడ్డుపల్లి కృష్ణ, చాట్ల రాములు, బాబా, ఆఫ్రోజ్, పొట్ట మధు, జమీర్, ప్రధానోపాధ్యాయులు నాళ్ళ గోవర్ధన్, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు అందరికి సమానంగా అందించాలి

- గద్దర్, జహీర్ అలీఖాన్ సంస్మరణ సభలో నాయకులు

నవతెలంగాణ-మిర్యాలగూడ



రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కులు అందరికి సమానంగా కల్పించబడాలని ప్రొఫెసర్ ఖాసీం, ప్రొఫెసర్ అన్వర్ పాషా, తత్వవేత్త జేబీ రాజు, గాదె ఇన్నయ్య, పాశం యాదగిరి, వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద గద్దర్, జహీర్ అలీ ఖాన్ స్ఫూర్తి సభ నిర్వహణ కమిటి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం ప్రజలను ఆట పాటల ద్వారా చైతన్య చేశారన్నారు.విమలక్క పాట పలువురిని ఆకట్టుకుంది. కులవ్యవస్థ పోవాలని, అసమానతలు తొలగలని పోరాడిన యోదులు గద్దర్, జహీర్ అలీ ఖాన్ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంబటి నాగయ్య, డాక్టర్ మువ్వ రామారావు, కస్తూరి ప్రభాకర్, మాలోత్ దశరథ్ నాయక్, తల్లపల్లి రవి, మల్లేష్, డాక్టర్ రాజు, డేగ విటి, హమీద్, డీఎం పాల్, మారం శ్రీనివాస్, జ్వాలా వేంకటేశ్వర్లు, చేగొండి మురళీయాదవ్ పాల్గొనగా ప్రజా నాట్యమండలి రాష్ట కార్యదర్శి నర్సింహా ఆట పాటలు పలువురిని ఆకట్టున్నాయి.

మంత్రి జగదీష్‌రెడ్డిపై గరంగరం

- ఏకమవుతున్న యాదవ సంఘం నేతలు
- కక్షసాధింపు చర్యలు ఆపాలంటూ హెచ్చరిక
- వట్టెపై అక్రమ కేసులు సరికాదంటున్న బీసీ నేతలు
- ఇన్నాళ్లూ భూకబ్జాలు కనబడలేదా..?
- ఎన్నికల ముంగిట యాదవుల తలనొప్పి

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల వేళ మంత్రి జగదీష్‌రెడ్డికి తలనొప్పులు తప్పడం లేదు. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎదురుతిరిగిన నేతలను అణచివేసుకుంటూ వస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మరో కొత్త చిక్కు మంత్రి జగదీష్‌రెడ్డిని వేధిస్తోందనే చెప్పాలి. ఇన్నాళ్లు మంత్రి ప్రధాన అనుచరుడిగా ఉంటూ వచ్చిన డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌పై ఒకేరోజు 71 కేసులు నమోదు చేయించి.. కక్షసాధింపు చర్యలకు మంత్రి ఆజ్యం పోశారనే విమర్శలు లేకపోలేదు. దీనికి బలం చేకూరుస్తున్నట్టుగా ఇన్నాళ్లు తనకు అనుకూలంగా ఉంటే రాని వ్యతిరేకత.. మంత్రిని విమర్శించిన రెండు రోజులకే వట్టె జానయ్యయాదవ్‌పై అక్రమాలు పుట్టగొడుగుల్లా తెరపైకి ఎందుకొస్తున్నాయో తెలియని విషయం కాదు.

బీఆర్ఎస్‌కు తప్పని యాదవ ఎఫెక్ట్..

ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగానూ యాదవ ఓట్లు అధికంగానే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో 20 వేల నుంచి 30వేల వరకు ఓట్లు లేకపోలేదు. ఇదిలావుంటే.. డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ అక్రమాల సంగతి పక్కన పెడితే.. ఇటు యాదవ సంఘంలోనూ.. అటు సూర్యాపేట నియోజకవర్గంలోనూ మంచి పట్టు ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యాదవ ఓటర్లను ప్రభావితం చేసే అనుచరగణం జానయ్య యాదవ్ సంపాదించు కున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వట్టె జానయ్యయాదవ్‌పై మంత్రి జగదీష్‌రెడ్డి కావాలనే కుట్ర చేస్తున్నారనేది బహిరంగ రహస్యమని రాజకీయ వర్గాల్లో ఎక్కడా చూసినా ఇదే చర్చ కన్పిస్తోంది. దీంతో ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు యాదవ సామాజిక వర్గం నుంచి పెద్దఎత్తున తిరస్కరణ ఎదురయ్యేలా ఉంది.

ఏకమవుతున్న బహుజన వర్గాలు..

నిజానికి సూర్యాపేట నియోజకవర్గంలో వట్టె జానయ్యయాదవ్ మంచి బలమైన నేతని చెప్పొచ్చు. మొదటి నుంచే జానయ్యయాదవ్‌పై కొన్ని భూకబ్జా ఆరోపణలు విన్పించాయి. రియల్ ఎస్టేట్ వ్యాపార కోణంలో చూస్తే.. మంత్రికి సన్నిహితులపై ఇంతకంటే ఎక్కువ భూకబ్జా ఆరోపణలు ఉన్నాయనే ప్రచారం లేకపోలేదు. మంత్రికి అత్యంత సన్నిహితుడుగా చెప్పుకునే రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఓ నేత విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన పిల్లలమర్రి గ్రామానికి వెళ్లే స్టేజీకి సమీపంలో పెద్ద రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ నుంచి ఇరిగేషన్ కాల్వ(సాగునీటి కాల్వ) ఉండగా, దాన్ని దారి మళ్లించి.. సిమెంటు కాంక్రీట్ వేసి చిన్నగా చేశారు. పేరుకు కాల్వను బలంగా చేశామని చెప్పినప్పటికీ.. పెద్ద వరద వస్తే.. మాత్రం వెంచర్‌లోకే నీరు వెళుతుంది. పంట పొలాలకు వెళ్లడం కష్టతరమవుతుంది. మరీ దీనిపై మంత్రి జగదీష్‌రెడ్డి మౌనం వహించడం గమనార్హం. ఈ క్రమంలోనే బహుజన వర్గాలు ఏకమై మంత్రి తీరును తప్పుపడుతుండడం కొసమెరుపు.



బీఆర్ఎస్ అధిష్టానానికి చేరినట్టేనా..

సూర్యాపేట నియోజకవర్గంలో మంత్రి జగదీష్‌రెడ్డి కక్షపూరితంగా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌పై చేస్తోన్న అక్రమ కేసుల పర్వం వ్యవహారం చిలికిచిలికి గాలివానలా మారుతుందా..? అంటే అవుననే సమాధానమే విన్పిస్తోంది. ఈ మొత్తం వ్యవహారం బీఆర్ఎస్ అధిష్టానం దృష్టికి వెళ్లినట్టు తెలుస్తోంది. దీనికితోడు వట్టె జానయ్యయాదవ్‌పై కక్షతో ఆయన అనుచరులను కేసుల్లో ఇరికించి ఎక్కడికి తీసుకెళ్లారో తెలియడం లేదంటూ వారి తల్లిదండ్రులు సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేసిన వీడియోలు వైరల్‌గా మారాయి.ఇవి సైతం అధిష్టానం దృష్టికి వెళ్లాయని తెలుస్తోంది. అయితే బీఆర్ఎస్ అధిష్టానం బీసీ కోణంలో నష్టపోతామని భావిస్తుందా..? లేక మంత్రి జగదీష్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తుందా..? అన్న సంగతి వేచిచూడాల్సిందే.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమ్మనబోలు హోమియోపతి వైద్యులు డాక్టర్ ముబీన పేర్కొన్నారు. మండల పరిధిలోని అమ్మనబోలు గ్రామంలో బుధవారం హోమియోపతి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలు సీజనల్ వ్యాధులైన కండ్ల కలక, చర్మ వ్యాధులు, డెంగ్యూ, వ్యాధుల పట్ల గురికాకుండా ఉండేందుకు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వివరించారు. ప్రతి పాఠశాలలో సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ వ్యాధులు రాకుండా హోమియోపతి మందులు ఇస్తున్నామని పేర్కొన్నారు.

శ్రీ కృష్ణవేణిలో రాఖీ వేడుకలు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో గల శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాలలో బుధవారం ఆ పాఠశాల విద్యార్థులతో అన్నాచెల్లెళ్లకు ప్రతిక అయిన రాఖీ పౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అన్నాచెల్లెళ్ల రాఖీ పండుగ విశిష్టతను ఆ పాఠశాల కరస్పాండెంట్ మట్ట చెన్నయ్యగౌడ్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ మట్ట సబిత, నరేందర్‌రెడ్డి, కోటేశ్వరి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ వేతనాలు ఉండేలా చూడాలి

- దండంపల్లి సత్తయ్య

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



పారిశ్రామిక కార్మికులుగా ఉన్న ఆర్టీసీ కార్మికుల వేతనాలు ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ ఉండేలా చూడటం, అమలులో ఉన్న అలవెన్సులను పూర్తిగా కొనసాగించాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ నల్లగొండ డిపో గౌరవాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన ఆర్టీసీ విలీనం- ఆంధ్రప్రదేశ్ అనుభవాలు అనే బుక్ లెట్‌ను నల్లగొండ డిపోలో ఆవిష్కరించిన అనంతరం ఆర్ఎం శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ఆర్టీసి కార్మికులు పారిశ్రామిక కార్మికులని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పని పరిస్థితులకు, ఆర్టీసి కార్మికుల పని పరిస్థితులకు పూర్తి తేడా ఉంటుందన్నారు. ఆర్టీసి కార్మికులకు 2017, 2021 సంవత్సరాలలో రావలసిన వేతన ఒప్పందాలను అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక వివాదాల చట్టం- సెక్షన్ 12 (3) క్రింద ఒప్పందం చేసుకొన్నా విలీనం అనంతరం కూడా ఆ అలవెన్సులు, సౌకర్యాలను కొనసాగిస్తూనే, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న మెరుగైన సౌకర్యాలు, అలవెన్సులు ఆర్టీసీ కార్మికులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నల్లగొండ రీజియన్ అధ్యక్షులు కందుల నరసింహ, చంద్రమౌళి, డిపో కార్యదర్శి బోడ స్వామి, రీజియన్ సహాయ కార్యదర్శి శ్యాంసుందర్, రాములు, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి'

రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెంచిన వేతనాలను చెల్లించుటకు బడ్జెట్ వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లును తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నల్లగొండ దేవరకొండ రోడ్డులో గల బాలుర ఉన్నత పాఠశాలలో కార్మికులతో కలసి సమస్యలకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2022 మార్చి 15న గౌరవ ముఖ్యమంత్రి అసెంబ్లీలో మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు ప్రస్తుతం పొందుతున్న వేతనంపై అదనంగా రూపాయలు 2000 పెంచుతున్నట్లు ప్రకటించారు. యూనియన్ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా జీవో ఎంఎస్ నెంబర్ 8 ని విడుదల చేసింది కానీ కార్మికులకు పెరిగిన జీతం ఇంతవరకు ఇవ్వలేదని, పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వలేదని కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే బిల్లులు విడుదల చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వంటకు సరిపడా గ్యాస్ను సబ్సిడీపై ఇవ్వాలని, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని అంగన్వాడీ కేంద్రాల మాదిరిగా గుడ్లు సరఫరా చేయాలని ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, తదితర డిమాండ్లను పెరిగిన వేతనం సాధన కోసం ఇతర సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 4వ తేదీన అన్ని మండల కేంద్రాలలో, సెప్టెంబర్ 13వ తేదీ చలో కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు కోయగూర పద్మ, అలివేలు, సైదమ్మ వెంకటమ్మ, రామణా, తదితరులు పాల్గొన్నారు.

వెలవెల బోయిన పెద్ద వాగు..!

- కనుమరుగైన జలాలు
- ఎక్కడ చూసినా బండరాళ్లు గుట్టలే
- వంద ఏండ్లుగా ఎప్పుడు కనిపించని గద్దలగుట్ట దర్శనం



నవతెలంగాణ-పెద్దవూర

నల్లగొండ జిల్లాలోని 11 మండలాలు 220 గ్రామాల్లో 40వేల మంది రైతుల పశువులకు తాగునీరు , సాగునీటిని అందిస్తున్న ఈ వాగు నేడు వర్షాలు లేక, వరదలు రాక వెలవెల పోయింది. ఎక్కడ చూసినా బండ రాళ్లు, రాళ్లగుట్టలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని కనెగల్, నల్లగొండ, గుర్రంపోడ్, పీఏపల్లి, పెద్దవూర, అనుముల, తిరుమలగిరి సాగర్, నిడమనూరు, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాలలోని చిన్న చిన్న వాగులు అన్ని ఈ పెద్దవాగులో కలవాల్సిందే. రెండు వందల గ్రామాలు 40,000 మంది రైతులు ఉన్నారు. ఎకరం నుంచి 10ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు 25,000 మంది రైతులు ఉన్నారు. ఈ వాగు కింద స్వర్గధామంగా ఉండేది. కానీ ఈరోజు అందులో చుక్క నీళ్లు లేవు.. కనీసం పశువులకు తాగునీల్లు కూడ లభించని దుస్థితి ఏర్పడింది. తిరుమల సాగరం, సాగర్ నేతాపురం గ్రామంలో దుర్గా ఆలయం ఈ వాగు పక్కనే వుంది. ఈ వాగు అవతల గద్దలగుట్ట అనే ఒక పెద్ద రాళ్ళ గుట్ట ఉంది. ఇది ఇంతవరకు ఎప్పుడు అక్కడి ప్రజలకు కనిపించేది కాదు. ఎప్పుడు చూసినా నీళ్లతో మునిగి రకరకాల పక్షులతో, గుంపులు, గుంపులుగా గద్దలు కనిపించేవి. కానీ ఇప్పుడు అవి కూడా కనిపించక నిర్మానుష్యంగా ఉంది. గత 20 ఏండ్ల క్రితం 2003లో ఒక్కసారి మాత్రం ఇదే పరిస్థితి నెలకొంది. కానీ ఆగస్టులో వచ్చిన వర్షాలు మాత్రం మళ్ళీ నిండిపోయి జలకల సంతరించుకుంది. కానీ నేడు ఎన్నడూ లేని విధంగా ఈసారి వర్షాలు పడకపోవటంతో వాగు ప్రాంతం అంతా నీళ్ల లేక బండ రాళ్ళు, రాళ్ళ గుట్టలు కనుచూపు మేరలో కనిపిస్తున్నాయి. ఆగస్టులో కూడా వర్షం జాడేలేదు. దీంతో రైతులు మనోవేదన చెందుతు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

వాగులో నీళ్లు లేక పొలాలు ఎండుతున్నాయి..

అలుగుల సైదిరెడ్డి(నేతాపురం)



వర్షాలు పడి వాగులో నీళ్ల వస్తాయని 9 ఎకరాలు వరి సాగు చేశాను. ఆగస్టు అయిపోయింది. ఇంత వరకు వర్షాలు కురవక వాగు ఎండిపోయి బండరాళ్ల కనిపిస్తున్నాయి. అప్పటికి డ్రమ్ము సీడ్స్ పద్ధతిలో వరి సాగుచేసిన ఫలితం లేదు. పొలం అంత ఎండిపోయింది. ఎకరానికి 20 వేలు ఖర్చు వచ్చింది. 2 లక్షల అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

ఈసారి తిండికి గింజలు కూడా కష్టం గానేవుంది

కత్తి కక్కిరెడ్డి (కక్కయ్య గూడెం)



మూడేకరాలు వరి సాగు చేశాను. వాగులో చుక్కనీళ్లు కూడా లేవు. వాగులో నీళ్ల లేక బోర్లు కూడా పోయడం లేదు. కనీసం తిండికి గింజలకు కూడా ఈసారి ఇబందిగా ఉంది. ఆగస్టు అయిపోయిన వర్షాలు లేక వాగు ఎండిపోయింది. కనీసం పశువులు, మేకలు, గొర్లకు కూడా తాగేందుకు నీళ్ల వాగులో లేవు.

ఓటర్ నమోదుపై ప్రత్యేక క్యాంపెయిన్

- అక్టోబర్ 4న తుది ఓటర్ జాబితా
- కలెక్టర్ కర్ణన్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాలలో సెప్టెంబర్ 2, 3 తేదీలలో ఓటర్ జాబితాలో ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులపై ఎన్నికల సంఘం ఆదేశాల ననుసరించి ప్రత్యేక క్యాంపైన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్‌లో ఓటర్ నమోదు కార్యక్రమాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 2, 3 తేదిలలో ప్రత్యేక క్యాంపెయిన్ సందర్భంగా బీఎల్ఓలు పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉంటారని, ఓటర్ జాబితాలో నమోదు కాని 1అక్టోబర్ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ఓటర్లను నిర్దీత ఫారంల ద్వారా ఓటర్‌గా నమోదు చేయనున్నట్లు, స్పెషల్ క్యాంపైన్ గురించి విస్తృత ప్రచారం గావించాలని తెలిపారు. బిఎల్ ఓలు,బూత్ లెవెల్ ఏజెంట్‌లు పాల్గొనాలని ఆయన కోరారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా కేంద్రాలలో బీఎల్‌వోలకు సహ కరించాలని కోరారు. ప్రతి బుధవారం నియోజకవర్గం స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో ఆర్ఓ కార్యాలయం వద్ద ఈవియం ప్రదర్శన కేంద్రం ఏర్పాటు చేసినట్లు, ప్రతీ నియోజకర్గస్థాయిలో ఒక మొబైల్ వాహనం ద్వారా ఈవీఎం, వీవీ ఫ్యాట్ యంత్రంల ద్వారా ఓటు వేయడంపై అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు.

రెండవ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2023 కార్యక్రమంలో భాగంగా 2023 అక్టోబర్ ఒకటవ తేదీ అర్హత తేదీగా ఈ నెల 21 న ముసాయిదా ఓటర్ జాబితా ప్రకటించినట్లు తెలిపారు. ఈ నెల 21 నుండి సెప్టెంబర్ 19 వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, 2023 సెప్టెంబర్ 28 వ తేదీలోగా విచారణ చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం అనుమతి తో 2023 అక్టోబర్ అక్టోబర్ 4 న తుది ఓటర్ జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 13,84,525 మంది ఓటర్‌లు ఉండగా పురుషులు 6,90,072, మహిళలు 6,94,335, ట్రాన్స్ జెండర్‌లు18 మంది ఉన్నారని తెలిపారు. సర్వీస్ ఓటర్‌లు 543 మంది కాగా పురుషులు520 మంది, మహిళలు 23 మంది ఉన్నట్లు తెలిపారు. ఆగస్ట్ 26, 27 తేదీలలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఫారం 6, 7, 8 ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులపై 5,823 దరఖాస్తులు అందాయని తెలిపారు. జిల్లా లోని అన్ని పోలింగ్ బూత్ లలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ.నర్సిరెడ్డి (సిపిఐ (ఎం)), బక్క పిచ్చయ్య (బీఆర్ఎస్), పోతేపాక లింగస్వామి (బీజేపీ), శంకర్‌నాయక్, (కాంగ్రెస్) యాదగిరి, (బీఎస్పీ), కుతు బుద్దిన్(ఏఐఎంఐఎం), మల్లికార్జున్ (టీడీపీ), కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణ మూర్తి, ఎన్నికల డీటీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

నవతెలంగాణ-నాంపల్లి



పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లి మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మండల పంచాయతీ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులకు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మద్దతు తెలిపి మాట్లాడారు. జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి పల్లేటి హరికృష్ణ, కార్యవర్గ సభ్యులు అబ్బనబోయిన వెంకటయ్య స్వామి, యాదగిరి, రవి, మరియమ్మ, ఎల్లయ్య గణేష్, వెంకటయ్య, లక్ష్మయ్య, సబిత, సులోచన, పార్వతమ్మ, ఈరమ్మ, బిక్కు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులివ్వాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి
- డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణలో అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి కోరారు. బుధవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ఎంతోమంది పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కొత్తగా పెళ్లయిన దంపతులు రేషన్ కార్డు లేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని చెప్పారు. వెంటనే కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలన్నారు. లేనిపక్షంలో పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-హాలియా



అంగనివాడి టీచర్లను ఆయాలను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అవుతా సైదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హాలియాలో ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు నిరువదిక సమ్మెలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ సువర్ణకి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లు మరియు ఆయాల సేవలు మరువలేనివని శిశు మరణాలను తగ్గించడంలో వీళ్ళ పాత్ర కీలకంగా ఉంది కానీ వీరికి వేతనం చెల్లించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. పెరిగిన ధరల కనుక్కునంగా కనీస వేతనం 26,000 గా నిర్ణయించి అమలు చేయాలని,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్ డ్యూటీ చెల్లించాలని కోరారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లేనియెడల సెప్టెంబర్ 11 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళతామని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు రాజ్యలక్ష్మి, అచ్చమ్మ, ఆండాలు, వజ్రమ్మ పద్మ, విజయ, నారాయణమ్మ, అంజమ్మ, శారద, పద్మ రమణ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి పట్టణంలో అంగన్వాడిని టీచర్లు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఒంటెపాక వెంకటేశ్వర్లు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పొడిచేటి నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీడీపీఓ అంజు ఆశ్రను కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు సిహెచ్ సుభాషిని, ఒంటెపాక లలిత, జాజుల గౌరమ్మ లతీఫా బేగం, అన్నపూర్ణ, సుజాత పాల్గొన్నారు.

నిత్యవసరాలను రేషన్ ద్వారా పంపిణీ చేయాలి

నవతెలంగాణ-నకిరేకల్



రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల వస్తువులను పంపిణీ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెన్నబోయిన నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం శాలిగౌరారం మండల కేంద్రంలో ఐద్వా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు పెరగడంతో గర్భిణీలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనతకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రజా పంపిణీ ద్వారా 14 రకాల వస్తువులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఇందిరా, ప్రతినిధులు వెంకటమ్మ, పూలమ్మ,, లక్ష్మమ్మ, అంజమ్మ, మౌనిక, యాదమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.



బ్రాహ్మణ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ పట్టణంలో రూ. 15 లక్షలతో నిర్మించనున్న బ్రాహ్మణ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయాల్లో ధూప, దీప నైవేద్య పథకం కింద అర్చకులకు ఇస్తున్న రూ. 6 వేలను రూ. 10వేలకు పెంచి సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మెన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మాద నగేష్‌గౌడ్, ప్రగడపు నవీన్‌రావు, సైదిరెడ్డి, అధ్యక్షులు పగిడిమర్రివెంకటేశ్వర శర్మ ప్రధాన కార్యదర్శి మధు శర్మ ప్రతినిధులు దుర్గి మురళీధర్ శర్మ, ఎన్ కృష్ణ చంద్రమౌళి, వావిలాల రామలింగయ్య, వావిలాల నగఫణీ, నవీన్ సూరి, ఎన్ సోమేశ్వర్ శర్మ, ఆనంద్ గార్లపాటి మోహన్ రావు, కాటేపల్లి శ్రీనివాస శర్మ కృష్ణమూర్తి శర్మ, సాయి నాగభరద్వాజ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మర్రిగూడ

సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ ఒకటవ తేదీన యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని, మర్రిగూడ మండలం నుండి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కే. కృష్టారెడ్డి, మండల అధ్యక్షులు పీ.పరమేశ్వరి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్టారెడ్డి మాట్లాడుతూ ఐఆర్డీఏ చట్టాన్ని రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్ వర్తింపజేయాలని, నూతన జాతీయ విధానం రద్దు చేయాలని, ఐటీ మినహాయింపు పరిమితులు పెంచాలని, బదిలీలు పదోన్నతులు నిర్వహించాలని తదితర డిమాండ్లతో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎన్. శ్రీనివాసరావు, పీ.స్వప్న, కోశాధికారి బీ.యాదయ్య, జిల్లా ప్రతినిధులు డీ.సుందరయ్య, బీ.దీవంత, జీ.వాసుదేవరావు, ఎస్.వెంకట్ కుమార్, కుటుంబ సంక్షేమ నిధి మండల కన్వీనర్ బీ. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల ఐటీ హబ్, ఎస్ఎల్‌బీసీ కెనాల్ మధ్య ఉన్న రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణచారి సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం ఐటీ హబ్, రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ రెండో వారంలో ఐటీ హబ్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నందున్న ఐటి హబ్ నుండి ఉదయ సముద్రం వరకు నిర్వహించే రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల పక్కనే ఉన్న వైకుంఠధామంలో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. మొక్కలు నాటాలని హరితహారం సిబ్బందికి, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ దిలీప్, ఎస్ఐ శ్రీనివాస్, రోడ్డు కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 19 వరకు ఓటు దరఖాస్తు

- రాజకీయ పార్టీలతో ఆర్డీఓ సమావేశం

నవతెలంగాణ-మిర్యాలగూడ



18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని దీనికి సెప్టెంబర్ 19 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్‌డీఓ బీ.చెన్నయ్య తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలకుగాను ఓటర్ జాబితాలో సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల నిండిన వారు, ఓటు హక్కు లేని వారు కొత్తగా ఓటును నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి బుధవారం పోలింగ్ బూతుల వారిగా వచ్చిన దరఖాస్తులను రాజకీయ పార్టీలకు వివరించనునట్లు తెలిపారు. 19వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రశాలలో విచారించి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఓటు నమోదు చేస్తామన్నారు. అక్టోబర్ మొదటి వారంలో తుది ఓటర్ జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో కూడా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీవో చెన్నయ్య కోరారు. బుధవారం స్థానిక విజేత కళాశాలలో ఓటు హక్కు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, ముఖ్యంగా యువకులు ఓటు ను నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో యువకులు స్వచ్ఛందంగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. బాధ్యతగా యువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

రాఖీపౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-మిర్యాలగూడ



అబ్యాస్ పాఠశాలలో బుధవారం ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో 4 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులతో నాకు నువ్వు రక్ష, నేను నీకు రక్ష అంటూ ఒకరికి ఒకరు భరోసానిచ్చుకున్నారు. అందరూ సోదర బావతంతో ఉండలని పాఠశాల చైర్మెన్ వంగాల నిరంజన్‌రెడ్డి కోరారు. పండుగల ప్రముఖ్యత గురించి విద్యార్థులు అవగాహన కల్గివుండలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వంగాల పుష్పలత, ప్రిన్సిపాల్ అప్పాల పాండు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దామరచర్ల : దామరచర్ల మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాఖీపౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వీరన్న, శివకుమార్, శ్రీధర్, మహేష్, గణేష్, అనిత, శిరీష, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సన్ షైన్ హైస్కూల్‌లో రాఖీ సంబరాలు

చండూరు : స్థానిక సన్ షైన్ హైస్కూల్లో బుధవారం ఘనంగా రాఖీ వేడుకలు విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు ఆ స్కూల్ కరస్పాండెంట్ కోడి వెంకన్నకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఖీ ప్రాముఖ్యత గురించి విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించి వేప చెట్లు తొలగింపు

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామపంచాయతీ పాలకవర్గం చెట్లు పెంపకం నిబంధనలు ఉల్లంఘించి ఏకపక్షంగా వేప చెట్లు కొట్టి వేయడాన్ని సీపీఐ(ఎం) మండల నాయకులు లడే రాములు తీవ్రంగా ఖండించారు. చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం గత 15 సంవత్సరాల పైబడి ప్రభుత్వం, గత పాలక వర్గాలు పెంచిన వేప చెట్లను కొమ్మలు తొలగించడం మానేసి చెట్లమొదలు కొట్టి వేయడం పెట్టాడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెట్లు పెంచే కార్యక్రమాలు చేపట్టినా ఎలాంటి తీర్మానం లేకుండా ఆరెగూడెం గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు భారీ చెట్లను తొలగించడం అన్యాయమని విమర్శించారు. సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలను పాలకవర్గం బలపరుస్తుందా అని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ సెక్రటరీ తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండడం విడ్డూరంగా ఉన్నదని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ(ఎం) ఆందోళన చేయవలసి వస్తుందని రాములు హెచ్చరించారు.

సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

రెండవ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించి రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుగులోత్ రాజారామ్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ముందు రెండవ ఏఎన్ఎం సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎం జిల్లా నాయకురాలు మేడే లక్ష్మి బాయి, ఏఐటియుసి జిల్లా నాయకులు కోట రామస్వామి, ఏఎన్ఎం నాయకురాలు స్వప్న, గోపమ్మ, రమాదేవి, గీత, విజయ, పార్వతి, జయమ్మ, పద్మ, రజిని, రప, శిరోమణి ,నాగమ్మ, బేబీ, ఎల్లమ్మ ,యశోధ,ఉమారాణి, రజిత, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి హోమం

నవతెలంగాణ-చివ్వెంల

మండలపరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో బుధవారం నిజశ్రావణమాస పౌర్ణమి సందర్భంగా శ్రీఉండ్రుగొండ లక్ష్మీనర్సింహాస్వామి స్వామి ఆలయంలో శ్రీ హయగ్రీవ మరియు సుదర్శన సమేత శ్రీలక్ష్మీనర్సింహాహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీమాన్ అఖిలేశ్వరాచార్యులు, ఆలయపూజారులు శ్రీమాన్ కృష్ణమాచార్యులు,ఆలయ అభివృద్ధికమిటీ అద్యక్షులు శ్రీ కృష్ణకుమార్,మధుసూదన్‌రావు, శ్రీనివాస్, కృష్ణమోహన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు గృహలక్ష్మీ పథకం అందేలా చూడాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ మున్సిపల్‌పరిధిలో, నియోజకవర్గవ్యాప్తంగా అర్హులందరికీ గృహలక్ష్మీపథకం వర్తించేలా అధికారులు కృషి చేయాలని మూడో వార్డు కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి అన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హత లేని వారిని ఎంపిక చేసినట్టయితే ఆ పథకం లక్ష్యం నెరవేరదన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులకు అందే విధంగా అధికారులు చూడాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

నవతెలంగాణ-నేరేడుచర్ల

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందిన సంఘటన నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది.ఎస్సై పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన షేక్‌అలీ సైదా(65) నేరేడుచర్ల సెంటర్ నుండి నేతాజీనగర్‌లో గల తన ఇంటికి టీవీఎస్ ఎక్సెల్ AP24Q9331 మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మార్గమధ్యలో వ్యవసాయ మార్కెట్ వద్దకు చేరుకోగానే హుజూర్‌నగర్ వైపు నుండి మిర్యాలగూడ వైపు వెళ్తున్న స్విఫ్ట్ కారు UP32FP7316 యొక్క డ్రైవరు తన కారును అతివేగంగా జాగ్రత్తగా నడిపి టీవీఎస్‌ఎక్సెల్ బండికి వెనుక నుండి టక్కరి ఇవ్వగా అతని కాళ్లకు, తలకు, ఇతర చోట్ల తీవ్రమైన గాయాలయ్యాయి.చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని 108 అంబులెన్స్ ద్వారా మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు నిర్మాణపనులు ప్రారంభం

నవతెలంగాణ-తిరుమలగిరి

తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలం చింతలకుంటతండా గ్రామపంచాయతీ పరిధిలో సీసీరోడ్డు నిర్మాణపనులను బుధవారం జెడ్పీటీసీ దూపటి అంజలి రవీందర్, ,గ్రామసర్పంచ్ జాటోతు రవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బానోతు యాకుబ్‌నాయక్, సోడా ప్రవీణ్, ఉపసర్పంచ్ భాషానాయక్, గ్రామ అధ్యక్షులు నరేష్ పాల్గొన్నారు.

అనాథపిల్లలకు,మహిళలకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర ఉన్న పేద మహిళలకు,చిన్న పిల్లలకు దుప్పట్లు, పండ్లు,బిస్కెట్ ప్యాకెట్స్ సాయి సిరి సూపర్ మార్కెట్ వారి సౌజన్యంతో పంపిణీ చేశారు. నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన ఉన్న రోడ్డు వెంట ఇద్దరు మహిళలు కొంతమంది చిన్న పిల్లలు ఉన్నారని తెలుసుకొని వారికి ఎటువంటి భద్రత లేదని తెలిసి నేరేడుచర్ల ఎస్సై పరమేష్ వారి సిబ్బందితో వచ్చి వారిని సురక్షిత ప్రాంతం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో యారవ సురేష్,కర్నాకర్‌రెడ్డి, శంకరాచారి, దుర్గారావు, యశ్వంత్ పాల్గొన్నారు.



శ్రీరంగపురంలో జలాభిషేకం

- నేడు బొడ్రాయి పునర్‌ప్రతిష్ఠ కార్యక్రమం

నవతెలంగాణ-కోదాడరూరల్

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగపురం గ్రామంలో నేడు జరుగబోయే బొడ్రాయి పునర్‌ప్రతిష్ఠ, గ్రామదేవతల విగ్రహాలకు మహిళలు పెద్ద ఎత్తున జలాభిషేకం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు వనపర్తి లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరంగపురం గ్రామంలో గురువారం నిర్వహించే బొడ్రాయి, గ్రామదేవతల పునర్‌ప్రతిష్ఠకు పెద్దఎత్తున భక్తులు ప్రజలు హాజరై విజయవంతం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కందుల కోటేశ్వర రావు, కందుల చంద్ర శేఖర్, మాజీ కౌన్సిలర్ వనపర్తి సోమమ్మ, పిచ్చయ్య, బొడ్రాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు చేపట్టిన రీలే నిరహార దీక్షలో ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులందరికి ఉద్యోగభద్రత కల్పించి,కనీస వేతన స్కేలు, ప్రతి ఉద్యోగికి జీవిత భీమా రూ.10 లక్షలు,ఆరోగ్య భీమా రూ. 5 లక్షలు అందించాలని అన్నారు.విద్యాశాఖ నియామకాలలో వెయిటేజీ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రాంబాబు, కోశాధికారి లక్ష్మీనారాయణ, సయ్యద్, నాగరాజు, మదనాచారి, శీను, రవి, కోటేశ్వరావు, అంజన్, సరస్వతి, సునీత, ఉమా తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-నేరేడుచర్ల

మండల స్థాయి పాఠశాలల ఆటల పోటీలలో పాల్గొనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దిర్శించర్ల బాలబాలికలకు 30 మందికి ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ ఇన్‌చార్జి కుక్కల వెంకన్న క్రీడాదుస్తులు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు అధికంగా విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మౌళిక సదుపాయాల కొరకు ఓజో ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు.దిర్శించర్ల నందు రెండు పాఠశాలలకు మైక్ సెట్లను అందిస్తామని తెలిపారు. ఇదే సందర్భంలో ఇటీవల ఎస్ ఐ ఫలితాల్లో విజయం సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థి నన్నెపంగ వినయ్, గ్రామానికి చెందిన మల్లు సంజీవరెడ్డిలను ప్రధానోపాధ్యాయులు బట్టు మధు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ బాధ్యులు నాగుల్ మీరా అమీర్,సైదులు పీఎస్‌హెచ్‌ఎం కట్టామాధవి, ఉపాధ్యాయులు జి శ్రీదేవి, జె శ్రీనివాస్, ఎన్.విజయ్‌కుమార్, ఎం యాదగిరి, ఎన్ కోటిరెడ్డి, ఎస్ కె సబియా, శబీనా పాల్గొన్నారు.

పేటలో ఐడీబీఐ బ్యాంకు 100వ శాఖ ప్రారంభం

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

ప్రముఖ పారిశ్రామిక జిల్లాగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేట జిల్లాలో ఐడీబీఐ బ్యాంకు 100 వ బ్రాంచిని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని ఐడీబీఐ బ్యాంకు సీజీఎం, జోనల్ హెడ్ శరత్ కామత్ అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ సమీపంలో బ్యాంకుల సముదాయం వద్ద బుధవారం ఐడీబీఐ బ్యాంక్ బ్రాంచిని ఆయన ప్రారంభించారు.అనంతరం పలువురు వ్యాపారవేత్తలకు రుణాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వాసుదేవన్ డిప్యూటీ జోనల్ హెడ్‌నారెన్, ఏజీఎం అజిత్‌కుమార్, బ్రాంచి మేనేజర్, శివాని మేనేజర్, హీరో షోరూం డీలర్ రాచర్ల కమలాకర్,పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

పంటరుణాల లక్ష్యం చేరుకోవాలి

- ఉన్నత విద్యకు ఎక్కువ రుణాలు అందించాలి
- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్



జిల్లాలో పంట రుణాల లక్ష్యం చేరుకోవాలని బ్యాంకర్లను కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో నిర్వమించిన డీసీసీ, డీఎల్ఆర్సీ ప్రథమ త్రైమాసిక సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉద్యాన వన రైతులకు బ్యాంకర్లు ఎక్కువగా రుణాలు మంజూరు చేయాలని, ప్రభుత్వం అందించే సబ్సిడీ ఉద్యాన శాఖ ద్వారా లబ్దిదారులకు చెల్లిస్తామని తెలిపారు. ఆయిల్ ఫామ్ కింద ఈ సంవత్సరం 192 మంది రైతులు 830 ఎకరాలలో పంట సాగు చేస్తున్నారని వివరించారు. ఉపాధి హామీ కింద 2వేల ఎకరాల పామాయిల్ సాగు చేయించాలని పీడీని ఆదేశించారు.యువత ఉన్నత చదువుకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 లక్షల లోపు విద్యా రుణాలు అందించాలని,రుణాల మంజూరు కోసం ప్రజావాణిలో అందించిన దరఖాస్తులపై సత్వరమే బ్యాంకర్లు స్పందించాలని సూచించారు.రుణాల మంజూరులో లబ్దిదారులను బ్యాంకర్లు ఇబ్బంది పెట్టొద్దని తెలిపారు.రైతులకు అందించే పంట రుణాల లక్ష్యం పూర్తి కానందున సత్వరమే పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఈ వానాకాలంలో రైతు బంధు కింద 2,76,764 మంది రైతులకు రూ. 310.82 కోట్లు పెట్టుబడి సహాయం అందించామని అలాగే రుణమాఫీ కింద ఇప్పటి వరకు 48,884 మంది రైతులకు రూ.218 కోట్లు చెల్లించామన్నారు.ముద్ర పథకం కింద అందించే రుణాలు వికలాంగులకు కూడా అవకాశం కల్పించి వారి ఆర్థిక భరోసాకు చేయూత అందించాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల రుణాల కింద రూ.589.10కోట్ల లక్ష్యానికి రూ. 102.10కోట్లు అందించి 17.33 శాతం వృద్ధి సాధించామని తెలిపారు.ఈ సమావేశంలో ఎల్ డి ఎం బాపూజీ, ఆర్‌బిఐ ఏ జి ఎం తన్యా సంగ్మా, నాబార్డ్ ఏజీఎం సత్యనారాయణ, ఎస్‌బిఐ ఎజి ఎం జ్యోతి, డిసిసి బ్యాంక్ సీఈఓ మదన్‌మోహన్, ఏపీజీవీబీ ఏజీఎంలు శ్రీనివాసులు, విజయ్ భాస్కర్, వివిధ బ్యాంక్ మేనేజర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- జిల్లా అడిషనల్ పీడీ పెంటయ్య

నవతెలంగాణ-కోదాడరూరల్

ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ పీడీ పెంటయ్య అన్నారు.బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామీణ ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో



పాల్గొని ఆయన మాట్లాడారు.ప్రజా వేదికలో గ్రామాల వారీగా కూలీలకు చెల్లించిన వేతనాలు సక్రమంగా అందినట్లు తెలిపారు. 13వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ 16 గ్రామపంచాయతీలకు సంబంధించిన పనులు 113929957 రూపాయలు కాగా, కూలీల వేతనాలు 99691918 రూపాయలు, సామాగ్రి 14238039, ఫారెస్ట్ 1437170 ఖర్చులు అయ్యాయన్నారు.మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సామాజిక తనిఖీ ఈ నెల 15వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరిగింది అన్నారు. గ్రామానికి సంబంధించిన సిబ్బందిని కార్యదర్శిని వారు చేసిన పొరపాట్లను తెలిపారు.కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరించడం వలన వారికి పెనాల్టీ 76290 రూపాయలు ఫైన్ వేశామన్నారు.మస్టర్‌లలో సంతకాలు లేక నిర్లక్ష్యం వ్యవహరించిన సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, అంబుడ్స్‌మెన్ లచ్చీరాంనాయక్, గుడిబండ సర్పంచ్ అలివేలు మంగమ్మ, ఎంపీటీసీ శంకర్‌శెట్టి కోటేశ్వరరావు, ఎస్‌టీఎం అజయ్, రమేష్, ముత్తయ్య, రాజు, ఈసీ నాగేశ్వరరావు, ఏపీవో టానియా, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-తిరుమలగిరి

కళాసారధిలో పనిచేస్తున్న కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు 30శాతం పిఆర్సి జీవోను అమలు చేయడం పట్ల హర్ష వ్యక్తం చేస్తూ బుధవారం సూర్యాపేట జిల్లా కళాకారుల ఆధ్వర్యంలో తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్,కళాసారథి చైర్మెన్‌రసమయి బాలకిషన్, తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిషోర్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమకు పిఆర్సి అమలు చేయడంతో కళాకారుల కుటుంబాలన్ని సంతోషంగా గడుపుతాయన్నారు.కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని మరింత ఉత్సాహంతో పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పాలకుర్తి శ్రీకాంత్‌గౌడ్,గడ్డంఉదయ్,పల్లె రాము,డప్పు సుధాకర్,పాకఉపేందర్, బోనాలనరేందర్,గజ్జిమంజుల,కందమల్ల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ జిల్లా అధ్యక్షులు వేముల నరేష్ మేడిపల్లి వేణి ఆధ్వర్యంలో శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్,విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సాంస్కృతిక సారధి చైర్మెన్ రసమయి బాలకిషన్, తుంగతుర్తి శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్



అర్వపల్లిలో...

చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు వేముల నరేష్, మేడిపల్లి వేణు, సారథి డైరెక్టర్ హరికృష్ణ, కళాకారులు మాగి శంకర్ గడ్డం ఉదయ్ ఈర్ల సైదులు గంట బిక్షపతి పాలకుర్తి శ్రీకాంత్ పల్లెల రాములు డప్పు సుధాకర్ పాక ఉపేందర్ గజ్జి మంజుల కుందమళ్ళ నాగలక్ష్మి సిర్పంగి రాధ ఒంటె పాక ప్రియదర్శిని ఇంద్ర పాల్గొన్నారు.

గ్రామీణ కృషి అనుభవం ఎంతో ముఖ్యం



నవతెలంగాణ-చివ్వెంల

గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా అకాడమీ డిగ్రీ,పీజీ కళాశాల, సికింద్రాబాద్, యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ విధానాలు స్థితిగతులను తెలుసుకొని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ (పీఆర్ఏ) కార్యక్ర మం ద్వారా అధ్యయనం చేశామని కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన గ్రామీణ అవగాహనా సదస్సునుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ ప్రక్రియలో వ్యవసాయ విద్యార్థులు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను గురించి తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి గ్రామ పటం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు,వెన్ డయాగ్రమ్,పై చార్ట్,చిత్రాల రూపంలో ప్రదర్శించి గ్రామీణ రైతులకు అవగాహన కల్పించినట్లు తెలియజేసారు. గ్రామం యొక్క వనరులను గ్రామ పటం ద్వారా చిత్రీకరించి, గ్రామంలోని రైతుల వర్గీకరణ, జనాభా భౌగోళికప్రాంతం ,నీటి వనరులు, వ్యవసాయ దిగుబడులు, చీడ పీడల నివారణకు ఆచరిస్తున్న విధానాలు మొదలగు అంశాలపై, చార్ట్‌లో చిత్రీకరించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె శాస్త్రవేత్తలు నరేష్, ఆదర్శ్, రావే ప్రోగ్రాం ఇన్‌చార్జి నరేష్, గ్రామ సర్పంచ్ జూలకంటి సుధాకర్‌రెడ్డి,విద్యార్థినులు హిమజాశ్రీ దేవి, చింతల.గాయత్రి, సౌమ్య, నిమిషా, మేరీ శ్రీరమ్య, రైతులు సోమిరెడ్డి, సుధాకర్, శామ్యూల్, పద్మ, కోడి వెంకన్న, అంజిరెడ్డి, నాగరాజ్, రవి, రాములు, మలేష్, పాల్గొన్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి

నవతెలంగాణ-తిరుమలగిరి

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు పిలుపునిచ్చారు. బుధవారం తిరుమలగిరిలో మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.2014 ఎన్నికల సందర్భంగా నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన బిజెపి నాయకులు తొమ్మిది సంవత్సరాల కాలంలో అదనంగా ఉద్యోగాలు కల్పించక పోను పరిశ్రమలు మూసివేత ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం వలన సుమారు కోటి మంది ఉద్యోగాలు కోల్పోయి ఉద్యోగులుగా రోడ్డున పడ్డారని విమర్శించారు..గ్యాస్ సిలిండర్ ధరను రూ.400 నుండి రూ.1200 పెంచి నేడు రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూ.200 తగ్గిస్తున్నట్టుగా చేస్తున్నారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ,ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.మిట్టపల్లి



లక్ష్మీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గుమ్మడవెల్లి ఉప్పలయ్య, కడారి లింగయ్య, రాయల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'శ్రీఅరబిందో'లో ముందస్తు రాఖీ వేడుకలు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలపరిధిలోని అనంతారం గ్రామంలోని శ్రీ అరబిందో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం రాఖీ పౌర్ణమి ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు విద్యార్థులు రాఖీలను కట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు,కరస్పాండెంట్ షేక్ మస్తాన్ మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతులను, సంప్రదాయాలను కాపాడుకోవాలని, స్త్రీలను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగయ్య, స్వప్న, నరసింహ, జాన్‌బి, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.



మున్నూరుకాపు జర్నలిస్టు ప్లీనరీని విజయవింతం చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సెప్టెంబర్ 6వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మున్నూరుకాపు జర్నలిస్టుల ప్లీనరీ సమావేశానికి రాష్ట్రంలో పనిచేస్తున్న మున్నూరు కాపు జర్నలిస్ట్ సోదరులు భారీ ఎత్తున తరలిరావాలని జర్నలిస్టు సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూడి జనార్దన్‌పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పబ్లిక్‌క్లబ్‌లో నిర్వహించిన జర్నలిస్టులకు సంబంధించిన ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్నూరు కాపు జర్నలిస్టుల హక్కుల సాధనకై ఈ ప్లీనరీలో ప్రస్తుతం ప్రధాన సమస్యలైన ఇళ్ల నిర్మాణం, హెల్త్‌కార్డు,అక్రిడిటేషన్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏర్పాటు తీర్మానాలు చేశామన్నారు.జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ సభలో తీర్మాణం చేశామన్నారు. తెలంగాణలో 5000 పైచిలుకు విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులు తమ హక్కులను సాధించుకోవాలని కోరారు.. అదేవిధంగా పనిచేస్తున్న కంట్రీబుటర్లు స్ట్రింగర్స్ కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జర్నలిస్టు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు ఫణీంద్ర, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బుక్క రాంబాబు,ఉపాధ్యక్షులు గట్టు అశోక్‌కుమార్,జై కిసాన్ శీను,కార్యదర్శి చల్లా రామారావు, మున్నూరుకాపు యూత్ అధ్యక్షులు నల్లకుంట సందీప్, యూత్ సెక్రెటరీ కొండేటి సతీష్, మున్నూరుకాపు మహాసభ పట్టణ జనరల్ సెక్రెటరీ ఎలిమినేటి నవీన్,తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

నవతెలంగాణ-మఠంపల్లి

మండలంలోని యాతవాకిళ్ల గ్రామంలో పౌరహక్కులపై బుధవారం సర్పంచ్ కోలాహలం లక్ష్మీనర్సింహారాజు అధ్యక్షతన అవగాహనాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మామిడి జానకిరాములు మాట్లాడుతూ పౌరులకు సంబంధించిన హక్కులపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ సుజిత్‌కుమార్,ఏపీఓ ఉమా, సౌజన్య పి .నాగిరెడ్డి,టి.సైదులు తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో...

ఓటు నమోదుపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-నేరేడుచర్ల

పట్టణంలోని న్యూ అరబిందో డిగ్రీ, స్పందన కళాశాలలో ఓటు నమోదుపై తహసీల్దార్ సైదులుగౌడ్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ అక్టోబర్ ఫస్ట్ లోగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు.ప్రతి ఏడాది నాలుగు సార్లు ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తుందని ఈ అవకాశాన్ని యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల కరస్పాండెంట్ కట్ట ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు ఆంజనేయులు, శ్రీధర్,సతీష్,చారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీవో వీరబ్రహ్మాచారి అన్నారు.మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఫారం 6, 7 ,8 ద్వారా ఓటరు నమోదు,డిలేషన్స్, కరెక్షన్స్ చేసుకోవచ్చన్నారు. ఆగస్ట్ 26 ,27 తేదీలలో మొదటివిడత ఓటుహక్కు నమోదు కార్యక్రమం పూర్తి అయిందని, సెప్టెంబర్ 2 ,3 వతేదీలలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూతులెవల్ అధికారులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు అందుబాటులో ఉంటారన్నారు.అన్ని పార్టీల ప్రతినిధులు 326 పోలింగ్ కేంద్రాలకు బీఎల్ఏ వివరాలు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి ,డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్,అల్లావుద్దీన్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి : ఎంపీపీ

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

మండలపరిధిలోని మర్రిగూడెం గ్రామంలో బుధవారం మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు దళితవాడలో రాజ్యాంగ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ మాట్లాడారు.భారత రాజ్యాంగం ప్రకారం కుల, మత వర్గ విచక్షణ లేకుండా అందరికి సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు.వాటిని ఎవరూ హరించరాదన్నారు.తెలంగాణ ప్రభుత్వం దళిత, సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, దళితబంధు పథకం అమలు చేస్తోందన్నారు.ఎస్సీ కార్పోరేషన్ ద్వారా మర్రిగూడెం గ్రామంలో 8 ఎకరాల కార్పోరేషన్ ద్వారా మర్రిగూడెం గ్రామంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని పంపిణీ చేశామన్నారు.సమాజంలో అధికారులకు ఫిర్యాదుకు గురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెల్లా సైదులు, తహసీల్దార్ ఎం.నాగార్జున్‌రెడ్డి, ఎంపీఓ లావణ్య,డిప్యూటీ తహసీల్దార్ సుధ, ఆర్ఐ షరీఫ్, ఏఎస్ఐ బలరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి,వార్డుసభ్యులు పాల్గొన్నారు.

పండ్లు,కూరగాయలకు విలువ జోడింపుపై గ్రామస్తులకు శిక్షణ

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలంలోని దూపహాడ్ గ్రామంలో గడ్డిపల్లి కెవికె లో శిక్షణ పొందుతున్న సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినిలు పండ్లు, కూరగాయలకు విలువ జోడింపుపై గ్రామస్తులకు బుధవారం శిక్షణ కల్పించారు. అందులో భాగంగా ఎలాంటి రసాయనాలు లేకుండా సులువుగా ఇంట్లోనే చేసుకునే కొన్ని రకాల జామ్స్, కేచప్, స్క్వాష్, మరియు టుటీ ఫ్రూటీలను తయారు చేశారు.గ్రామస్తులతో కూడా చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ డిగ్రీ విద్యార్థినులు దీపికరెడ్డి, శివాని, పుష్ప, భాగ్యశ్రీ, శార్వాణి, శ్వేత, మనోగ్న, దివ్య, వైష్ణవి, గ్రామస్తులు శ్రీనివాస్, వీరభద్రయ్య, రాజు, కవిత, పద్మ శిరోమణి, లింగమ్మ సుజాత, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ సునీత

నవ తెలంగాణ -ఆలేరు టౌన్

రక్షబంధన్ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని ప్రతిబింబిస్తుందని, భారతీయ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాఖీతో అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సోదరులంతా తమ అక్కాచెల్లెళ్లపై అనిర్వచనీయమైన ప్రేమను కురిపించడంతోపాటు వారి రక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు అనురాగంతో తమ అన్నాదమ్ముల చేతికి రాఖీ కట్టడం గొప్ప సందర్భంగా అభివర్ణించారు.

నారాయణరెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే పైళ్ల

వతెలంగాణ-వలిగొండ రూరల్

మండలంలోని పహిల్వాన్ పురం సర్పంచ్ తుమ్మల వెంకట్ రెడ్డి తండ్రి తుమ్మల నారాయణ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందడంతో స్థానిక శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్ రాజ్ , గుర్రం లక్ష్మారెడ్డి,సోలిపురం సాగర్ రెడ్డి, సుర్కంటి వెంకట్ రెడ్డి,కొమురెల్లి సంజీవ రెడ్డి,తుమ్మల వెంకట్ రెడ్డి,బోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ అనుబంధం రక్షా బంధన్

- తోబుట్టువులపై ప్రేమానురాగాలను ప్రతీక
- పుట్టింటికి పయనమవుతున్న మహిళలు



నవతెలంగాణ-బొమ్మలరామారం

కాలం మారినా, దూరం పెరిగినా చెరగని బంధం అన్నాచెల్లెళ్ల అనుబంధం.... అక్కాతమ్ముళ్ల అనురాగాలు, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ. జీవితంలో తనకు ఎల్లవేళలా రక్షణగా ఉండాలని సాధక బాధకాల్లో తోడుగా నిలవాలని అన్నాదమ్ముళ్లకు రాఖీ కట్టడానికి పుట్టింటికి పయనమయ్యారు.

పేద, ధనిక తారతమ్యం లేదు. కుల మతం పట్టింపులు లేవు. వయస్సుతో సంబంధం లేకుండా అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలతో నిర్వహిందుకునే పండుగ రాఖీ పౌర్ణమి.. నువ్వు చల్లగా ఉండాలి... సోదరా అంటూ ఆడపడుచులు రాఖీ కడితే.. మీకు అండగా నేనున్నా సోదరి అంటూ సోదరుడు భరోసా ఇచ్చే వేడుక ఇది.నువ్వు నాకు రక్షనేను నీకు రక్ష మనమిద్దరం దేశానికి రక్ష రాఖీ సంప్రదాయం దేశ చరిత్ర. సంస్కృతిలో భాగంగా ఎదిగింది. రాఖీ పండుగను జరుపుకునేందుకు అనేక చరిత్రలున్నాయి.ఒక ప్రాంతంలో ఒకో రకంగా పండుగను పిలుస్తారు. ఒక ప్రాంతంలో రాఖీ పండుగకు ఒక కారణాలు చెబుతుంటారు. ప్రతి సంవత్సరం శ్రావణ పౌర్ణమి రోజు జరుపుకునే పండుగకు ఎంతో ప్రత్యేకతఉంది.

కొనుగోలు సందడి : రాఖీ పర్వదినం సందర్భంగా తమ సోదరులకు రాఖీలు కొనుగోలు చేసేందుకు దుకాణాల్లో సందడి చేస్తున్నారు.విభిన్న ఆకృతులలో ఆకర్షణమైన రంగులు,చూడగానే ఆకట్టుకుంటున్న మోడల్స్ కనివిందు చేస్తున్నాయి.చిన్నారులు టీవీల్లో వీక్షించే కాటన్ బొమ్మలతో రాఖీలను ప్రత్యక్షంగా తయారు చేసే అమ్ముతున్నారు. వీటిని చిన్నారులు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. స్నేహితులు దినోత్సవం, పుట్టినరోజు, ఇలా ఏ పండుగ అయినా ప్రతి ఒక్కరు నేడు వాట్సాప్, ఫేస్ బుక్ లలో శుభాకాంక్షలు తెలుపుతున్నారు.సాంకేతికత పెరిగిన నేటికి ఆదరణ తగ్గని పండుగ రాఖీ. ఎంత దూరమైనా రాఖీ పండుగ అనగానే అక్క చెల్లెలు అన్నదమ్ములు గుర్తుకు వస్తాయి.

సోదర ప్రేమకు ప్రతిరూపం...

తిరుమల కవిత వెంకటేష్ గౌడ్ హాజీపూర్ సర్పంచ్



ప్రతి సంవత్సరం నా సోదరులకు తప్పనిసరిగా రాఖీ పౌర్ణమి రోజు పుట్టింటికి వెళ్లి రాఖీ కడతా. రాఖీ సోదర ప్రేమకు ప్రతిరూపం.ఈ రాఖీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతికగా నిలుస్తుంది.

తప్పకుండా ఇంటికి వెళ్తాం..

మంజుల గృహిణి



తను ఎక్కడ ఉన్న రాఖీ పౌర్ణమి రోజు తప్పకుండా మా అన్నదమ్ములకు రాఖీ కడతా.. ఆ రోజు రాఖీ కట్టిన తర్వాత మిగిలిన పనులు చూసుకుంటా

స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ -భువనగిరిరూరల్



స్పష్టమైన ఫోటో జాబితా రూపకల్పనకు సహకరించాలని జిల్లా కలెక్టర్ వినయ్ కుమార్ రెడ్డి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిథులను కోరారు. బుధవారం ఆయన కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా తయారీపై సమీక్షిస్తూ ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో అందరూ సహకరించాలని కోరారు. సెప్టెంబర్ 19వ తేదీ వరకు ఓటరు ముసాయిదా జాబితా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లాలో 01.10.2023 నాటికి 18 ఏండ్లు వయసు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. సెప్టెంబర్ 2,3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాల ద్వారా ఓటు నమోదుకు సహకరించాలన్నారు. ఇప్పటి వరకు 16,476 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో 3626 ఆమోదించబడగా 15 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని, మిగతా 12,835 దరఖాస్తులు విచారణలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ ఎ భాస్కర్ రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బంటు రామచంద్రయ్య, గడ్డం వెంకటేష్, ఎ.కిరణ్, జిల్లా కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వర చారి, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికులంటే ఎందుకింత అలుసు

- డంపింగ్ యార్డ్‌కు నీళ్లు మోయిస్తున్న అధికారులు

నవతెలంగాణ -సంస్థాన్ నారాయణపురం



జీపీ కార్మికుల అంటే అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిన్న చూపు తగ్గడం వాళ్ల చేత ఏళ్ల తరబడిగా పెట్టి చాకిరి చేయిస్తూనే బుధవారం మండలం వావిళ్ళపల్లి గ్రామ పంచాయతీ కార్మికుల చేత అర కిలోమీటర్ దూరం చెట్లకు నీళ్ల మోయిస్తున్నారు.గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ ఉన్నప్పటికీ కక్షపూరితంగానే కార్మికుల చేత నీళ్ల మోయిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు కొంగరి మారయ్య,ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్మికులను చాలీచాలని వేతనాలతో వెట్టి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం జీతం పెరిగిన అదే తరహాలో పని భారం పెరిగిందన్నారు.శ్మశాన వాటికల్లో,రోడ్ల వెంట చెట్లకు నీళ్ల పోయించటం,గడ్డి చెక్కించటం, ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలను శుభ్రం చేయడం వంటి అనేక రకాల పనులు చేయిస్తూ సిబ్బందిని ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు.డంపింగ్ యార్డులో నీళ్ల ముగించడం దారుణ మన్నారు. అధికారులపై చట్టరీత్య చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఇట్లాంటి పనులు ఎవరు చేయించకుండా చూడాలని కోరారు.

డబ్బుందనే సునీతకు కేసీఆర్ టికెట్ ఇచ్చిండు

- రెండుసార్లు ఎమ్మెల్యే అయిన సునీతకు రూ.వందల కోట్ల ఆస్తులెక్కడివి..?
- ఎమ్మెల్యే భర్త మహేందర్ రెడ్డి షాడో ఎమ్మెల్యేగా పెత్తనం చేస్తుండు
- కాంగ్రెస్ ఆలేరు ఇన్‌చార్జి బీర్ల అయిలయ్య

నవతెలంగాణ-గుండాల



ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డికి ప్రజల్లో పేరు లేకున్నా డబ్బుందనే సీఎం కేసీఆర్ మళ్లీ టికెట్ ఇచ్చారని కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జి బీర్ల అయిలయ్య విమర్శించారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం మండలంలోని వస్తాకొండూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా దళిత వాడల్లో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని,దళితులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.అనంతరం దళిత వాడలో పల్లె నిద్ర,వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వాళ్ళ డబ్బా ఇండ్లు ఇచ్చారని తెలంగాణ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామని రాష్ట్రంలో సీఎం కేసీఆర్,ఆలేరులో ఎమ్మెల్యే సునీత దళితులను ఓట్లకోసం వాడుకుని దగా చేస్తున్నారని అన్నారు.30,40 ఏళ్లరాజకీయంలో ఉన్న నాయకులు, ఈ ప్రాంతం నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు అయినోళ్ల, మూడుసార్లుఎమ్మెల్యేగా పని చేసిన గుర్రం యాదగిరిరెడ్డి లాంటి నాయకుడు ప్రజా సేవ చేసేశారే తప్ప ఏం సంపాదించుకోలేదని,రెండు సార్లు ఎమ్మెల్యే అయిన గొంగిడి సునీత రూ.వేల కోట్లు, భూములు, బంగళాలు సంపాదించిందని,కోట్ల విలువైన కార్లలో తిరుగుతుందని, అదంతా అక్రమంగా సంపాదించింది కాకుంటే మరెక్కడిదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే భర్త మహేందర్ రెడ్డి షాడో ఎమ్మెల్యేగా పెత్తనం చేస్తుండన్నారు. ప్రజలను, ప్రతిపక్ష నాయకులను అణిచివేస్తున్నారని ఆరోపించారు.ఇన్నేండ్లు దోచుకున్నోళ్లకే సీఎం కేసీఆర్ తిరిగి టికెట్లు ఇచ్చారంటే ప్రజలు ఆలోచించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి,పీఏసీఎస్ చైర్మెన్ లింగాల భిక్షం గౌడ్,మాజీ ఎంపీపీ ద్యాప కృష్ణారెడ్డి,ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరుపు యాదగిరి గౌడ్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పొన్నగాని నారాయణ గౌడ్ నాయకులు సూదగాని రామచంద్రయ్య, పొడిశెట్టి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

నవతెలంగాణ-చౌటుప్పల్

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాకిటి నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది సత్యనారాయణపై జరిగిన దాడికి న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చట్టం ద్వారా న్యాయవాదులకు పూర్తి రక్షణ కలుగుతుందని తెలిపారు. న్యాయవాదిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయం కోసం పోరాడే న్యాయవాదులకే రక్షణ లేనప్పుడు సామాన్యులకు రక్షణ ఎలా కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పాల పరమేశ్, ఉపాధ్యక్షులు తాడూరి పరమేశ్, లైబ్రేరియన్ జక్కర్తి శేఖర్, ముత్యాల సత్తిరెడ్డి, స్వాతి, పిట్టల బిక్షమయ్య, గంగదేవి రవీందర్, జె.శ్రీశైలం, ఎం.నర్సింహాగౌడ్, బడుగు శ్రీకాంత్, డి.శ్రీశైలం, జంగయ్య, రాఘవేందర్ పాల్గొన్నారు.



దామెరలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలో ఆదివారం రోజున కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బట్టపోతు రాములు మూడవ వర్ధంతి సందర్భంగా బట్టబతు రాములు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది.సర్పంచి నా రెడ్డి అండాలుసాయి రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిమ్మల మమతాశేఖర్ గౌడ్,బట్టపోతు విజయ్, మాజీ ఎంపిటిసి బట్టపోతు కరుణ,డాక్టర్ వరుణ్, పంచాయతీ కార్యదర్శి కల్పన,ఎంప ఖయ్యూం, నరసింహారెడ్డి,నర్సిరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పై కేసు నమోదు చేయాలని వినతి

నవతెలంగాణ- ఆలేరుటౌన్

నాగర్ కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాల్చి చంపేస్తానంటూ ఘాటు వ్యాఖ్యలతో రెచ్చగొట్టి, టీఆర్ఎస్ కార్యకర్తలతో కొట్టిచ్చి చంపుతానని బెదిరింపులు పాల్పడినందుకు కాంగ్రెస్ కార్యాకర్తలు ఆలేరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు. చర్యలు తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిగిరి విద్యాసాగర్ , యూత్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కర్రే అజయ్ ,పర్రె రమేష్, ఆంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ -యాదగిరిగుట్ట రూరల్



బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు తీసుకొచ్చి, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లిలో బుధవారం నూతనంగా నిర్మించనున్న పూసల సంఘం కమిటీ హాల్ భవనంకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. బీసీలకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం ద్వారా వారు ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చెర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి, యాదగిరిగుట్ట మున్సిపల్ వైస్ చైర్మెన్ కాటంరాజు, సతీష్, నవీన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఎల్లవేళలా అండగా కేసీఆర్ ప్రభుత్వం



నవతెలంగాణ- యాదగిరిగుట్ట రూరల్

పేదలకు ఎల్లవేళలా కెసిఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌చైర్మెన్ తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు వైస్ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. గొంగిడి మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సహకారంతో బుధవారం, యాదగిరిగుట్ట మండలం చోల్లేరు గ్రామానికి చెందిన వడ్లకొండ భారతమ్మ భర్త పెంటయ్యకు ఇటీవల అనారోగ్యం కారణంగా హైదరాబాదులోని నిమ్స్ హాస్పటల్లో చికిత్స కోసం 2 లక్షల రూపాయల ఎల్‌ఓసి చెక్కును అందజేసి, ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండల జడ్పిటిసి తోటకూరి అనురాధ, చోల్లేరు సర్పంచ్ తోటకూరి బీరయ్య మాజీ ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్ గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరం

నవతెలంగాణ -ఆలేరుటౌన్



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు ఒక వరం లాంటిదని ఆలేరు పురపాలక సంఘం చైర్మెన్ శంకరయ్య అన్నారు.ఆలేరు మున్సిపల్ పరిధిలోని 12వార్డులలో బుధవారం కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్ గౌడ్,ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోరెడ్డి శ్రీనివాస్,స్థానిక కౌన్సిలర్లుబేతి రాములు,దాసి నాగలక్ష్మి సంతోష్,మొర్తల సునీత రమణారెడ్డి,కందుల శ్రీకాంత్,ఆలేరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ వెంకటేష్, కుండే సంపత్, పట్టణ ప్రధాన కార్యదర్శి శరబ్ సంతోష్, దయ్యాల సంపత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూతాటి అంజన, పూల శ్రవణ్, మహమూద్, భరత్, ఎస్సీ సెల్ అధ్యక్షులు దుర్గేష్, బీజని మధు కుమార్, కోనాపురం నాగరాజు, సీసా సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చందనలో రాఖీపౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని చందన స్కూల్‌లో బుధవారం విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని స్వీట్లు పంపిణీచేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ అవ్వారి రామేశ్వరి మాట్లాడారు. సోదరి సర్వతోముఖ వికాసానికి సోదరుడి బాధ్యత గుర్తు చేసేదే రక్షా బంధన్ అన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధం ఎంతో తియ్యనైంది, గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, నర్మద, పద్మ, రేణుక, గీత, జగదీశ్వరి, స్రవంతి, కవిత పాల్గొన్నారు.

ప్రగతి హై స్కూల్ లో రక్షాబంధన్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామం ప్రగతి హై స్కూల్ ఆవరణలో స్కూల్ విద్యార్థులు ముందస్తుగా ఒకరినొకరు రాఖీ కట్టుకోవడం జరిగింది.రక్షాబంధన్ విశిష్టతను పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ సయ్యద్ వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ లో రక్షాబంధన్ వేడుకలు

నవతెలంగాణ- వలిగొండ

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా స్థానిక ఎస్సై పెండ్యాల ప్రభాకర్ కి పోలీస్ సిబ్బందికి ఎస్ఎఫ్ఐ మండల నాయకురాలు కావ్య రాఖి కట్టి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ దేశంలో ఆడపిల్లలపై జరుగుతున్న దాడులు అరికట్టాలన్నారు మీ ద్వారా ఆడపిల్లలకు రక్షణకు మరింత ముందుండాలన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు,జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు,మండల ఉపాధ్యక్షులు వేముల జ్యోతిబాస్ లక్ష్మణ్,శివమణి విష్ణు,తదితరులు పాల్గొన్నారు .

ఉపసర్పంచ్‌పై అవిశ్వాసం తీర్మానం

నవతెలంగాణ- సంస్థాన్ నారాయణపురం



నారాయణపురం గ్రామ ఉపసర్పంచ్ ఉప్పరగొని సంజీవను ఉప సర్పంచ్ పదవి నుండి తొలగించాలని కోరుతూ 9 మంది వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం చేశారు. బుధవారం నారాయణపురం గ్రామం పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ సికిలమెట్ల శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వార్డు సభ్యులు 9 మంది వార్డు సభ్యులు ఉప సర్పంచ్ సంజీవను ఆ పదవి నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిసింది. ఉప సర్పంచ్ సంజీవ గత మూడు పర్యాయాలు గ్రామపంచాయతీ నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి హాజరు కాకపోవడమే కాకుండా జాయింట్ చెక్ పవర్ కలిగినా ఆయన సరైన సమయానికి చెక్కుల పైన సంతకాలు పెట్టడం లేదని ఆరోపిస్తూ ఆయన ను ఆ పదవి నుంచి తొలగించాలని అవిశ్వాస తీర్మానం చేసినట్టు తెలిసింది.ఉప సర్పంచ్ సంజీవ గతంలోనూ సస్పెండ్ అయ్యారు. సరైన సమయంలో చెక్కుల పైన సంతకాలు పెట్టకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లించడంలోను, అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని సర్పంచ్ శ్రీహరి, కొంతమంది వార్డు సభ్యులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన అధికారులు ఆయన్ను కొంతకాలం సస్పెండ్ చేశారు.ఉప సర్పంచ్ తన ప్రవర్తనను మార్చుకోకుండా మళ్లీ అదే పద్ధతిని కొనసాగిస్తుండడంతో వార్డు సభ్యులు ఆయన్ను తొలగించి కొత్త వ్యక్తిని నియమించాలని కోరుతూ అవిశ్వాస తీర్మానం చేశారు.ఈ తీర్మానం కాపీని జిల్లా కలెక్టర్,డిపిఓ,డిఎల్పీఓ కు అందజేయనున్నట్లు తెలిసింది.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని మొగిలిపాకలో గ్రామానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు 20 లక్షలుగా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను బిఆర్ఎస్ జిల్లా నాయకులు ముద్దసాని కిరణ్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం అదే గ్రామానికి గ్రామానికి చెందిన మొగిలిపాక మల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన మృతదేహం పై పూలమాల వేసి నివాళులు అర్పించి, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో నరసింహ,బిక్షపతి, జక్కుల శంకరయ్య, మొగిలిపాక రమేష్,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మద్దెలమ్మ దేవాలయంలో హోమం

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని మణికంఠనగర్‌లోని శ్రీశ్రీశ్రీ మరుద్వతి మద్దెలమ్మ దేవాలయంలో బుధవారం బోనాల ఉత్సవం సందర్భంగా దేవాలయకమిటీ ఆధ్వర్యంలో హెూమం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు గోశిక స్వామి, ఉపాధ్యక్షులు గుర్రం నర్సింహా, కార్యదర్శి గోశిక రవీందర్, సహాయకార్యదర్శి గంజి రామచంద్రం, కోశాధికారి జెల్ల నర్సింహా, గోశిక కరుణాకర్, వనం రాజు, బాల్యం చంద్రయ్య, నల్ల రమేశ్, జయశ్రీ, కోడి వనిత పాల్గొన్నారు.

రక్షణ లేని పాఠశాలలు..పారిపోతున్న పిల్లలు

- ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొడారి వెంకటేష్

నవతెలంగాణ-భువనగిరిరూరల్

యాదాద్రి భువనగిరి జిల్లాలోని గురుకులాలు, కస్తూరిబా పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు , పాఠశాలల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పిల్లలు పారిపోతున్న సంఘటన చోటుచేసుకోవడం విచారకరమని ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడారి వెంకటేష్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల18న జిల్లా కేంద్రం లోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి, పాఠశాల నుండి పారిపోయిన సంఘటన మరవకముందే ఆగస్టు 27 న బీబీనగర్ మండల కేంద్రంలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నుండి మరో విద్యార్థిని పారిపోయిన సంఘటన జరగడం, ఈ నెల30 న భువనగిరి జిల్లా కేంద్రంలోని బీచ్ మహల్లా ప్రాథమిక పాఠశాల నుండి మరో విద్యార్థిని పాఠశాల నుండి పారిపోయిన సంఘటనలు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి చొరవ తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'30పడకలను 15పడకలుగా ఎలా తగ్గిస్తారు'

నవతెలంగాణ -ఆలేరుటౌన్

ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో 30పడకల స్థాయి నుండి 15 పడకల స్థాయి వరకు తగ్గించి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని జనరల్ బాడీ మీటింగ్ లో, వైద్య ఆరోగ్యశాఖ తీరుపై , కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, మాజీ శాసనసభ్యులు, డాక్టర్ కుడుదుల నగేష్, తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆస్పత్రిలో వైద్యులు సకాలంలో హాజరు కావడం లేదని తన పరిశీలన తేలిందని ఆరోపించారు. గతంలో పారదర్శకంగా పనిచేస్తున్న వైద్యుల పై, ఆస్పత్రి లక్ష్యంగా వ్యాపారం చేస్తున్న కొందరు ఆరోపణలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి , కలెక్టర్ వినయ కృష్ణారెడ్డి ముందు నిలదీశారు. పరిస్థితులను చకదిద్ది ప్రజలకు ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ- రాజాపేట

రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్ రెడ్డి బుధవారం రాజాపేట లో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి ఏజెంట్ శిక్షణ కమిటీ సమావేశంలో పేర్కొన్నారు. కార్యకర్తలు క్రమశిక్షణతో సైనికుల్లాగా పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బూత్ సాయి ఏజెంట్లను నియమించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ ధనావత్ శంకర్ నాయక్ ,మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ గౌడ్ , మంచాల వీరేశం, బుడిగే పెంటయ్య, బసవరాజు గౌడ్, సత్యనారాయణ , రాంజీ నాయక్, బాల మల్లేశం, నర్సింలు, చల్లూర్ చిన్న పోచయ్య ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంజ నరేష్ ,కటకం గణేష్ ,కటకం శివ ,మహేష్ అన్ని గ్రామ శాఖల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



'నాగార్జున' లో ఘనంగా రాఖీ ఉత్సవాలు

నవతెలంగాణ-నూతనకల్

మండలకేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు రాఖీ పండుగ ఉత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులచే విద్యార్థులకు రాఖీ కట్టించి మిఠాయిలు పంపిణీ చేశారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు మారగాని వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ రాఖీ పండుగ సోదరీ సోదరీమణులకు ప్రేమానురాగాలను పంచే పండుగ అన్నారు. ఈ పండుగకు కుల మత భేదాలు ఉండవని,సోదరభావంతో జరుపుకోవచ్చని విద్యార్థులకు సూచించారు.రాఖీ పండుగ విశిష్టతను వారికి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మారగాని విజయలక్ష్మి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు గుర్రం యాదగిరి గౌడ్,రాజేశ్వరి, రామన్న,రమేష్,సాయిరాం, వీరన్న,యశ్వంత్,రాము,శ్రీలత, మౌనిక,రాజేశ్వరి,అనూష, జ్యోత్స్న, సునీత, శృతి,శ్రేయ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ గుండెపురి గ్రామ కమిటీ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మండలం, గుండెపురి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్‌తో పాటు ఎన్ఎస్‌యూఐ గ్రామ కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మెడిదే శ్రీకాంత్,ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా అవిరబోయిన సందీప్‌లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్య నిర్వాహక అధ్యక్షులు, గుండెపురి ఎంపీటీసీ ధరావత్ జుమిలాల్, ఎన్ఎస్‌యూఐ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్, తిరుమలగిరి పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్,గుండెపురి గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డు బాలకృష్ణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్‌యాదవ్,కౌన్సిలర్ భాస్కర్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ ఒకటిన మహాధర్నా


నవతెలంగాణ-తిరుమలగిరి

యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటో తారీఖున హైదరాబాదులో ఇందిరాపార్క్ దగ్గర జరిగే మహా ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని యూఎస్పీసీ నాయకులు సున్నపోజు సోమయ్య, సిహెచ్. సోమయ్య బుధవారం కోరారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు వచ్చే పిఆర్సి బకాయిలను, డిఏ ఏరియర్స్ ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.యు ఎస్ పి సి డిమాండ్ల ప్రకారం1. 2023 జూన్ 30తో తెలంగాణ మొదటి పి ఆర్ సి గడువు ముగిసినందున వెంటనే రెండో పి ఆర్ సి నియమించాలని కోరారు.1 / 7 2023 నుండి మధ్యంతర భృతి,ఐఆర్ ప్రకటించాలని కోరారు.3. 1/ 9 / 2004 కంటే ముందే ఎన్నికై ఆలస్యంగా నియామకం చేయబడిన 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు ఇతర శాఖల ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.4. భాషా పండితులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో ఇతర స్కూల్ అసిస్టెంట్ తో సమానంగా సీనియారిటీకి రక్షణ కల్పించాలని కోరారు.పాఠశాల విద్యాశాఖ మోడల్ స్కూల్ గురుకుల గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు వెంటనే నిర్వహించాలన్నారు.పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ నాయకులు సిహెచ్ సోమయ్య, జి వెంకటరెడ్డి, నరేష్, ఆర్ మారయ్య, కే అంజయ్య, అజయ్‌కుమార్,ఎం. సైదులు,రవిబాబు, హుస్సేన్, డి ఎల్లయ్య, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై బీజేపీ నాయకుల అసత్యప్రచారాన్ని ఖండిస్తున్నాం

నవతెలంగాణ-తుంగతుర్తి

ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్‌పై బీజేపీ నాయకుల అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు .బుధవారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.తుంగతుర్తి నియోజకవర్గం ఏకపక్షంగా మారడాన్ని జీర్ణించుకోలేని బీజేపీ నాయకులు అసత్యఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో గాదరి కిషోర్ కుమార్ హ్యాట్రిక్ విజయం ఖాయమని జోస్యం చెప్పారు. సెప్టెంబర్ 1న ఉదయం 9 గంటలకు తుంగతుర్తి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు ,మండల ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ దొంగరి శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ గోపగాని రమేష్‌గౌడ్ ,పులుసువెంకటనారాయణ, పట్టణఅధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎంపీ కోమటిరెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

నల్లగొండ అసెంబ్లీ స్థానం బీసీలకు కేటాయిస్తా అన్నందుకు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్లెక్సీకి జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్లో కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు మాట్లాడుతూ నల్లగొండ అసెంబ్లీ స్థానం బీసీలకు కేటాయించి సీటును త్యాగం చేస్తానన్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల విజయ్‌కుమార్, సోమరాజు, కారింగు నరేష్‌గౌడ్, పాన్గల్లపల్లి నాగరాజు, కర్నాటి రాజు తదితరులు పాల్గొన్నారు.



'ఛలో ఇందిరాపార్క్' ధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-మునుగోడు

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్ పీసీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 న రాష్ట్ర స్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా బాధ్యులు, కే .రత్నయ్య, గేర నర్సింహ కోరారు. బుధవారం మునుగోడు ఉన్నత పాఠశాలలోని నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వెంటనే వేతన సవరణ కమిషన్ (పిఆర్సి)ను నియమించి ఐ ఆర్ (ఇంటరిం రిలీఫ్) ను ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు, సోమగాని సతీష్ కుమార్, గోరంట్ల సుధాకర్, అంజయ్య సత్తిరెడ్డి, రామ్మూర్తి, కళావతి, చంద్రం, వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులు యాదయ్య తదితర సభ్యులు పాల్గొన్నారు.


నాంపల్లిలో...

రాఖీ ఆకారంతో వేడుకలు

నవతెలంగాణ-నాంపల్లి

మండల కేంద్రంలోని గాంధీజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చొని రాఖీ పండుగ ప్రత్యేకత గురించి తెలియజేస్తూ పాఠశాలలో చదువుతున్న అమ్మాయిలు అబ్బాయిలకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బంధనాదం సురేష్, రవీందర్, కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దవూర :పెద్దవూర మండలం లోని పోతునూరు ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సక్కునాయక్ విద్యార్థులకు రక్షాబంధన్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, లావణ్య, వాణి, ధర్మారెడ్డి, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవ నాయకుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్

జిల్లా యాదవ సంఘం పిలుపుమేరకు నల్లగొండ క్లాక్ టవర్ వద్ద నిరసన వ్యక్తం చేయడానికి వెళ్తున్న యాదవులను పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో మిర్యాలగూడ పట్టణ యాదవ సంఘం అధ్యక్షుడు క్రాంతి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. తరలించిన వారిలో గంగుల బిక్షంయాదవ్, మహేష్ యాదవ్, ఎర్రయ్యయాదవ్, మురళియాదవ్, నాగేశ్వర్ యాదవ్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకే దళితబంధు

నవతెలంగాణ-కట్టంగూర్

ప్రభుత్వం నిరుపేద దళితులకు అందించే దళిత బంధు కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే అందజేస్తూ అర్హులైన దళితులను పట్టించుకోవడంలేదని బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గోలి ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గార్లబాయిగూడెం గ్రామం ఎస్సీ కాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధును అర్హులైన వారికి ఇవ్వకుండా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. దళిత బంధు అర్హులైన వారి వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సంఘం నాయకులు జానయ్య, జనార్ధన్, సతీష్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

వట్టె జానయ్యపై జరుగుతున్న దాడులకు నిరసనగా బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేటలో జరగనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా మండలంలోని వివిధ గ్రామాలలోని ఆ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ఆ పార్టీ నాయకులు రణపంగ శ్రవణ్, భీమపంగు రాజు, కొండమీది బుచ్చిబాబు, రాజేష్, నవీన్, చింటు, తదితరులు ఉన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-చివ్వెంల

సెప్టెంబర్ ఒకటో తేదీన సీపీఎస్ విద్రోహదినంగా పురస్కరించుకొని హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ పోరాట కమిటీ మండల నాయకులు శ్రీనివాసాచారి కోరారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుంజలూరులో మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, సైదా,నర్సిరెడ్డి,రేణుక,శ్రీనివాస్, జ్యోతి పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ఆరుగురు కూలీలకు గాయాలు

నవతెలంగాణ-వేములపల్లి



అదుపుతప్పి ఆటో బోల్తా పడడంతో ఆరుగురు కూలీలు తీవ్ర గాయాల పాలైన సంఘటన మండలంలోని సల్కునూర్ గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన కూలీలు తిప్పర్తి మండలం సర్వారం గ్రామంలో పత్తి చేలో కూలీ పనులకు వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా సల్కునూరు సమీపంలో ఆటో అదుపుతప్పడంతో పల్టీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో 11 మంది కూలీలు ఆటోలో ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ప్రమాదంలో రావులపెంట గ్రామానికి చెందిన మొండి కత్తి నాగమ్మ, శీలం మంగమ్మ, ఎస్‌కె. శాలేహాలకు కాళ్లు విరిగిపోయాయి. ఇంద్రపల్లి లచ్చమ్మకు చేయి విరిగినట్లు సమాచారం. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రైవేట్ అంబులెన్స్ ద్వారా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

'తెలంగాణలో కాంగ్రెస్‌జెండా ఎగరడం ఖాయం'

నవతెలంగాణ-మునుగోడు

తొమ్మిది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి కుటుంబ పాలన సాగిస్తున్న కేసీఆర్‌ను గద్దెదింపి రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు రాష్ట్రంలోని ప్రజలు సిద్ధంగా ఉన్నారని మునుగోడు మాజీ ఎంపీపీ పోలగోని సత్యం ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికలలో వామపక్షాలతో పొత్తులు నియోజవర్గ కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే ఉంటుందన్నారు. మునుగోడులో కాంగ్రెస్ గెలుపొందే అభ్యర్థులకే కాంగ్రెస్ అధిష్టానం టికెట్ కేటాయిస్తుందని సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను కాంగ్రెస్ నాయకులు నమ్మొద్దని అన్నారు . ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నన్నూరు విష్ణువర్ధన్ రెడ్డి , మండల అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్ , మేక ప్రదీప్ రెడ్డి , కిష్టాపురం ఎంపిటిసి భీమనపల్లి సైదులు , పట్టణ అధ్యక్షులు యాసరాని దినేష్ , మండల సీనియర్ నాయకులు ముచ్చపోతుల నరసింహ , బొమ్మ గోని అనిల్ , పగిళ్ల శ్రీను , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నక్క వెంకన్న యాదవ్ , జాల చందు , నాగరాజు , స్వామి తదితరులున్నారు.



దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇంటిస్థలాల పట్టాలివ్వాలి

నవతెలంగాణ-మాడుగులపల్లి

మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో సర్వే నెంబర్ 15 లో గల ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాల కోసం కేటాయించారు. అందులో భాగంగా గ్రామంలో మొత్తం 194 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కానీ అందులో 74 మందికి మాత్రమే పట్టాలు ఇస్తున్నారు.మిగతా 120 మందికి కూడా పట్టాలివ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.గ్రామంలో మొత్తం ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 15,184,193,194 లో సుమారు 11.20 ఎకరాల భూమి ఉంది.ఇట్టి భూమిని ఇంటి స్థలాలు లేని వారందరికీ పట్టాలు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మాడ్గులపల్లి ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, నాయకులు భూపతి ఊశయ్య, బొడ్డు రమేష్, పర్వతబోయిన లక్ష్మణ్, పతాని శ్రీను, బంటు రాజు తదితరులు ఉన్నారు.

పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడికి మాతృవియోగం

నవతెలంగాణ-నకిరేకల్

పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు యలగందుల కృష్ణమూర్తి మాతృమూర్తి ఎలగందుల లక్ష్మమ్మ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. బుధవారం టి పి సి సి రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ సింగిల్విండో చైర్మన్ గార్లపాటి రవీందర్ రెడ్డి, నాయకులు చింతల శ్రీనివాస్, ఒంటెపాక నాగయ్య, ఎండి యూసుఫ్, ప్రసాద్, మహేష్, సురేష్, సతీష్ పాల్గొన్నారు.

చురుకుగా ఇంటింటికి కరపత్రాల పంపిణీ

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని డాక్టర్స్ కాలనీలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ హామీల కరపత్రం పంపిణీ కార్యక్రమాన్ని చురుకుగా నిర్వహిస్తున్నారు. టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యవర్గ కార్యదర్శి దైద రవీందర్ ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ గార్లపాటి రవీందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నకిరేకల్ టౌన్ అధ్యక్షుడు చనగోని రాజశేఖర్ గౌడ్ , వంటెపాక ప్రసాద్ , వంటెపాక నక్షత్ , నర్సింగ్ మహేష్ గౌడ్ , మొహమ్మద్ జావీద్ పాషా ,చనగోని నాగరాజు , చెరుపల్లి సైదులు , మాచర్ల శేఖర్ , మధు , పల్లపు ముత్యాలు , పట్టేటి వెంకటేష్ , పశుపతి , జంపాల క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ధర్మపురం సొసైటీ మత్స్య పారిశ్రామిక ఎన్నికలు

నవతెలంగాణ-మాడుగులపల్లి

మండలంలోని ధర్మపురం గ్రామంలో బుధవారం మత్స్య పారిశ్రామిక ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. సొసైటీ చైర్మెన్‌గా సింగారపు యాదయ్య ముదిరాజ్, వైస్ చైర్మెన్‌గా సింగారపు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా సింగారపు అర్జున్ ముదిరాజ్, డైరెక్టర్లు పూల పపాయ్యా ముదిరాజ్, పూల సైదులు ముదిరాజ్, దొండ సతీష్ ముదిరాజ్, బియ్య సోమేశ్వర్ ముదిరాజ్, బియ్య కోటేష్ ముదిరాజ్, సింగారపు శీను ముదిరాజ్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ చింతరెడ్డి యాదగిరిరెడ్డి, మాడుగులపల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తవిటి సైదులు ముదిరాజ్, ఎన్నికల అధికారులు తదితర సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

జానయ్యపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్గొండ డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్‌పై మంత్రి జగదీశ్‌రెడ్డి అక్రమ కేసులను పెట్టించినందుకు నల్లగొండ జిల్లా కేంద్రం క్లాక్ టవర్ సెంటర్లో యాదవ సంఘం నాయకులు మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దమనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. మంత్రి గెలుపుకు కృషి చేసిన జానయ్య యాదవ్ పై అక్రమ కేసులు పెట్టి దిగజారుడు రాజకీయాలు చేయడం తెగదన్నారు. రాబోయే ఎన్నికలో ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి అల్లివేణి యాదవ్,జాతీయ యాదవ కుల పోరా సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాముల యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలక శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ అల్లి సుభాష్ యాదవ్, గుండెబోయిన వెంకన్న యాదవ్, లోహిత్ యాదవ్, యూత్ అధ్యక్షుడు రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు

ట్రాఫిక్ సీఐ దానియల్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని ట్రాఫిక్ సిఐ బీ. డానియల్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందిలో దుంప సంపత్ తండ్రి మల్లయ్య, కుంటిగోర్ల నవీన్ తండ్రి ఉప్పలయ్య లకు మూడు రోజుల జైలు కట్టెబోయిన నవీన్ తండ్రి వెంకయ్య కి రెండు రోజుల జైలు శిక్ష, జరిమానా మిగిలిన 12 మంది వ్యక్తులకు జరిమానా విధించారని వివరించారు. మొత్తం 15 మందికి గాను 21500 రూపాయల జరిమాన విధించారని ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐతో పాటు, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

జీవో 59 లబ్దిదారులు చలనాలు చెల్లించాలి

నవతెలంగాణ-అడవిదేవులపల్లి

అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణం చేసుకున్నవారు 59 జీవో నెంబర్ కింద ఆర్జీలు చేసుకున్న వారు రెండు రోజుల్లో ప్రభుత్వానికి చలానా చెల్లించాలని తహసీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. బుధవారం 59 జీవో లబ్ధిదారుల ఇండ్లను పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుము రెండు రోజుల్లో చెల్లించాలని లేని పక్షాన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో రాఖీ పండుగ వేడుకలు

నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద పాల్గొని చిన్నారుల చేత రాఖీలు కట్టించారు. అన్నాచెల్లెల్లు, అక్క తమ్ముళ్ల అనుబంధాన్నిరాఖీ పండుగ విశిష్టతను ఆమె చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా వార్డ్ మెంబర్ పొనుగోటి రజిత చిన్నారులకు 15 పలకలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రమాదేవి, విమల దేవి, లక్ష్మి, చిన్న పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

•ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నవతెలంగాణ-దేవరకొండ



అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ మండలం ఉచారాల జర్పుల తండాకు చెందిన 60 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలను కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా నిలుస్తున్నదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సలహాదారుడు మారుపాకుల సురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, కాశిరెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బిక్కు నాయక్, జైహింద్‌రెడ్డి, దాసు, చందు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మర్రిగూడ



యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి,జిల్లా అధ్యక్షులు రాజ రమేష్ యాదవ్ ఆదేశాల మేరకు బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బేత వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో మండల యూత్ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ప్రధాన కార్యదర్శులుగా మామిడి గణేష్,సిరగోని శివ, మావిళ్ళ పరమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా కారింగు దేవేందర్,ఉపాధ్యక్షులుగా సిలువేరు ధర్మ,వెంకటంపేట దశరథ, సిరిసవాడ ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కర్నాటి నాగార్జున నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముద్దం నరసింహగౌడ్, కోశాధికారి కొట్టం శ్రీను, ఐతరాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్యే ఉజ్జినీ యాదగిరిరావు

జిల్లా కలక్టర్‌కి రాఖీ కట్టిన ఏఎన్ఎంలు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



గత 15 రోజులుగా 2వ ఏఎన్ఎంలు చేస్తున్న సమ్మె పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు కోరారు. నల్లగొండ జిల్లాలో జరుగుతున్న రెండోవ ఏఎన్ఎంల నిరవధిక సమ్మె 15 వ రోజు బుధవారం కలక్టర్ కార్యాలయం ముందు కొనసాగింది. సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రస్తుతం పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలను అందరిని బేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎంలు జిల్లా కలెక్టర్ కర్ణన్‌కు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి లెనిన్, 2వ ఏఎన్ఎంల యూనియన్ జిల్లా అధ్యక్షులు పోలే రత్నకుమారి, జిల్లా కార్యదర్శి నర్సమ్మ, పద్మ, హరతి, గీతరాని, సరిత, అన్నపూర్ణ, శోభ, అండాలు, సౌజన్య, పద్మ సలోని, అందమ్మ, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-చండూరు

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండాపురం, పుల్లెంల, ఇడికూడ, నెర్మట, తుమ్మలపల్లితో పాటు పలు గ్రామాల్లో క్రీడా సామగ్రిని యువతకు, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలోని యువత క్రీడల్లో ముందుండాలని, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలని సూచించారు. గ్రామాలలోని ప్రైమరీ, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు క్యారం బోర్డ్స్, చెస్, క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ కిట్లను అందజేశారు. స్కూల్లో సమస్యలను తెలుసుకుని అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాటలు వెంకన్న, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు యత్తపు మధుసూదన్ రావు, ఉజిని హనీల్‌రావు, సర్పంచులు బరిగల యాదమ్మ, సంధ్యారాణి, నల్ల లింగయ్య, నర్సింహరెడ్డి, తిప్పర్తి దేవేందర్, వెంకట్‌రెడ్డి, కురుపాటి రాములమ్మ, నాయకులు కురుపాటి సుదర్శన్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్ర పటానికి రాఖీ కట్టిన ఉద్యోగులు

నవతెలంగాణ-దామరచర్ల

సమగ్ర శిక్షా విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగలందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మహిళ ఉద్యోగులు దామరచర్ల ఎంఆర్‌సీ వద్ద బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రవి, లక్ష్మమ్మ, డీ.పాండు, ఎల్.శారద, పీ.డేవిడ్, పీ.రవి, కంప్యూటర్ ఆపరేటర్ బంటు వెంకటేశ్వర్లు, జే.నవనీత, ఆర్.వెంకటేశ్వర్లు, సురేఖ, నాగలక్ష్మి, వెంకటేశ్వర్లు, స్వప్న, విజయ గాంధీ పాల్గొన్నారు.

ఉద్యోగుల మృతికి సంతాపం

మెదక్ జిల్లాలో రోడ్డు ప్రమాదంలో సమగ్ర శిక్ష ఉద్యోగి ఐఈఆర్ పి సుజాత ఆమె భర్త నవీన్‌లు మృతి చెందడం పట్ల మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం సంతాపాన్ని తెలిపింది. వారి కుటుంబ సభ్యులకు రూ 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

తహసిల్దార్, ఎస్ఐలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నాంపల్లి

ఇటీవల నాంపల్లి మండలానికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ గుగులోతు దేవ సింగ్, సబ్ ఇన్స్‌పెక్టర్ లచ్చిరెడ్డిలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ము బిక్షం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ గఫార్, నాంపల్లి పట్టణ అధ్యక్షులు పానుగంటి వెంకటయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా కాంగ్రెస్ నాయకులు ఎస్.కె చాంద్ పాషా, గాదెపాక వేలాద్రి, నిమ్మల వెంకటరెడ్డి, మల్లేపల్లి వెంకటరెడ్డి, గడ్డం శ్రీను, పోలోజు సుదర్శన చారి, కామిశెట్టి యాదయ్య, ఎద్దుళ్ళ మహేష్ పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిని ఎంచుకోవాలి

ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నవతెలంగాణ-కొండమల్లేపల్లి



నేటి ఆధునిక యుగంలో యువత ఉద్యోగాల కోసం పోటీపడుతూ వృధాగా ఉండకుండా ఏదో ఒక స్వయం ఉపాధిని ఎంచుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి పట్టణంలోని సాగర్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అమూల్య ఫ్యామిలీ హోటల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. యువత ఉన్నత చదువులు చదువుతూనే ఏదో ఒక స్వయం ఉపాధి పనిని ఎంచుకోవడం ద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు అధ్యక్షులు కే. లింగారెడ్డి, జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగంధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆర్.దసురునాయక్, ఎలిమినేటి సాయి, ఆయా గ్రామాల సర్పంచులు భీమ్ సింగ్, రాము నాయక్, దీప్లాల్, నజీర్ మౌలానా ,నిర్వాహకులు పంగ సురేష్, విజయ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు : ప్రవీణ్ శర్మ

నవతెలంగాణ-చండూరు

ధూప దీప నైవేద్యం పథకం కింద అర్చకులకు రూపాయల 10,000 కేటాయిస్తూ మంగళవారం సీఎం కేసీఆర్ జీవోను విడుదల చేయడం పట్ల ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, మునుగోడు నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చిరువెల్లి ప్రవీణ్ శర్మ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన చండూరులో మీడియాతో మాట్లాడారు. దేవాలయాల యొక్క అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అఖండ ఆయురారోగ్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బ్రాహ్మణ సంఘం నియోజకవర్గం కార్యదర్శి మాడ పాపయ్య శర్మ, కోశాధికారి వేమవరపు వెంకటరమణ శర్మ ,ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, గౌరవ సలహాదారు చిరువెల్లి హరికిషన్ శర్మ, మాడ సుధాకర్ శర్మ, మాడ వెంకటరమణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి శుద్ధి విధానంపై అవగాహన

నవతెలంగాణ-మునుగోడు

నూతనంగా తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహించిన వీఆర్ఏలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పర్మెంటు చేస్తూ మిషన్ భగీరథంలో వివిధ స్థానాలలో పోస్టులను కేటాయించగా విధుల్లోకి చేరిన నూతన అధికారులకు మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్ బుధవారం మండలంలోని గూడపూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీటిపై అవగాహన కల్పించారు. ట్యాంకిలో నీటిని నిల్వ చేసుకునే విధానంతో పాటు వాటర్ ట్యాంకుల శుభ్రత , బ్లీచింగ్ పౌడర్ వినియోగంపై ల్యాబ్ ఇన్చార్జి , ల్యాబ్ టెక్నీషియన్స్ తో కలసి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచి జ్యోతి ప్రసాద్, మిషన్ భగీరథ ఏఈ మణిదీప్, సూపర్వైజర్ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు రూ.లక్ష లోన్ ఇవ్వాలని వినతి

నవ తెలంగాణ -భువనగిరి రూరల్

అర్హులైన పేద మైనార్టీలకు లక్ష రూపాయల రుణ సదుపాయం వెంటనే అందజేయాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిసిసి ప్రధాన కార్యదర్శి ఎఓ మాజహార్ ఏవో జగన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ రషీద్, హుస్సేన్, ఎండి ఆబిద్ అలీ, ఎండి ఎజాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ గెలుపు కోసం పూజల్

నవతెలంగాణ-రాజాపేట

ఆలేరు అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థిగా మూడోసారి ఎంపికైన ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో పొందాలని కోరుతూ బుధవారం మదనదుర్గమ్మ ఆలయంలో జెడ్పీటీసీ చామకూర గోపాల్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా గతంలో కంటే రెట్టింపు మెజార్టీతో గెలుపొంది మంత్రి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామిండ్ల నరేందర్ బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నకిర్త కనకరాజు పుప్పాల నరేష్ ఉన్నారు.

అక్టోబర్ 2న జర్నలిస్టుల డిమాండ్స్ డే నిర్వహించాలి

నవ తెలంగాణ- మోత్కూర్

అక్టోబర్ 2న జర్నలిస్టుల డిమాండ్స్ డే గా నిర్వహించాలని, అదే రోజు మండల కేంద్రాల్లో జర్నలిస్టులతో సెమినార్లు, తహసిల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేత లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి కోరారు. మోత్కూర్ ప్రెస్ క్లబ్ లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మీడియా రక్షణకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మారిన మీడియా పరిస్థితులపై సమీక్షించి తగిన విధి విధానాలు రూపొందించడానికి ప్రభుత్వం మీడియా కమిషన్ వేయాలని, గతంలో ప్రింట్ మీడియాకు చట్టం ఉన్నప్పటికీ ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా వచ్చిన తర్వాత మీడియా రక్షణకు చట్టం అనేది లేదన్నారు. జర్నలిస్టుల, మీడియా రక్షణకు చట్టం ఎంతో అవసరమన్నారు. జర్నలిస్టులు కాయితాల నర్సిరెడ్డి, ఎస్ఎన్.చారి, వెలిమినేటి జహంగీర్, దబ్బెటి సోంబాబు, పంగ నర్సింగరావు, ఆకవరం శ్రీనివాస్, ఎండి.షాకీర్, కాపర్తి సైమన్, గుండు ప్రసాద్, వారాల రాకేష్, అవిశెట్టి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుని ఎన్నిక

నవతెలంగాణ- వలిగొండ రూరల్

మండలంలోని నర్సాపురం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షునిగా మంతిపల్లి సుధాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శక్తి వంచన లేకుండా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.నాపై నమ్మకంతో గ్రామంలోని కాంగ్రెస్ కార్యకర్తలు అధ్యక్షునిగా ఎన్నుకున్నారని, వారి న్నమ్మకాన్ని వమ్ముచేయనని, ఎన్నికకు సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావటి మత్స్యగిరి,పిసరి శ్రీనివాస్ రెడ్డి, బుంగపట్ల నరహరి, ఏనుగుల ఉప్పలయ్య, కావటి సత్యనారాయణ, కావటి బిక్షం, సంజీవ,గండు నరేష్, ఎనుగుల నవీన్,కావటి హరీష్ ,కావటి నాగరాజు, కావటి లింగస్వామి, కావటి సూరయ్య, నెమ్మాని రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ

నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామంలో 36 మంది యాదవులకు రెండవ విడత గొర్రెల 36 యూనిట్లను బుధవారం నాంపల్లి మండల ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతా, మండల రైతు బంధు కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఏడుదొడ్ల ప్రభాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ బెక్కం రమేష్, వార్డ్ మెంబర్లు గడ్డి పుల్లయ్య, గడ్డి జంగయ్య, నల్లపు వెంకటేశ్వర్లు, గ్రామ రైతుబంధు అధ్యక్షుడు మారగోని యాదయ్య, యాదవ సోదరులు గడ్డి రాజయ్య, చాట మారయ్య, బలుసుల పెద్ద మల్లయ్య, మారగని నగేష్, బలుసుల లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-కేతపల్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన కేతేపల్లి మండలంలోని చీకటి గూడెం గ్రామ సమీపంలో 65 నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం పట్టణానికి చెందిన కారం శెట్టి నవీన్ వయసు 25 సంవత్సరాలు తన యమహా మోటార్ బైక్ పై తన సొంత పని నిమిత్తం బుధవారం తెల్లవారుజామున హైదరాబాదుకు బయలుదేరాడు. కేతపల్లి మండలం లోని చీకటి గూడెం గ్రామ శివారులో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ దగ్గరికి రాగానే , రోడ్డుపై అజాగ్రత్తగా ఎలాంటి సిగ్నల్ లేకుండా ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొట్టాడు. తనకు బలమైన గాయాలు కావడంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుని తండ్రి కారం శెట్టి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని కేతపల్లి ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

ప్రింటర్ బహూకరణ

నవతెలంగాణ- రామన్నపేట

మండలంలోని కక్కిరేణి గ్రామ ప్రాథమిక పాఠశాలకు బెస్ట్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ గౌరవ సలహాదారులు పికెమెహర్ అమెరికా నివాసి, పీవీపీరావు జ్ఞాపకార్థంగా 24వేల రూపాయల విలువగల ప్రింటర్‌ను బుధవారం ప్రైమరీ స్కూల్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.కనకసేన బుక్కా ఈశ్వరయ్య ను సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ పిట్ట కృష్ణ రెడ్డి, బుక్కాఈశ్వరయ్య, బెస్ట్ సేవా సొసైటీ ఆర్గనైజర్ వేముల సైదులు ఉపాధ్యాయులు జి.గణేష్, పి గోపాల్ రెడ్డి, వి.యోగి భాలి, భార్గవి, మల్లిక, ఈదులకంటి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై సంపూర్ణ అవగాహన పొందాలి

నవతెలంగాణ -భువనగిరిరూరల్



రాబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై సంపూర్ణ అవగాహన పొందాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి నోడల్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేటు సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ విభాగాలకు నియమించబడిన నోడల్ అధికారులతో ఆయన మాట్లాడుతూ రాబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అన్ని అంశాల పట్ల సంపూర్ణ అవగాహన పొందాలని సూచించారు. ఇక నుండి ప్రతి వారం ఒక రోజు ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించడం జరుగుతుందని, షెడ్యూలు ప్రకటన అనంతరం రెగ్యులర్ గా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టరు ఎ భాస్కరరావు, భువనగిరి ఆర్డిఓ అమరేందర్, జిల్లా నోడల్ అధికారులు, భువనగిరి, ఆలేరు నియోజక వర్గాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నోడల్ అధికారుల నియామకం

రాబోయే సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా అధికారులను బుధవారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఎన్నికల నోడల్ ఆఫీసర్లుగా నియామకం చేశారు. ఇవిఎం మేనేజిమెంట్ నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ ఎ. భాస్కరరావు, మ్యాన్ పవర్ మేనేజిమెంట్, ట్రైనింగ్ మేనేజిమెంట్ నోడల్ అధికారిగా డిఇఓ కె నారాయణరెడ్డి, మెటీరియల్ మేనేజిమెంట్ నోడల్ అధికారిగా జిల్లా, హ్యాండ్ లూమ్స్ అధికారి కె.విద్యాసాగర్, ట్రాన్స్‌పోర్టు మేనేజిమెంట్, కంప్లయింట్స్ రిడ్రెసల్, ఓటర్ హెల్ప్ లైన్ మేనేజిమెంట్ నోడల్ అధికారిగా సిపిఓ భూక్యా మాన్యా నాయక్, ఆర్టిఓ సుదర్శన్ రెడ్డి, కంప్యూటరైజేషన్ సైబర్ సెక్యూరిటీ, ఐటీ నోడల్ అధికారిగా జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి కె.రాధాకృష్ణ, స్వీప్ నోడల్ అధికారిగా మున్సిపల్ కమిషనర్ బి నాగిరెడ్డి, లా అండ్ ఆర్డర్ సెక్యూరిటీ ప్లాన్ నోడల్ అధికారిగా అసిస్టెంట్ పోలీసు కమిషనర్ ఎస్ వెంకటరెడ్డి, ఎసిసి నోడల్ అధికారిగా డిపిఓ సునంద, ఎక్స్పెండీచర్ నోడల్ అధికారిగా జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు, బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్, ఎలక్టోరల్ రోల్స్ నోడల్ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఏ శేఖర్ రెడ్డి, ఎంసిఎంసి నోడల్ అధికారిగా జిల్లా పౌర సంబంధాల అధికారి పి వేంకటేశ్వరరావు, అబ్జర్వర్స్ నోడల్ అధికారిగా డిఎస్ఓ శ్రీనివాసరెడ్డి, దివ్యాంగుల నోడల్ అధికారిగా జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి రమణి, స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్స్ నోడల్ అధికారిగా జిల్లా యువజన అధికారి కె ధనంజనేయులు, మెడికల్ నోడల్ అధికారిగా జిల్లా వైద్య అధికారి డాక్టర్ మల్లిఖార్జునరావు, ఫైర్ సేఫ్టీ నోడల్ అధికారిగా జిల్లా ఫైర్ ఆఫీసర్ పి జయకృష్ణ నియమితులైనారు.

నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆలేరుటౌన్



గృహ అవసరాలకు ఉపయోగించబడే గ్యాస్ సిలిండర్ కు 200 రూపాయలు,ఉజ్వల స్కీం కింద పొందిన మహిళలకు 400 రూపాయల చొప్పున తగ్గించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆలేరు పట్టణంలో బుధవారం నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో సముద్రాల శ్రీనివాస్,తోట మల్లయ్య, ఎలగందుల రమేష్,పగడాల శ్రీనివాస్,చిక్క శ్రావణ్, అయిలి సందీప్,కుడికాల మురళి, పస్తం ఆంజనేయులు, పత్తి రాములు,వడ్డెమాను కిషన్, తోట వెంకటయ్య,కటకం నందం,ఎలగందుల రవీందర్,పెండెం స్వామి,బండ శ్రీను,అమృతం నరసింహులు,గుర్రం నరసింహులు,జూల శ్రీధర్, కృష్ణ,రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్వారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-బీబీనగర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆల్వ బస్వారెడ్డి అకాల మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ భువనగిరి నియోజకవర్గ నాయకులు పచ్చిమట్ల శివరాజ్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని పడమటి సోమరం గ్రామంలో బస్వరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పిటిసి సంధిగారి బసవయ్య, నాయకులు ఆల్వా గోపాల్ రెడ్డి, వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు.

గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ -భువనగిరిరూరల్

జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఈవీఎం గోదామును సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది శ్రీకాంత్ లు ఉన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-దేవరకొండ

వట్టే జానయ్య యాదవ్‌పై అక్రమంగా 71 కేసులు బనాయించిన విద్యుత్ శాఖ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి చేసిన అరాచకాలను ఖండిస్తూ చలో సూర్యాపేట కార్యక్రమాన్ని వెళ్ళనీయకుండా బీఎస్పీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. బహుజన బిడ్డ ఒట్టే జానయ్య యాదవ్ కి అండగా నిలబడాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం చలో సూర్యపేట కార్యక్రమంనికి వెళ్ళనీయకుండా బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర కృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు రామావత్ రమేష్ నాయక్ ను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మతంగి జాన్, అంజయ్య తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల పట్టణంలోని నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన ముషం జయ కిషన్ ఉన్నత చదువుల కోసం ఆర్థికంగా బాధపడుతున్నాడని తెలుసుకున్న గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్ గుత్తా అమిత్‌రెడ్డి పదివేల రూపాయలు ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నగదును విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండెబోయిన సైదులు, ఎడ్ల శ్రీశైలం, కసిరెడ్డి రాజు, ఎస్‌కే. అన్వర్ తదిరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలను తగ్గించడం పట్ల హర్షం

నవ తెలంగాణ-మోత్కూర్

ప్రధాని మోడీ వంట గ్యాస్ సిలిండర్ పై రూ.400, రూ.200 ధర తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మోత్కూర్ అంబేద్కర్ చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేశారు. సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బయ్యని రాజు, ప్రధాన కార్యదర్శులు సజ్జనం మనోహర్, మరాటి అంజయ్య, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పోచం సోమయ్య, మల్లెపాక సాయిబాబా, ముత్తినేని తిరుమలేష్, టంగుటూరి వెంకన్న, చిందం శీను, నల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే హెచ్ -143 మండల నూతన కమిటీ

నవ తెలంగాణ-మోత్కూర్

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే హెచ్ - 143) మోత్కూర్ మండల నూతన కమిటీని బుధవారం మోత్కూర్ లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షునిగా గుంటి అయిలయ్య, గౌరవ సలహాదారుగా దబ్బెటి రమేష్, జిల్లా కమిటీ సభ్యులుగా మోత్కూరు ప్రదీప్ శర్మ, పంగ నర్సింగరావు, అధ్యక్షునిగా కూరెళ్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఈదునూరి కృష్ణ, ఉపాధ్యక్షులుగా వారాల రాకేష్, కూరెళ్ల విష్ణు, సహాయ కార్యదర్శిగా అవిశెట్టి యాదగిరి, కోశాధికారిగా బొడిగె శ్రీహరి, కార్యవర్గ సభ్యులుగా బోయిని వెంకటేష్, మోత్కూరు రమేష్, గోపాల్దాస్ సాయి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టులను అన్ని విధాలా ఆదుకోవాలని, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన యూనియన్ నాయకులకు, జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ -ఆలేరుటౌన్

ఆలేరు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డిని బీఆర్ఎస్ యూత్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూల శ్రవణ్, జూకంటి వెంకటేష్, మహమూద్, భరత్, మాడిశెట్టి హేమేందర్, భరత్, టింకు,శ్రీకర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీర్ల ఐలయ్యకు రాఖీ కట్టిన కాంగ్రెస్ మహిళాలు

నవతెలంగాణ -ఆలేరుటౌన్

రాఖీల పండుగ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ ఆధ్వర్యంలో బుధవారం,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి , ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య కి రాఖీలు కట్టి స్వీట్ తినిపించి రాఖీల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య చీరలను బహుమతిగా ప్రదానం చేశారు .ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు జి. దీప,పట్టణ వైస్ ప్రెసిడెంట్ ఐలాలత,విమల తదితరులు పాల్గొన్నారు.

పొగాకు దుష్పరిణామాల పట్ల అవగాహన

నవతెలంగాణ-నాంపల్లి

విద్యార్థులు పొగాకు(సిగరెట్లు, గుట్కాలు, జర్దా పాన్‌లు, తంబాకు) మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేయడం కోసం ప్రభుత్వం చేపట్టిన టీఓఎఫ్ఈఐ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాంపల్లి మండలం పెద్దాపురం గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, ఆర్.బి.ఎస్.కె మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.